RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ | 04 ఫిబ్రవరి 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:206

# ఏదులాపురం మున్సిపాలిటీ లో రోడ్‌షో నిర్వహించిన పొంగులేటీ









**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజాబలం ప్రతినిధి:**మంగళవారంనాడు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 7, 8, 9, 12, 13 వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార రోడ్ షోలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను వార్డులలో గెలిపించి, ఏదులాపురం మున్సిపాలిటీ పైన కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఈ సందర్భంగా ప్రజలకు కోరిన మంత్రి పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి ఏదులాపురం మున్సిపాలిటీని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని, వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైన్ల పనులను రాబోయే వేసవి లోపే పూర్తి చేస్తామని వార్డులలో తిరిగి భరోసా ఇవ్వడం జరిగింది.

అర్హులైన ప్రతి నిరుపేదకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, వాటిలో ఇందిరమ్మ ఇళ్లు కూడా కట్టించి ఇచ్చే బాధ్యత తీసుకుంటానని, ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, ఏప్రిల్ నుంచి వరుస విడతల్లో ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చే వరకు విశ్రమించనని హామీ ఇవ్వడం జరిగింది.

వార్డులలో ప్రచారం నిర్వహిస్తుంటే ప్రజలు స్వాగతం పలుకుతున్న తీరు, స్వచ్చందంగా ప్రచారంలో పాల్గొంటున్నహోరు చూస్తుంటే 11 ఫిబ్రవరి తేదీన జరిగే ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురడం ఖాయమని పొంగులేటీ అన్నారు.

అధికారంలో ఉన్న పదేళ్లు నిరుపేదల ఇళ్ల స్థలాల గురించి పట్టించుకోకుండా అరాచకంగా వ్యవహరించిన వారు..నేడు ఎన్నికలు రాగానే ఓట్ల కోసం ఆరాటపడుతున్నారు, అలాంటి వారిని ఆమడ దూరంలో ఉంచాలి, అభివృద్ధిని చేసే కాంగ్రెస్ పార్టీకి మద్దతిచ్చి గెలిపించు కుందామని మంత్రి పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 7, 8, 9, 12, 13 వార్డుల్లో ని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు పాల్గోన్నారు.

# ప్రధాని మోదీ.. దేశాన్ని అమెరికాకు అమ్మేశారు :రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ ఫిబ్రవరి 3 ;: ఆమెరికా, భారత్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ప్రధాని మోదీ.. దేశాన్ని అమెరికాకు అమ్మేశారని రాహుల్ మండిపడ్డారు. అమెరికా ఒత్తిడితో ప్రధాని మోదీ వణికిపోయారని అన్నారు. నాలుగు నెలలుగా నిలిచిన ఒప్పందంపై మోదీ సంతకం చేశారని.. మోదీపై వచ్చిన తీవ్ర ఒత్తిడి వల్లే సంతకం చేశారని పేర్కొన్నారు. అమెరికా ఒత్తిడితో ఒప్పందంపై మోదీ రాజీ పడ్డారని అన్నారు. ప్రజల కష్టార్జితాన్ని మోదీ అమెరికాకు దోచిపెట్టారని ధ్వజమెత్తారు. ఆమెరికా బయటపెట్టని ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో చాలా విషయాలు ఉన్నాయని రాహుల్ అన్నారు. అమెరికాలో అదానీపై కేసు ఉందని.. వాస్తవానికి ఆ కేసు మోదీపై పెట్టాల్సిన కేసు అని పేర్కొన్నారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ విషయంలో మోదీపై చాలా ఒత్తిడి ఉందన్నారు. ప్రధాని అమెరికాకు ఎందుకు లొంగిపోయారన్నది ప్రజలు అర్థం చేసుకోవాలని తెలిపారు.

# బడ్జెట్ లో తెలంగాణకు కేంద్రం ప్రాధాన్యం: కిషన్ రెడ్డి



హైదరాబాద్ ఫిబ్రవరి 3: తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అన్ని రకాలుగా సహకరిస్తోందని బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణకు బడ్జెట్ లో కేంద్రం ప్రాధాన్యం ఇచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా బిజెపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జి రామ్ జి పథకంపై కాంగ్రెస్.. ఉచితాల కోసమే బడ్జెట్ అన్నట్లుగా ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రూ.96 వేల కోట్లు జి రామ్ జి పథకానికి నిధులు పెంచారని, ఎరువులపైనా కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని ధ్వజమెత్తారు. ఎన్నికల బడ్జెట్ కాదు.. వికసిత్ భారత్ లక్ష్యంగా పెట్టిన బడ్జెట్ అని.. తెలంగాణ ఒక హబ్ గా తయారవుతుందని, ఫార్మా, ఐటీ, హెల్త్ ఇలా హబ్ లకు హైదరాబాద్ కేంద్రం అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాల వారీగా కాకుండా దేశ అభివృద్ధికి సంబంధించిన బడ్జెట్ గా చూడాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆవాస్ కింద రాష్ట్రానికి 4.30 లక్షల ఇళ్లు కేటాయించారని, జాతీయ రహదారుల నిర్మాణంలో తెలంగాణకు పెద్దపీట వేశారని ప్రశంసించారు.

# రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొని రైతులతో ముఖాముఖి ముచ్చటించిన మంత్రి తుమ్మల



హైదరాబాద్ః ఈ రోజు జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రైతులతో ముఖాముఖి ముచ్చటించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు తమ వ్యవసాయ అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల వల్ల పొందుతున్న ప్రయోజనాలను మంత్రితో పంచుకున్నారు.

ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా రైతు శివ గారు సమగ్ర వ్యవసాయం మరియు ప్రకృతి వ్యవసాయం అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. అలాగే ఇఫ్కో కంపెనీ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ శ్రీ కృపా శంకర్ గారు నానో యూరియా వినియోగం, దాని ప్రయోజనాలు, సరైన వాడక విధానంపై రైతులకు సమగ్రంగా వివరించారు. పీజేటీఎస్ఏయూ (రాజీూాఖ) నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్ బాబు గారు, డాక్టర్ అరుణశ్రీ గారు యాసంగి వరిలో వచ్చే పురుగులు, తెగుళ్లు మరియు వాటి సమర్థవంతమైన యాజమాన్యంపై రైతులకు శాస్త్రీయంగా వివరించారు.

కార్యక్రమంలో భాగంగా యూరియా యాప్ అమలుపై మంత్రి స్వయంగా రైతులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. యాప్ ద్వారా ఎరువుల సరఫరా పారదర్శకంగా, సులభంగా జరుగుతుండటంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూరియా లభ్యత, సమయానికి సరఫరా వంటి అంశాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని వారు తెలిపారు.

తేనెటీగల పెంపకం చేస్తూ అధిక ఆదాయం సాధిస్తున్న జగిత్యాల జిల్లా పూదూరు గ్రామానికి చెందిన రైతు రామక్రిష్ణని, అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా లాభాలు పొందుతున్న రంగారెడ్డి జిల్లాకు చెందిన రైతు శివని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి వినూత్న వ్యవసాయ విధానాలను మరింత మంది రైతులు అనుసరించేలా అధికారులు ప్రోత్సహించాలని సూచించారు.

ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కంది కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేంద్రాల వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోందని, మధ్యవర్తుల బెడద తగ్గిందని రైతులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో రైతుల అవసరాల మేరకు అంశాలను ముందుగానే నిర్ణయించాలి అని అధికారులకు సూచించారు. నిర్ణయించిన అంశాలకు అనుగుణంగా రైతుల అనుభవాలు, విజయగాథలను క్షేత్రస్థాయిలో -- పొలాల నుంచే ప్రత్యక్షంగా ఇతర రైతులు చూసేలా ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

రైతు నేస్తం కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతున్న తీరును, రైతులకు చేరువయ్యేలా అధికారులు, శాస్త్రవేత్తలు చేస్తున్న కృషిని మంత్రి ప్రశంసించారు. అదే సమయంలో రైతుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి, ఎక్కువ సంఖ్యలో రైతులు పాల్గొనేలా ముందస్తు ప్రచారం, సమన్వయం చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు రైతు నేస్తం వేదిక మరింత బలోపేతం కావాలని మంత్రి ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**యూరియా**
**యాప్ పై సంతృప్తి వ్యక్తం చేసిన రైతులు**
**తేనెటీగల పెంపకంతో అధికాదాయము పొందుతున్న రైతులను మరియు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను అభినందించిన మంత్రి**
**రైతుల అవసరాల మేరకు మంగళవారం రైతునేస్తంలో అంశం నిర్ణయము, దానికి తగ్గ రైతు అనుభవాలు మరియు పొలాల నుండి ప్రత్యక్షంగా రైతులు వాటిని చూసేటట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించిన మంత్రి తుమ్మల**

# నేడే నల్గొండ జిల్లా మిర్యాలగూడ లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన..



200 కోట్లతో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కు శంకుస్థాపన చేయనున్న సీఎం..

మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేయనున్న ముఖ్యమంత్రి..

# ప్రజాబలం

04 ఫిబ్రవరి 2026 బుధవారం


## భువనేశ్వర్‌లో ఐదు రోజుల పర్యటనను ప్రారంభించిన పీఐబీ హైదరాబాద్ మీడియా ప్రతినిధుల బృందం






హైదరాబాద్, ఫిబ్రవరి 3: హైదరాబాద్‌లోని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఆరుగురు సభ్యుల మీడియా ప్రతినిధుల బృందం సోమవారం ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఐదు రోజుల పర్యటనను ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కీలక అభివృద్ధి పథకాలపై మీడియా బృందానికి అవగాహన కల్పించడంతో పాటు ఒడిశా సాంస్కృతిక, వారసత్వ ప్రాముఖ్యతను వెలుగులోకి తీసుకురావడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. ఈ బృందానికి పీఐబీ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) అడిషనల్ డైరెక్టర్ జనరల్ శ్రీ అఖిల్ కుమార్ మిశ్రా, ఇతర అధికారులు ఘనస్వాగతం పలికారు.

## బంగారం, వెండి ధరలు ఎందుకు తగ్గుతున్నాయి? ఎందుకు పెరుగుతున్నాయి..?

బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్న తరువాత ఒక్కసారిగా పతనం మొదలైంది. ఆ పతనం ఇంకా కొనసాగుతోంది.ప్రపంచ సంక్షోభం కారణంగా గత సంవత్సరం రికార్డు స్థాయిలను తాకినప్పటికీ, గత మూడు, నాలుగు రోజులుగా బంగారం, వెండి ధరలు గణనీయంగా తగ్గాయి. తత్ఫలితంగా, ఈ తగ్గుదల సమయంలో బంగారం, వెండిని కొనడం మంచిదేనా లేదా ధరలు మరింత తగ్గే వరకు వేచి ఉండటం మంచిదా అని పెట్టుబడిదారులు ఆలోచిస్తున్నారు. నిజానికి, ఈ వారం రికార్డు గరిష్టాలను చేరుకున్న తర్వాత బులియన్ మార్కెట్లో గణనీయమైన తగ్గుదల డాలర్ బలోపేతం కావడం, అమెరికా ద్రవ్య విధానంపై పెరుగుతున్న అంచనాల కారణంగా నమ్ముతారు. అంతర్జాతీయంగా ఏర్పడిన అస్థిర పరిస్థితుల మధ్య బంగారంలో పెట్టుబడి పెట్టడం సురక్షితంగా భావించడంతో జనవరిలో పుత్తడి ధరలు కొత్త రికార్డులను తాకాయి.అయితే, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ చీఫ్‌గా సెంట్రల్ బ్యాంక్ మాజీ గవర్నర్ కెవిన్ వార్ష్ పేరు ప్రతిపాదించిన తరువాత మార్కెట్లలో లోహాల ధరలు శుక్రవారం పతనం కావడం ప్రారంభమైంది.వార్ష్ పేరును ఫైనాన్షియల్ మార్కెట్లు స్వాగతించాయి. శుక్రవారం అనేక దేశాల కరెన్సీలతో పోల్చినప్పుడు డాలర్ విలువ 1 శాతం పెరిగింది.డాలర్ పుంజుకోవడంతో, 1983 తర్వాత బంగారం ధరల్లో ఒకే రోజు ఈ స్థాయిలో భారీ పతనం నమోదైంది. బంగారం ధర 9 శాతం, వెండి ధర 27శాతం పడిపోయింది.బంగారం, వెండి ధరలు తగ్గడానికి ప్రధాన కారణం ట్రంప్ పరిపాలన అమెరికా ఫెడరల్ రిజర్వ్ అధిపతిగా కెవిన్ వార్ష్‌ను నామినేట్ చేస్తుందనే ఊహాగానాలు పెరుగుతున్నాయి. ఇది వడ్డీ రేటు తగ్గింపు అంచనాలను పెంచింది, ఇది డాలర్, విలువైన లోహాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపింది. ఇంకా, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, దీర్ఘకాలిక విధాన సంకేతాలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేశాయి.దేశీయంగా, బడ్జెట్ 2026లో బంగారం, వెండికి సంబంధించి ఎటువంటి ప్రధాన ప్రకటనలు లేవు. దేశీయంగా గట్టి మద్దతు ఇచ్చే ప్రకటలు కూడా లేకపోవడం కూడా మరో కారణం. మార్కెట్లు ఇప్పుడు రాబోయే ఆర్థికనిర్ణయాలు, యూఎస్ ఉపాధి డేటా, పిఎంఐ డేటాపై దృష్టి సారించాయి, ఇవి ధరలు స్థిరీకరిస్తాయా లేదా మరింత అస్థిరతను చూస్తాయా అని నిర్ణయిస్తాయి.ప్రస్తుతానికి బంగారం, వెండి ధరల్లో అనిశ్చితి కొనసాగుతుందని నిపుణులు భావిస్తున్నారు. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీనియర్ విశ్లేషకుడు మానవ్ మోదీ ప్రకారం, రాబోయే కాలంలో ఈ లోహాల ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతూనే ఉండవచ్చు, కాబట్టి పెట్టుబడిదారులు జాగ్రత్తగా ముందుకు సాగాలి. ఇంతలో, ఆదివారం వరుసగా రెండో రోజు కూడా తగ్గుదల కొనసాగింది, ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో వెండి ధరలు కిలోగ్రాముకు తొమ్మిది శాతం తగ్గి ?2.65 లక్షలకు చేరుకోగా, బంగారం మూడు శాతం తగ్గి 10 గ్రాములకు ?1.47 లక్షలకు చేరుకుంది.మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఒఎంసీఎక్స్)లో మార్చి నెలలో డెలివరీ చేయాల్సిన వెండి ధర లో సర్క్యూట్‌ను తాకింది. ఏఓ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇఐఉ-కమోడిటీ ఱ కరెన్సీ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ ప్రణవ్ మీర్ ప్రకారం, దేశీయ మార్కెట్లో బంగారం దాని ఆల్-టైమ్ గరిష్ట స్థాయి నుంచి దాదాపు 20 శాతం తగ్గింది, వెండి దాదాపు 37 శాతం తగ్గింది, ఇది ఇటీవలి లాభాల బుకింగ్, ధరలలో ర్యాలీ తర్వాత సహజ క్షీణతను ప్రతిబింబిస్తుంది.విలువైన లోహాలకు 2025 అద్భుతమైన సంవత్సరంగా నిలిచింది. 1979 తర్వాత బంగారం అత్యధిక వార్షిక లాభాల్ని నమోదు చేసింది.ట్రంప్ సుంకాల భయాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన షేర్ల ధరలు పెరగవచ్చనే అంచనాలమధ్య ఫైనాన్షియల్ మార్కెట్లలో ఆందోళన ఏర్పడటంతో బంగారం, వెండి ధరలు కొత్త రికార్డుల్ని తాకాయి.బంగారం ధర ఈ ఏడాది జనవరి చివరి నాటికి 5,500 డాలర్లను దాటింది, వెండి ధర కూడా 'ఆల్‌టైమ్ హై'కి చేరింది.2026లో ఫెడరల్ రిజర్వ్ రెండుసార్లు వడ్డీ రేట్లను తగ్గించవచ్చని వాల్‌స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి. వడ్డీ రేట్లు తగ్గితే బంగారం ఆకర్షణీయ పెట్టుబడిగా మారుతుంది.బంగారం ధరలు పెరగడానికి మరో పెద్ద కారణం లభ్యత. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ట్రేడ్ అసోసియేషన్ ప్రకారం ఇప్పటి వరకు 216,265 టన్నుల బంగారాన్ని మాత్రమే వెలికి తీశారు.కొన్నేళ్ల క్రితం వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు బంగారాన్ని కొనుగోలు చేయడం మొదలు పెట్టడంతో బంగారం ధరలు పెరగడం మొదలైంది.అయితే గత ఏడాది కాలంలో అమెరికా సుంకాల వంటి అంతర్జాతీయ పరిణామాలు బంగారాన్ని మరింత ఆకర్షణీయ పెట్టుబడిగా మార్చాయి.

ఆర్థికపరమైన ఆందోళనలు కూడా బంగారం విలువ పెరగడానికి కారణమైనప్పటికీ, పరిస్థితులు చక్కబడినప్పుడు లేదా లాభాలు చాలని ఇన్వెస్టర్లు భావించినప్పుడు ధరలు అంతే తేలిగ్గా పడిపోవచ్చు.అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలోనూ ఇదే ట్రెండ్ కొనసాగింది. ముడి చమురు ధర 5 శాతానికి పైగా తగ్గింది.ప్రధాన చమురు ఉత్పత్తి సంస్థలు, యథాతథ స్థితిని కొనసాగించాలని నిర్ణయించడం, అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గొచ్చన్న సంకేతాలు వంటివి చమురు ధరలు తగ్గడానికి కారణాలుగా భావిస్తున్నారు.దీంతో పాటు అమెరికా డాలర్ విలువ పెరగడం కూడా ముడి చమురు ధరల తగ్గుదలపై ప్రభావం చూపింది.చమురు ధరను డాలర్లలో నిర్ణయిస్తారు. డాలర్ విలువ పెరిగే కొద్దీ అమెరికాయేతర దేశాలకు ముడి చమురు మరింత ఖరీదైనదిగా మారుతుంది.

# నేతన్న కోటలో మున్సిపల్ పోరు

## ప్రజా తీర్పు ఎవరి వైపు

## పద్మశాలి ఓటర్ల పై నేతల దృష్టి




రాజన్న సిరిసిల్ల జిల్లా, ఫిబ్రవరి 3 (ప్రజాబలం ప్రతినిధి) నేతన్నల కోటలో మున్సిపల్ పోరు.. సిరిసిల్ల తీర్పు ఎవరి వైపు? సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో "నేతన్నల అడ్డా – వారి చూపు ఎటు?" తెలంగాణ రాజకీయాల్లో 'టెక్స్‌టైల్ హబ్'గా పేరొందిన సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ సెగలు పుట్టిస్తోంది. దశాబ్దాలుగా నేతన్నల ఓట్లే ఇక్కడ గెలుపోటములను శాసిస్తున్నాయి. గత పదేళ్లుగా ఒక వెలుగు వెలిగిన సిరిసిల్లలో, ప్రస్తుతం మారుతున్న రాజకీయ సమీకరణాలు, పెండింగ్ సమస్యలు నేతన్నలను ఆలోచనలో పడేశాయి.

నేతన్నల అడ్డాలో ప్రధాన చర్చనీయాంశాలు:

బతుకమ్మ చీరల ఆర్డర్లు, ఉపాధి: గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన బతుకమ్మ చీరల ఆర్డర్ల నిలిపివేతపై కార్మికుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏదాది పొడవునా పని కల్పిస్తామని ఇస్తున్న హామీలు ఎంతవరకు అమలవుతాయనేది చర్చగా మారింది.

మెగా పవర్ లూమ్ క్లస్టర్: కేంద్ర ప్రభుత్వం మెగా పవర్ లూమ్ క్లస్టర్ మంజూరులో చేస్తున్న ఆలస్యం, దీనిపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలు నేతన్నల మధ్య హాట్ టాపిక్‌గా మారాయి.

కరెంటు సబ్సిడీ , బకాయిలు: నేతన్నలకు అందాల్సిన విద్యుత్ సబ్సిడీ బకాయిలు, ముడి సరుకుల ధరల పెరుగుదల వంటి సమస్యలు నేరుగా వారి ఆర్థిక స్థితిగతులపై ప్రభావం చూపుతున్నాయి.

పార్టీల వ్యూహాలు – ఎత్తుకు పైఎత్తులు:

బీఆర్ఎస్ : కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో, గతంలో తాము చేసిన అభివృద్ధిని, నేతన్నలకు అందించిన సంక్షేమ పథకాలను గుర్తు చేస్తూ 'సెంటిమెంట్'ను రగిలిస్తోంది. "సిరిసిల్ల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం" అనే నినాదంతో ముందుకు వెళ్తోంది.

కాంగ్రెస్ : అధికారంలో ఉన్న అనుకూలతతో, కొత్త పథకాలు , నేతన్నలకు 365 రోజుల ఉపాధి కల్పిస్తామన్న హామీలతో ప్రజల్లోకి వెళ్తోంది. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ మార్పు కావాలని కోరుతోంది.

బీజేపీ : కేంద్ర పథకాల ద్వారా లబ్ధిని, మెగా టెక్స్‌టైల్ పార్కుల ఆవశ్యకతను వివరిస్తూ నేతన్నల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తోంది.

నేతన్న చూపు ఎటు?

మున్సిపల్ వార్డుల వారీగా చూస్తే నేతన్నల ప్రాబల్యం అధికంగా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితులకు, ఇప్పటి మున్సిపల్ ఎన్నికల పరిస్థితులకు మధ్య మార్పు కనిపిస్తోంది. సంక్షేమ పథకాలు నిరంతరాయంగా అందాలని కోరుకుంటున్న నేతన్నలు, కేవలం హామీలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపేవారికే జై కొట్టేలా కనిపిస్తున్నారు. సిరిసిల్ల మున్సిపల్ పీఠం దక్కాలంటే నేతన్నల మనసు గెలవాల్సిందే. మరి ఈ 'మున్సిపల్ పోరు'లో నేతన్నలు ఎవరికి పట్టం కడతారో చూడాలి.

## మున్సిపల్ ఎన్నికల వేళ గద్వాల కాంగ్రెస్‌లో గందరగోళ పరిస్థితి



జోగులాంబ గద్వాల ఫిబ్రవరి 3 ;మున్సిపల్ ఎన్నికల వేళ గద్వాల కాంగ్రెస్‌లో గందరగోళ పరిస్థితి నెలకొంది. జోగులాంబ గద్వాల మున్సిపల్ ఎన్నికల్లో సీట్ల పంపకాల వ్యవహారం కొలిక్కి రావడంతో.. 37 వార్డులకుగాను 7 సీట్లను సరిత తిరుపతయ్య వర్గం, 30 సీట్లు ఎమ్మెల్యే బండ్ల వర్గానికి కేటాయించారు. అయితే ముందుగానే నేడు ఉదయం ఎమ్మెల్యే బండ్ల వర్గానికి మొత్తం 37 వార్డులకుగాను అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ బీ ఫాంలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వర్గానికి చెందిన అభ్యర్థులంతా అధికారులకు బీ ఫామ్‌లను సమర్పించారు.ఇదిలా ఉంటే మరోవైపు సరిత తిరుపతయ్య వర్గం తమకు అధిష్టానం 7 వార్డులను కేటాయించిందంటూ బీ ఫామ్‌లతో దర్శనమిచ్చారు. కాగా ఆ 7 వార్డులకు ఇప్పటికే ఎమ్మెల్యే బండ్ల వర్గానికి చెందిన అభ్యర్థులు బీ ఫామ్‌లు సమర్పించారు. ఇలా ఒకేసారి 7 వార్డులకు రెండు వర్గాలకు కాంగ్రెస్ బీ ఫామ్‌లు ఇవ్వడం పట్ల గందరగోళ పరిస్థితి నెలకొంది. రెండు వర్గాలకు చెందిన వ్యక్తుల్లో ఇంతకీ ఎవరి బీ ఫామ్‌లు చెల్లుతాయనేది తెలియాల్సి ఉంది.

## అమెరికా వాణిజ్య ఒప్పందం ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి ఒక చారిత్రక మైలురాయి: చంద్రబాబు



అమరావతి ఫిబ్రవరి 3 ;; అమెరికా వాణిజ్య ఒప్పందం ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి ఒక చారిత్రక మైలురాయి అని ఏపి సిఎం చంద్రబాబు నాయుడు కొనియాడారు. అమెరికాతో చారిత్రక ఒప్పందం ద్వారా దేశ యువత, రైతులకు అపారమైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఒప్పందం విజయవంతంగా పూర్తి చేసిన ప్రధాని నరేంద్రమోదీకి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమెరికా 18 శాతం సుంకాల తగ్గింపు వల్ల..రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధం మరింత బలోపేతమవుతుందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. నిరంతర గ్లోబల్ వృద్ధికి దోహదపడే దూరదృష్టి నిర్ణయమిదని, ప్రధాని నాయకత్వంలో భారత్ ఒక గ్లోబల్ ఆర్థిక శక్తిగా మరింత పటిష్టం కానుందని జోస్యం చెప్పారు. భారత ఎగుమతుల పోటీ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందని, మోదీ నాయకత్వంలో ఆర్థికశక్తి కేంద్రంగా భారత్ ఉందని చంద్రబాబు పేర్కొన్నారు.

## మేడారం జాతరలో భక్తులు సుమారు రూ.1,000 కోట్లు ఖర్చు



హైదరాబాద్ ఫిబ్రవరి 3 ;తెలంగాణలో నాలుగు రోజుల పాటు వైభవంగా జరిగిన మేడారం జాతరలో భక్తులు సుమారు రూ.1,000 కోట్లు ఖర్చు చేసినట్లు అంచనా. కోటిన్నర మంది భక్తులు హాజరుకాగా, 14 లక్షల మేకలు, గొర్రెలను బలిచ్చినట్లు తెలుస్తోంది. ఒక్క మద్యం కోసమే రూ.10 కోట్లు, మాంసం-మద్యం కలిపి రూ.400 కోట్లు వెచ్చించినట్లు సమాచారం. వీటితో పాటు కోటికి పైగా కొబ్బరికాయలు, 500 టన్నుల బెల్లం విక్రయాలు జరిగాయి.

# నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 03 :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో నిర్వహించిన నామినేషన్ల ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా తయారీ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ సంపత్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ మాట్లాడుతూ... బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులకు సంబంధించి ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలని, నిర్దేశిత సమయంలోగా ప్రక్రియ పూర్తి చేసి నిబంధనల ప్రకారం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించాలని అధికారులకు సూచించారు.నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం సి సి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని,ఎన్నికల ప్రక్రియ పూర్తిగా వీడియోగ్రఫీ చేయడం జరిగిందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్(ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం,ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు.





అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని రామ్ నగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం భవన నిర్మాణ పనులను సందర్శించి వంటశాల,ఇతర పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని తెలిపారు.తదనంతరం కాసిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.పాఠశాలలు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.పాఠశాలకు మంజూరైన భోజనశాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని రేగులగూడ గ్రామంలో గల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి పాఠశాలకు మంజూరైన అదనపు గదుల నిర్మాణ ప్రక్రియను పరిశీలించారు.పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పని ప్రదేశాలలో మహిళలను లైంగిక వేధింపులకు గురి చేసే వారిపై

## చట్టపరమైన చర్యలు జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 03 :** ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు పని ప్రదేశాలలో మహిళలను లైంగికంగా వేధించే వారిపై పోష్ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు.మహిళలు లైంగిక వేధింపుల నిరోధక చట్టం పాస్ - 2013 పై అవగాహన కలిగి ఉండాలని, పని ప్రదేశాలలో మహిళలకు భద్రత,గౌరవం, సమానత్వం కల్పించడమే లక్ష్యంగా చట్టం రూపొందించడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమలలో,వాణిజ్య, వ్యాపార సముదాయాలలో, షాపింగ్ మాల్స్,జిన్నింగ్ మిల్లులు, ఇతర పని ప్రదేశాలలో పని చేసే మహిళలు లైంగిక వేధింపులకు గురైతే బాధిత మహిళలు నిర్భయంగా అంతర్గత ఫిర్యాదు కమిటీకి ఫిర్యాదు చేయవచ్చని, పోష్ చట్టం 2013 ద్వారా న్యాయం పొందవచ్చని తెలిపారు. ఫిర్యాదు పై కమిటీ నిర్నిత కాలంలో విచారణ పూర్తి చేసి తగు చర్యలు తీసుకుంటుందని,అవసరమైతే పోలీస్ కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి కార్యాలయంలో,పని ప్రదేశాలలో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని, మహిళలపై లైంగిక వేధింపుల నిరోధానికి అందరం సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు.మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా మహిళా సాధికారత కేంద్రం ద్వారా విస్తృతస్థాయిలో చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పోష్ చట్టం,అంతర్గత ఫిర్యాదు కమిటీ ఉద్దేశం,హక్కులు, ఫిర్యాదు విధానం, కమిటీ నిర్మాణం, బాధ్యతలు వంటి అంశాలపై అధికారులు, ఉద్యోగులకు స్పష్టమైన అవగాహన కల్పించడం జరుగుతుందని, కమిటీ వివరాలను నిర్దిష్ట ఫారం ద్వారా సేకరించి సంబంధిత సమాచారాన్ని షీ బాక్స్ పోర్టల్ లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో ఇప్పటివరకు 47 అంతర్గత ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని,వీటిలో ప్రభుత్వ జిల్లా స్థాయి కార్యాలయాలలో 30 కమిటీలు, ఉప జిల్లాస్థాయి కార్యాలయాలలో 16,ప్రైవేట్ సంస్థలు,షాపింగ్ మాల్స్, దుకాణాలలో 1 కమిటీ పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రైవేట్ సంస్థలు తమ సంస్థలలో కమిటీలను ఏర్పాటు చేయాలని, జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయం, షీ బాక్స్ పోర్టల్ లో నమోదు చేసుకోవాలని తెలిపారు. పోష్ చట్టం అమలుతో మహిళలకు పని ప్రదేశాలు సురక్షితంగా మారుతాయని, ప్రతి మహిళ తన హక్కులను తెలుసుకొని ధైర్యంగా ముందుకు రావాలని తెలిపారు

# కాంగ్రెస్... బిజెపికి మధ్యలో సింహం

:పెద్దపల్లి పుర పోరులో ఆయా పార్టీల నాయకులు తమ ఆ యుధాలను సిద్ధం చేసుకుం టున్నారు. నామినేషన్ల ప్రక్రి య పూర్తి చేసుకున్న ఆయా పార్టీల అభ్యర్థులు తమ బీఫా రాలను ఎన్నికల అధికారుల కు సమర్పించారు. నేటితో నామినేషన్ల ఉపసంహరణ గడువు పూర్తయింది. ఇక రేపటి నుండి అభ్యర్థుల ప్రచారాల్లో తలమునకలై సాగనున్నారు. పెద్దపల్లి మున్సిపాలిటీలో ఎవరికి వారే గెలుపు తమదే అన్న రీతిలో ప్రచారాలు సాగిస్తున్నారు. పైకి కనిపించకుండా ఎవరి లెక్క లు వారివే అన్నట్టు వారి వారి ప్రయత్నాల్లో మునిగి తేలుతు న్నారు. ఈ క్రమంలో ప్రధానం గా బిజెపి, కాంగ్రెస్ మధ్య పో టీ ఉంటుందనే విషయాన్ని గ్ర హిస్తే అందులో సింహం గుర్తు ఏఐఎఫ్ బీ అనే పార్టీ వచ్చి చేరింది. బీసీ కార్డుతో ముందు కు వచ్చి, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించుకొని గెలుపు ధీమాతో ఉన్న మాజీ కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ 26 మంది అభ్యర్థులతో నామి నేషన్ వేయించాడు. ఈ పార్టీ ప్రచారం కోసం జాగృతి రాష్ట్ర వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మె ల్సీ కవిత రానున్నారు. కానీ ఒక విషయం ఆలోచన చేస్తే పెద్దపల్లిలో మాత్రం పార్టీలతో సంబంధం లేకుండా వ్యక్తులను చూసి ఓట్లు వేసే సంప్రదాయం ఉంది. ఎక్కువ గా అధికార పార్టీ ఏది ఉంటే దానికే బలం ఉంటుందనేది గత పదేళ్లుగా మనం చూస్తూ నే వున్నాము. కానీ పెద్దపల్లి లో మాత్రం ఎవరికి అవకాశం ఇస్తారో ఎవర్ని తొక్కేస్తారనే విషయం మాత్రం ఇక్కడి ఓటర్ల నిర్ణయమే. గత ఎన్నిక ల అంశాలను పరిశీలిస్తే ఈ విషయం చాలా సూటిగా కనిపిస్తున్నది. ఇక ప్రస్తుత మున్సిపల్ పోరులో మాత్రం కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థు ల్లో మూడోవంతు మంది టిఆర్ఎస్ పార్టీ నుండి వచ్చిన వారే. ఇందులో చాలామంది గతంలో చేసిన కొన్ని పొరపా ట్లు, అవినీతి, ప్రజల వద్ద డబ్బులు దండుకోవడం వల్ల వారికి గెలుపు పెద్ద సమస్యగా మారనున్నదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అందుకే చాలామంది కాంగ్రెస్ లో చేరి పార్టీ కండువా కప్పుకొని బీఫామ్ టికెట్ పొందారు. అ యితే అప్పటికే టికెట్ ఆశిస్తున్నా కాంగ్రెస్ లోని  చాలామంది అభ్యర్థులు, సీనియర్లు వారి రాకను వీళ్ళు జీర్ణించుకోలేకపోతున్నారు. ఓ పక్క బీసీలకు 42 శాతం రిజ ర్వేషన్ తో పలువురి స్థానాలు కూడా మారాయి. దీనివల్ల కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపు విషయంలో భయాందోళనలో వున్నారు. ఇక అసలు విష యానికి వస్తే బిఆర్ఎస్ పైన కొంత వ్యతిరేకత ఉన్నవాళ్లు కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చే అవకాశం ఉండేది కానీ ఇప్పుడు ఆ బిఆర్ ఎస్ వాళ్లే కాంగ్రెస్ లో చేరడంతో ఇటు బిఆర్ఎస్ కు కాకుండా అటు కాంగ్రెస్ కు కాకుండా సింహాని కి లేదా బిజెపికి ఓట్లు వేసే అవకాశం ఉందని విశ్లేషకుల అభిప్రాయంగా పేర్కొంటున్నా రు. బీజేపీలో ఒక అంశం తీసు కుంటే ఇప్పటికీ వర్గ పోరు, అంతర్గత విభేదాలు నాయకు ల్లో బహిరంగంగానే బయటప డిన సంఘటనలు ఉన్నాయి. అలాగే ప్రస్తుతం బీసీ కార్డు ఉద్యమం బలంగా ఉండటం, దీనికితోడు సింహం గుర్తుపై పోటీ చేసే అభ్యర్థుల్లో కొంత మందికి అన్ని వర్గాల నుండి సానుభూతి, జాగృతి తరుపు న కవిత రావడం ద్వారా కూ డా టిఆర్ఎస్ నుండి ఓట్లు పడే అవకాశాలు కనిపిస్తున్నా యి. ఇది వారి ఓటు బ్యాంకు కు కలిసి వచ్చే అంశాలుగా ఉన్నాయి.

# అందోల్ జోగిపేట  మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ప్రకటన

## రూపురేఖలు మారనున్న ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీ



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 3 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :25 నెలల్లో కేవలం అందోల్ జోగిపేట మున్సిపాలిటీకి 250 కోట్ల నిధులు మున్సిపల్ పరిధిలో మరో 320 కోట్ల అభివృద్ధి పనుల కొరకు  మంత్రి దామోదర రాజనరసింహ, ప్రభుత్వానికి పంపిన ప్రపోసల్స్ కి త్వరలో గ్రీన్ సిగ్నల్,రూపురేఖలు మారనున్న అందోల్ జోగిపేట మున్సిపాలిటీ అందోల్--జోగిపేట్ మున్సిపాలిటీ పరిధిలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరఫున 20, వార్డుల కౌన్సిలర్ అభ్యర్థుల అధికారిక జాబితాను ప్రకటించడమైనది. ఈ మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులు ఉండగా, సుమారు 16,550 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించగల అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ బరిలోకి దింపింది.అదేవిధంగా, కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో అందోల్--జోగిపేట్ ప్రాంతంలో ఇప్పటికే కొనసాగుతున్న, మంజూరైన మరియు రాబోయే కీలక అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముందుకుతీసుకొస్తున్నాము....

# గుర్తుల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ రాజార్షి షా



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** ఫిబ్రవరి 03, 2026 -- ఆదిలాబాదు:  మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక టీటీడీసీలో రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి నామినేషన్ల ఉపసంహరణ, బి-ఫారాల పరిశీలన, గుర్తుల కేటాయింపు తదితర అంశాలపై ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్ల ఉపసంహరణ సమయంలో అనుసరించాల్సిన విధానం, రాజకీయ పార్టీలు సమర్పించే బి-ఫారాల పరిశీలనలో తనిఖీ చేయాల్సిన అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం వార్డుల వారీగా అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎన్నికల నియమావళి మేరకు పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు.     ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాజు, నోడల్ అధికారి ఫణీందర్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలి జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.



మంగళవారం స్థానిక టీటీడీసీ కేంద్రంలో వార్డుల వారీగా ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద జరుగుతున్న గుర్తుల కేటాయింపు ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్రతి కౌంటర్ వద్ద ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణ, అభ్యర్థులకు సమాచార అందజేత విధానాన్ని ఆయన సమీక్షించారు. గుర్తుల కేటాయింపులో ఎలాంటి లోపాలు లేకుండా ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని, అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రక్రియ అంతటా పారదర్శకత ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు, వారి ప్రతినిధులు ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే రిటర్నింగ్ అధికారులను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.     ఈ కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంతు నాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ట్రైనింగ్ కలెక్టర్ సలోని చాబ్ర, మున్సిపల్ కమిషనర్ జి. రాజు, నోడల్ అధికారి రవీందర్, రిటర్నింగ్ అధికారులు, మున్సిపల్ అధికారులు, అభ్యర్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



**నిర్మల్  ప్రజాబలం ప్రతినిధి:** పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో, పదవ తరగతి పరీక్షలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయని, అన్ని ప్రభుత్వ బడుల్లో ప్రతిరోజు విద్యార్థులు, ఉపాధ్యాయుల వంద శాతం హాజరు ఉండాలని అన్నారు. తరచూ బడికి రాని పిల్లల ఇండ్లకు వెళ్లి, వారి పోషకులతో మాట్లాడి తరగతులకు హాజరయ్యేలా చూడాలని చెప్పారు. ఎప్పటికప్పుడు పోషకులతో సమావేశం నిర్వహిస్తూ, వారి పిల్లల ప్రతిభకు సంబంధించి వివరాలను వారితో పంచుకోవాలని అన్నారు. ప్రతి విద్యార్థి బోర్డు పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తూ, చదువులో వెనకబడిన పిల్లలు ముందుకు వెళ్లాలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ఏ విద్యార్థి, ఏ సబ్జెక్టులో వెనకబడ్డారో తెలుసుకొని, వారి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని వివరించారు. పరీక్షల ఫలితాలు, హాజరు శాతం వివరాలు విద్యార్థుల ఫలితాలు, హాజరు శాతం తమకు అందజేస్తూ ఉండాలని చెప్పారు. అన్ని పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ఎక్కువ మార్కులు వచ్చే ముఖ్యమైన పాఠాలు ఎక్కువగా చదివిపించాలని సూచించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ, పరీక్షలపై భయం, ఒత్తిడి దూరం చేస్తూ వారిని ప్రశాంతంగా పరీక్షలకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు.  ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఈఓ భోజన్న, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# లోకల్ బాడీ ఎలక్షన్స్ కు వడివడిగా అడుగులు

విశాఖపట్టణం, ఫిబ్రవరి 3, ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగనుందా? వరుసగా ఎన్నికలు రానున్నాయా? ముందుగా సర్పంచ్ ఎన్నికలను పూర్తి చేయనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. అయితే రాష్ట్రంలో ముందుగా మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. మార్చి 17తో మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. సర్పంచ్ల పదవీకాలం ఏప్రిల్ 4 తో ముగియనుంది. ఎంపీటీసీలతో పాటు జడ్పిటిసి లకు సంబంధించిన పదవీకాలం జూన్ వరకు ఉంది. ఈ తరుణంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నీలం సాహ్ని సిద్ధమని ప్రకటించారు. జిల్లాల యంత్రాంగాలను సిద్ధం చేశారు. ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల రూపకల్పన వంటివి ఇప్పటికే దాదాపు ఒక కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఈ దూకుడు చూస్తుంటే మే నెలలో పంచాయితీ, అక్కడ కొద్ది రోజులకే మున్సిపాలిటీ, ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలను పూర్తిచేసేందుకు ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అర్థమవుతోంది.మరోవైపు రాజకీయ పరిస్థితులను చూస్తుంటే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో సంతృప్తి శాతం ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో పుంజుకోలేదు. ఇటువంటి సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేస్తే.. మూడు పార్టీల మధ్య పదవుల సర్దుబాటు చేస్తే.. వచ్చే మూడేళ్లలో మూడు పార్టీల శ్రేణులు సమన్వయంతో పనిచేస్తాయి. అందుకే వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే మూడు పార్టీల నాయకత్వాలు తమ పార్టీల శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే బలం ఉన్నచోట మాత్రమే అభ్యర్థులను రంగంలోకి దించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ప్రచారం నడుస్తోంది. ప్రజల్లో బలం ఉన్న పార్టీలకు అవకాశం కల్పిస్తారని తెలుస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంత మాత్రం బలపడకుండా చూడాలని కూటమి భావిస్తున్నట్లు సమాచారం.అయితే ఈనెల 20 తరువాత దేశవ్యాప్తంగా తొలి విడత జన గణన మొదలవుతుంది. సుమారు ఏడాదిన్నర ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఈ లెక్కన 2027 లోనే ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. అయితే 2018లో చంద్రబాబు చేసిన తప్పిదం అదే. అప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు చంద్రబాబు ఆసక్తి చూపలేదు. 2019 ఎన్నికల్లో ఆ ప్రభావం కనిపించింది. ఇప్పుడు జనాభా గణ న అంటూ వాయిదా వేస్తే మాత్రం కూటమి పార్టీలకు ఇబ్బంది కరం.. పైగా స్థానిక సంస్థల ఎన్నికలకు కులగణన అనేది అడ్డంకి కాదు. ఎందుకంటే ఆర్థిక సంఘం నిధులన్నీ స్థానిక సంస్థల పాలకవర్గాల తోనే సంబంధం ఉంటుంది. పాలకవర్గాలు ఉంటేనే ఆర్థిక సంఘం నిధులు విడుదలవుతాయి. అయితే ఈ పరిణామాలన్నీ చూస్తుంటే మాత్రం వేసవిలో స్థానిక సంస్థల ఎన్నికలు ఖాయం. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# దాడుల- ప్రతి దాడుల సంస్కృతా...

విజయవాడ, ఫిబ్రవరి 3, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత కొన్నేళ్లుగా సాగుతున్న "దాడులు-ప్రతిదాడుల" సంస్కృతిలో ఒక కీలక మార్పు కనిపిస్తోంది. మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత జోగి రమేశ్ నివాసంపై జరిగిన దాడి ఉదంతం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. అయితే, ఈ ఘటనలో చర్చనీయాంశం దాడి మాత్రమే కాదు.. ఆ దాడి జరిగిన తర్వాత ప్రస్తుత ప్రభుత్వం స్పందించిన తీరు, తీసుకున్న నిర్ణయాలు విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి.టీడీపీ యువనేత, ప్రస్తుత మంత్రి నారా లోకేశ్‌పై జోగి రమేశ్ గతంలో చేసిన కొన్ని అనుచిత వ్యాఖ్యలు టీడీపీ శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. ఈ నేపథ్యంలోనే ఆగ్రహంతో ఊగిపోయిన కొందరు టీడీపీ కార్యకర్తలు, నేతలు జోగి రమేశ్ ఇంటిపై దాడికి దిగారు. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, రాళ్లు రువ్వడం, పెట్రోల్ బాటిళ్లు విసిరి మంటలు రాజేయడం వంటి తీవ్రస్థాయి చర్యలకు పాల్పడ్డారు. ఇది శాంతిభద్రతల పరంగా పెద్ద చర్చకు దారితీసింది.సాధారణంగా అధికార పార్టీ కార్యకర్తలు ప్రతిపక్ష నేతలపై దాడులు చేసినప్పుడు, ప్రభుత్వం వారిని వెనకేసుకొస్తుందనే ముద్ర భారత రాజకీయాల్లో బలంగా ఉంది. కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో భిన్నమైన వైఖరిని ప్రదర్శించారు. ఈ దాడి ఘటనను ఆయన తీవ్రంగా పరిగణించడమే కాకుండా, "చట్టం ఎవరికైనా ఒక్కటే.. తప్పు చేసిన వారు మన పార్టీ వారైనా సరే కేసులు నమోదు చేయాల్సిందే" అని పోలీసులను ఆదేశించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు 40 మంది టీడీపీ నేతలపై కేసులు నమోదు చేశారు. వీరిలో 11 మంది కీలక నేతలను అరెస్ట్ చేసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిబంధనల ప్రకారం వారికి స్టేషన్ బెయిల్ మంజూరు కావడంతో విడుదలయ్యారు, కానీ చట్టపరమైన ప్రక్రియను మాత్రం ప్రభుత్వం అడ్డుకోలేదు. ఈ ఘటనను విశ్లేషిస్తున్న వారు సహజంగానే గత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ వైఖరితో పోల్చుతున్నారు.

టీడీపీ నేతలు ప్రధానంగా రెండు అంశాలను ఇక్కడ గుర్తు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ శ్రేణులు దాడి చేసినప్పుడు, బాధ్యులపై చర్యలు తీసుకోవడం మాట అటుంచి, తిరుగుబాటు చేసిన టీడీపీ నేతలపైనే రివర్స్ కేసులు నమోదయ్యాయని వారు ఆరోపిస్తున్నారు. గతంలో అసభ్య పదజాలంతో ప్రత్యర్థులను దూషించిన వారికి పదవులు కట్టబెట్టడం ద్వారా వైఎస్సార్సీపీ "అరెస్టుల కంటే అభినందనలకే" ప్రాధాన్యత ఇచ్చిందని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. దీనికి భిన్నంగా, ఇటీవల వై.ఎస్. భారతిని అసభ్య పదజాలంతో దూషించిన ఐటీడీపీ కార్యకర్తపై చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని, జైలుకు పంపించడం ద్వారా "తప్పు ఎవరి వైపు ఉన్నా క్షమించేది లేదని" సంకేతాలు పంపినట్లయింది.ఒక ప్రభుత్వం తన సొంత కార్యకర్తలపై కేసులు పెట్టడం అనేది రాజకీయంగా సాహసోపేతమైన నిర్ణయమే. దీనివల్ల క్యాడర్‌లో కొంత అసంతృప్తి కలిగే అవకాశం ఉన్నప్పటికీ, సాధారణ ప్రజల్లో ప్రభుత్వ ప్రతిష్ట పెరుగుతుంది. "రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజం. కానీ అవి భౌతిక దాడుల వరకు వెళ్లినప్పుడు ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే సమాజంలో అరాచకం పెరుగుతుంది. చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం వ్యవస్థల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని కలిగిస్తుంది." అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.జోగి రమేశ్ ఇంటిపై దాడి ఘటన ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక పాఠంగా నిలిచిపోనుంది. అధికారంలో ఉన్నాం కదా అని చట్టాన్ని అతిక్రమిస్తే, సొంత ప్రభుత్వం కూడా వెనకేసుకురాదని ఈ ఉదంతం స్పష్టం చేస్తోంది.

గత ప్రభుత్వ తీరుకు, ప్రస్తుత ప్రభుత్వ జవాబుదారీతనానికి మధ్య ఉన్న ఈ వ్యత్యాసమే తమను ప్రజల్లో మెరుగ్గా నిలబెడుతుందని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. కేవలం ఎన్నికల హామీలే కాకుండా, పరిపాలనలో, శాంతిభద్రతల నిర్వహణలో ఇటువంటి కఠిన నిర్ణయాలు రాష్ట్ర భవిష్యత్తుకు శుభసూచకం

# అంబటి వ్యాఖ్యలపై చర్చ...

గుంటూరు ఫిబ్రవరి 3, వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇటీవల నడిరోడ్డుపై మీడియా ముందే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై తీవ్ర వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా పెద్ద చర్చకు దారి తీసింది. సభ్యసమాజం ఆమోదించలేని పదజాలంతో చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని మరింత ఉద్రిక్తంగా మార్చాయి. అధికారంలో ఉన్న సమయంలో ఇదే తరహా వ్యాఖ్యలు టీడీపీ నేతల నుంచి వచ్చి ఉంటే ఎలా స్పందించేవారు అన్న అంశం ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. టీడీపీ నేత కొమ్మారెడ్డి పట్టాభి జగన్ మోహన్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అర్ధరాత్రి అరెస్ట్ జరిగిన ఉదంతాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు. ఆ సందర్భాన్ని ఇప్పుడు అంబటి వ్యవహారంతో పోలుస్తూ, చట్టం అందరికీ సమానంగా వర్తించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో అంబటి వ్యాఖ్యలను సమర్థించే పరిస్థితి వైసీపీలోనే కనిపించడం లేదు. పార్టీ అధినేత తప్ప ఇతర నాయకులు బహిరంగంగా మద్దతు పలకకపోవడం గమనార్హం.వైసీపీలోని పలువురు నేతలు ఆఫ్ ది రికార్డ్‌గా మాట్లాడుతూ, అంబటి మాట తీరు ఎప్పటి నుంచో ఇలాగే ఉందని, గతంలో కూడా అనేకసార్లు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. కొందరు నేతలు ఆయన ప్రవర్తన పార్టీకి నష్టం కలిగిస్తోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో అంబటి వ్యవహారం వ్యక్తిగత అంశం కాదని, పార్టీ అంతర్గత సమస్యల ప్రతిబింబంగా మారిందనే అభిప్రాయం వినిపిస్తోంది.అసలు అంబటి ఈ స్థాయిలో స్పందించడానికి కారణాలేంటి అన్నది మరో కీలక అంశంగా మారింది. బహిరంగంగా చెబుతున్నట్లు టీడీపీ శ్రేణులు ఆయన కారును అడ్డుకోవడమే కారణం కాదని, వైసీపీలోని కొందరు నాయకులే అంటున్నారు. ఇటీవల సత్తెనపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ పదవి నుంచి అంబటిని తప్పించడంతో ఆయనకు పార్టీలో ప్రాధాన్యం తగ్గిందనే భావన పెరిగిందని చెబుతున్నారు. ఇదే సమయంలో ఆయనపై కేసులు నమోదవడం, పార్టీ నుంచి సరైన సహకారం లేకపోవడం కూడా అసంతృప్తికి కారణమైందని అంటున్నారు.ఈ అన్ని అంశాల సమ్మేళనమే అంబటి కోపంగా బయటపడడానికి దారితీసిందని రాజకీయ వర్గాల విశ్లేషణ. ఈ ఘటనతో పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిందని, వైసీపీలో అంతర్గత అసంతృప్తి బయటకు వస్తోందనే చర్చ జరుగుతోంది. ఒక్క అంబటే కాకుండా మరికొందరు నాయకులు కూడా ఇదే తరహా ఆగ్రహంతో ఉన్నప్పటికీ, కొందరు సంయమనం పాటిస్తుండగా మరికొందరు బహిరంగంగా స్పందిస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తంగా ఈ పరిణామాలు వైసీపీ భవిష్యత్ రాజకీయ దిశపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

# ట్రంప్ అభిశంసన...?

న్యూయార్క్, ఫిబ్రవరి 3, (న్యూస్ పల్స్) అగ్రరాజ్యం అమెరికాలో ఆ దేశ అధ్యక్షుడిపై ప్రజల్లో రోజురోజుకు వ్యతిరేకత పెరుగుతోంది. ఏడాదిలోనే ట్రంప్ గ్రాఫ్ గతంలో ఎరికీ లేనంతగా పడిపోయింది. మరోవైపు న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో ట్రంప్ బలపర్చిన అభ్యర్థి ఓడిపోయారు. ఇక ట్రంప్ పాలనలో ఇప్పటికే నెలరోజులు షట్‌డౌన్ అయిన అమెరికా మరోమారు అదే ప్రమాదం అంచున ఉంది. ఈ నేపథ్యలో అమెరికా ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు డొనాల్డ్ ట్రంప్‌పై మరో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. మార్చి 31 లోపు దీన్ని సాధించాలని ప్రణాళిక రూపొందించారు. అల్ గ్రీన్ వంటి నేతలు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.రెండో మారు అధికారంలోకి వచ్చిన ట్రంప్ చర్యలు, తీసుకుంటున్న నిర్ణయాలు, రూపొందిస్తున్న చట్టాలు ఏవీ ప్రజామోదయోగ్యంగా ఉండడం లేదు. అక్రమ వలసదారులపై దళాలు, మిన్నెసోటా కాల్పుల ఘటనలు హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వైఫల్యాన్ని హైలైట్ చేశాయి. సుంకాల వల్ల ధరల ఆకాశంగమనం చిన్న వ్యాపారాలు, పౌరుల్లో అసంతృప్తి పెంచింది. మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికైయ్యేందుకు ట్రంప్ ప్లాన్ చేస్తున్నారని, రాజ్యాంగం సవరించే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.రిపబ్లికన్ ఆధిపత్య సభలో డెమోక్రాట్లు మెజారిటీ లేకపోవడంతో, పార్టీలోని ట్రంప్ వ్యతిరేకుల మద్దతు కోరుతున్నారు. ట్రంప్ చర్యలు స్వంత పార్టీలో కూడా అసహనాన్ని రేకెత్తిస్తోంది. దీంతో అభిశంసనకు రిపబ్లికన్ సభ్యులు మద్దతు ఇస్తారని భావిస్తున్నారు. ఈ అభిశంసనను 2026 మధ్యంతర ఎన్నికలకు ఆయుధంగా ఉపయోగిస్తున్నారు. ట్రంప్ అధికారంతో ఎన్నికలపై ప్రభావం చూపించకుండా ఆపాలని భావిస్తున్నారు. మరోవైపు ట్రంప్ తన సపోర్టర్లను అప్రమత్తం చేస్తూ, మెజారిటీ కోల్పోతే ప్రతీకార చర్యలు తీసుకుంటారిని భావిస్తున్నారు.ప్రతినిధుల సభలో తీర్మానం ఆమోదమైనా, సెనెట్‌లో రిపబ్లికన్ బలంతో ట్రంప్ పదవి కోల్పోయే అవకాశం తక్కువ. అయితే, ఈ రాజకీయ రచ్చ ట్రంప్ ఇమేజ్‌ను దెబ్బతీస్తుంది. లేదా పార్టీలో చీలిక తెస్తుంది. మార్చి 31 డెడ్‌లైన్ ఒత్తిడి పెంచే ఎత్తుగడగానే కనిపిస్తోంది

# ఎంపీల పనితీరుపై సమగ్ర నివేదికలు

గుంటూరు ఫిబ్రవరి 3, తెలుగుదేశం పార్టీలో సంస్థాగత క్రమశిక్షణను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఇప్పటివరకు ఎమ్మెల్యేలు, మండల స్థాయి నాయకులకు బాధ్యతలు అప్పగిస్తూ వారి పనితీరును సమీక్షించిన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు , జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇప్పుడు అదే విధానాన్ని ఎంపీలకూ వర్తింపజేయాలని నిర్ణయించారు. ప్రజలతో నేరుగా అనుసంధానం పెంచడం, సమస్యల పరిష్కారంలో వేగం తీసుకురావడం ఈ చర్యల వెనుక ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.ఈ నిర్ణయానికి అనుగుణంగా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎదురైన సమస్యలు, గత 15 నెలల కాలంలో పరిష్కరించిన అంశాలపై ఎంపీలు సమగ్ర నివేదికలు ఇవ్వాల్సి ఉంటుందని పార్టీ ఆదేశించింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు ఎలా పరిష్కారమయ్యాయి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి ఏవి అనే వివరాలను స్పష్టంగా పొందుపరచాలని సూచించింది. దీనితో పాటు పార్లమెంటు సమావేశాల్లో ఎంపీలు ప్రస్తావించిన అంశాలు, వాటికి కేటాయించిన సమయం, ఆ చర్చల వల్ల నియోజకవర్గానికి వచ్చిన ప్రయోజనాలు వంటి విషయాలనూ వివరించాలని కోరుతోంది.ఇకపై ఎమ్మెల్యేలతో నిర్వహిస్తున్న ముఖాముఖి సమావేశాల మాదిరిగానే ఎంపీలతో కూడా నేరుగా సమావేశాలు నిర్వహించేందుకు పార్టీ సిద్ధమవుతోంది. ఈ సమావేశాల్లో ప్రజలతో నాయకులు ఎలా మమేకమవుతున్నారు, క్షేత్రస్థాయిలో వారి పాత్ర ఎంత ప్రభావవంతంగా ఉంది అనే అంశాలను ప్రత్యేకంగా పరిశీలించనున్నారు. సమస్యల పరిష్కారంలో చూపిస్తున్న చొరవ, ప్రజల మధ్య గడుపుతున్న సమయం, పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం వంటి విషయాలు ఈ సమీక్షలో కీలకంగా మారనున్నాయి.వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజల మూడ్ ఎలా మారుతోంది అనే అంశాన్ని కూడా పార్టీ గమనిస్తోంది. అందుకు తగ్గట్టుగా నాయకుల పనితీరును మలచాలనే ఆలోచనతో ఈ సమీక్షా విధానాన్ని అమలు చేస్తున్నారు. ముఖ్యంగా ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలు పార్టీకి నష్టం కలిగిస్తున్నాయని అంచనా వేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి వివాదాలకు తావు లేకుండా స్పష్టమైన బాధ్యతలు, సమన్వయం ఉండాలనే లక్ష్యంతో ఈ చర్యలు తీసుకుంటున్నారు.
నారా లోకేష్ నేతృత్వంలో పార్టీ భవిష్యత్తు వ్యూహాలు రూపొందుతున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎంపీలతో ప్రత్యక్ష సమావేశాల ద్వారా వారు ఎదుర్కొంటున్న సంస్థాగత సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలన్నది ప్రధాన ఉద్దేశ్యం. ఈ విధానంతో నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలం పెరుగుతుందని, నాయకత్వంపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని ఆశిస్తున్నారు. ఎంపీలను కూడా క్రమశిక్షణతో పనిచేసేలా "లైన్‌లో" పెట్టాలన్న ఈ ప్రయత్నం ఎంతవరకు విజయవంతమవుతుందో రాబోయే రోజుల్లో స్పష్టమవుతుందని రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

# గేమ్ ఛేంజర్ కాబోతున్న ఎర్త్ కారిడార్

నెల్లూరు ఫిబ్రవరి 3, కేంద్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో ఏపీకి గుడ్ న్యూస్ వినిపించింది. ఏపీతో పాటుగా మరో నాలుగు రాష్ట్రాలలో రేర్ ఎర్త్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. రేర్ ఎర్త్ కారిడార్ ప్రాజెక్టు ఏపీకి గేమ్ ఛేంజర్ అవుతుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఏపీలోని కోస్టల్ కారిడార్ వెంట ఉన్న ఖనిజాలు, తీర ప్రాంతం, పోర్టులతో అనుసంధానం.. ఏపీని అరుదైన ఖనిజాల అన్వేషణకు గమ్యస్థానంగా మార్చుతుందంటున్నారు.
2026-27 కేంద్ర బడ్జెట్‌లో నాలుగు రాష్ట్రాలలో రేర్ ఎర్త్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నాలుగు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా ఉంది. దీంతో ఏపీ పాలిట గేమ్ ఛేంజర్‌గా రేర్ ఎర్త్ కారిడార్ మారుతుందని అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అరుదైన భూలోహాలు, ఖనిజాల అన్వేషణకు హబ్‌గా మారుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం ప్రభుత్వం నుంచి విధానపరంగా, ఆర్థికంగా సహకారం లభించే అవకాశాలు ఉండటంతో ఆంధ్రప్రదేశ్ భారతదేశ ఖనిజ భద్రతను బలోపేతం చేయడంతో పాటు, భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలను సృష్టించగలదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు ఉన్న కోస్టల్ కారిడార్ వెంట ఏపీ ప్రభుత్వం ఇప్పటికే ఖనిజాల అన్వేషణ కోసం చర్యలు మొదలుపెట్టింది. ఇందుకోసం 16 వేల హెక్టార్ల భూమిని కూడా కేటాయించారు. కోస్టల్ కారిడార్ ప్రాంతంలో మోనజైట్, ఇల్మనైట్, రూటైల్, జిర్కాన్, గార్నెట్ వంటి ఖనిజాలు ఉన్నాయని అధికారులు చెప్తున్నారు. అరుదైన రేర్ ఎర్త్ ఆక్సైడ్లు (55?60 శాతం) థోరియం (8?10 శాతం) అధిక సాంద్రతలో ఉన్నాయంటున్నారు. ఇవి అడ్వాన్స్ టెక్నాలజీకి సంబంధించిన అత్యంత కీలకమైన ముడి పదార్థాలుగా చెప్తున్నారు.మరోవైపు ఖనిజాల అన్వేషణకు సంబంధించి ఇప్పటికే ఓ ప్రైవేట్ సంస్థకు టెండర్లు కూడా కేటాయించారు. వేయి హెక్టార్ల వరకూ అనుమతి మంజూరు చేశారు. దీనికి అదనంగా మరో నాలుగు వేల హెక్టార్లలో ఖనిజాల అన్వేషణకు కేంద్రం అనుమతి కోరుతున్నట్లు రెవెన్యూ, మైన్స్ అండ్ జియాలజీ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా వెల్లడించారు. అనుమతులు పొందిన తర్వాత మిగిలిన 11 వేల హెక్టార్లలో కార్యకలాపాలను దశలవారీగా వేగవంతం చేస్తామన్నారు. మరోవైపు ఖనిజాల తవ్వకం, ఎగుమతులు మాత్రమే కాకుండా వాటికి అదనపు విలువను జోడించడం ద్వారా మరింత ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉన్న పొడవైన తీరప్రాంతం, పోర్టులతో అనుసంధానం, విస్తరిస్తున్న పారిశ్రామిక కారిడార్లు కూడా రేర్ ఎర్త్ కారిడార్‌కు కలిసివస్తాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.
మొత్తంగా కేంద్రం బడ్జెట్‌లో ప్రకటించిన ఈ రేర్ ఎర్త్ కారిడార్ ఏపీకి గేమ్ ఛేంజర్‌గా అవకాశం ఉందని చెప్తున్నారు.

# అరకు కాఫీకి సర్కారీ ప్రమోషన్

విశాఖపట్టణం, ఫిబ్రవరి 3, ఏపీ ప్రభుత్వం కాఫీ రైతులకు శుభవార్త వినిపించింది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కాఫీ రైతులకు తీపికబురు వినిపించింది. అల్లూరి జిల్లాలోని గూడెం కొత్తవీధి, జి. మాడుగుల మండలాల్లో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం రూ.7 కోట్లు నిధులు విడుదల చేసింది. దీంతో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణ పనులు మొదలుపెట్టారు. గూడెం కొత్తవీధిలో మెషీన్ల సాయంతో భూమిని చదును చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాఫీ రైతుల కోసం కీలక నిర్ణయం తీసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జి.మాడుగుల, గూడెం కొత్త వీధి మండలాలలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. వాస్తవానికి ఈ ప్రాంతంలో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎప్పుడో ప్రణాళికలు రచించారు. అయితే క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోలేదు. నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ రెండుచోట్లా ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణం కోసం ఏపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.7 కోట్లు నిధులు విడుదల చేయడంతో పల్పింగ్ కేంద్రాల నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి.మరోవైపు ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణం కోసం జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు కూడా ఉపయోగిస్తున్నారు. 80 లక్షల రూపాయలతో కాంపౌండ్ వాల్స్ నిర్మించనున్నారు. మరోవైపు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావటంతో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణ పనులు మొదలయ్యాయి. గూడెం కొత్తవీధిలో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రం వద్ద భూమిని చదును చేసే ప్రక్రియ ప్రారంభించారు. యంత్రాల సాయంతో భూమిని చదును చేస్తున్నారు. గూడెం కొత్తవీధిలో పల్పింగ్ కేంద్రం రక్షణ గోడ కోసం రూ.40 లక్షలు ఖర్చు చేస్తున్నారు.మరోవైపు మన్యం ప్రాంతంలో కాఫీ తోటల సాగు ఎక్కువ. మన్యంలో సుమారుగా రెండున్నర లక్షల ఎకరాలలో కాఫీ పంట సాగవుతోంది. కాఫీ తోటలపై ఆధారపడి లక్షకుపైగా కుటుంబాలు జీవిస్తున్నాయి. ఇక్కడి నుంచి సుమారుగా రూ.200 కోట్ల వరకూ కాఫీ వ్యాపారం జరుగుతోంది.మరోవైపు అరకు కాఫీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న విషయం తెలిసిందే.ప్రభుత్వం కూడా అరకు కాఫీని ఇదే రీతిలో ప్రమోట్ చేస్తూ వస్తోంది. ఇందులో భాగంగానే ఈ ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించేందుకు నిధులు విడుదల చేశారు. దీంతో నిర్మాణ పనులు మొదలయ్యాయి. నిర్దేశిత గడువులోగా ఈ పనులు పూర్తిచేస్తామని అధికారులు చెప్తున్నారు.

# కొత్త పార్టీల కాలం...

విజయవాడ, ఫిబ్రవరి 3, ఏపీలో జాతీయ పార్టీల కంటే ప్రాంతీయ పార్టీల హవా నడుస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఈ రాష్ట్రాన్ని దశాబ్దాల కాలం ఏలింది. దానికి 1983లో బ్రేక్ పడింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో ప్రాంతీయ పార్టీల హవా ప్రారంభం అయింది. కానీ 2014 వరకు ప్రాంతీయ పార్టీగా ఉన్న తెలుగుదేశం వర్సెస్ కాంగ్రెస్ అన్నట్టు పరిస్థితి ఉండేది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్, తెలుగుదేశం, బిజెపి, వామపక్షాలు, ఎంఐఎం రాజకీయం చేసేవి. తరువాత కెసిఆర్ నేతృత్వంలోని టిఆర్ఎస్ ఆవిర్భవించింది. చిరంజీవి నేతృత్వంలోని ప్రజారాజ్యం, జయప్రకాష్ నారాయణ నేతృత్వంలోని లోక్సత్తా.. ఇలా చాలా పార్టీలు వచ్చాయి. కానీ రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో జాతీయ పార్టీలు పక్కకు వెళ్లిపోయాయి. ప్రస్తుతం తెలుగుదేశం, జనసేన, వైయస్సార్ కాంగ్రెస్, బిజెపి క్రియాశీలక పార్టీలు గా ఉన్నాయి. అయితే మరో మూడు ప్రాంతీయ పార్టీలు రానున్నట్లు ప్రచారం నడుస్తోంది. అయితే అంతటి స్పేస్ ఏపీ రాజకీయాల్లో ఉంటుందా? అనే ప్రశ్న మాత్రం వినిపిస్తోంది. కానీ అవసరాలు, ఆకాంక్షల కోసం మూడు పార్టీలు ఏర్పాటు అవుతాయని పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం ఉంది.. అయితే అది కేవలం ప్రచారమా? నిజంగా కార్యరూపం దాల్చే అవకాశం ఉందా? కాలమే నిర్ణయించనుంది.మాజీ ఐపీఎస్ అధికారి ఏపీ వెంకటేశ్వరరావు నూతన రాజకీయ పార్టీ కోసం సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఐఏఎస్ అధికారిగా ఉన్న ఆయన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో తీవ్ర అన్యాయానికి గురయ్యారు. అంతకుముందు చంద్రబాబు ప్రభుత్వానికి ప్రయోజనం కల్పించేందుకు వైసిపికి దెబ్బ కొట్టారని జగన్ అనుమానించారు. అందుకే వైసిపి హయాంలో వెంకటేశ్వరరావును పక్కనపెట్టారు. చివరకు ప్రమోషన్ రోజునే పదవీ విరమణ చేసుకోవాల్సి వచ్చింది. అయితే తనకు నష్టపరిచిన జగన్మోహన్ రెడ్డి విషయంలో కూటమి ప్రభుత్వం మెతక వైఖరి ప్రదర్శిస్తోందని వెంకటేశ్వరరావు లో ఒక బాధ ఉంది. పైగా తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ఆయన ప్రయత్నాలు చేశారని.. వర్కౌట్ కాలేదని ప్రచారం నడుస్తోంది. అందుకే సొంత పార్టీ ఏర్పాటు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా చంద్రబాబు అంటే ఇష్టపడని కమ్మ సామాజిక వర్గం నేతలు, బ్యూరోక్రాసివ్యవస్థలో పనిచేసిన మాజీ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది.మరోవైపు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కొత్త పార్టీ పెడతానని చాలా రోజుల కిందటే ప్రకటించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో నెంబర్ 2 నేతగా ఎదిగిన ఆయన పార్టీకి గుడ్ బై చెప్పిన సంగతి తెలిసిందే. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వంతో పాటు రాజ్యసభ పదవిని సైతం వదులుకున్నారు. ఆయనకు కూటమి పార్టీలో ఛాన్స్ లేదు. బిజెపిలో చేరే విషయంలో టిడిపి నుంచి అభ్యంతరాలు ఉన్నాయి. అందుకే ఆయన ఇప్పుడు సొంత పార్టీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముందుగా సొంత మీడియాను ఏర్పాటు చేసి తర్వాత పార్టీని ప్రారంభిస్తారని సమాచారం. జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని ఇష్టపడని రెడ్డి సామాజిక వర్గం నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. మొత్తానికి అయితే ఇద్దరు అధినేతలను విభేదించే వారితో ఈ రెండు పార్టీల ఏర్పాటుకు రంగం సిద్ధం అవుతుండడం విశేషం.

# మళ్లీ పడిపోయిన టమాటా ధరలు



తిరుపతి, ఫిబ్రవరి 3, ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి టమాటా ధరలు భారీగా పడిపోయాయి. పంటను మార్కెట్‌లకు తీసుకొచ్చిన రైతులు ధరలు పతనం కావడంతో ఆందోళనలో ఉన్నారు. కనీసం కోత, రవాణా ఖర్చులకు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు టమాటా కోతను వాయిదా వేశారు. రాష్ట్రంలోని మార్కెట్‌లలో మరీ దారుణంగా కేజీ టమాటా ధర రూ.5 నుంచి రూ.10లోపే ఉందని చెబుతున్నారు రైతులు.చాయ్ కంటే చీప్.. కేజీ రూ.10లోపే.. ఇది ఏపీలో టమాటా సాగు చేసిన రైతుల పరిస్థితి. గతేడాది కొన్ని నెలల పాటూ సిరులకు కురిపించి టమాటా ధరలు.. ఇప్పుడు మాత్రం దారుణంగా పడిపోయాయి. మార్కెట్‌లలో కేజీ టమాటా ధర రూ.5 నుంచి రూ.10లోపే ఉంది. ఈ ధరలు దారుణంగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. టమాటా కోత, రవాణా చేసినందుకు అయ్యే ఖర్చు కూడా మిగలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను మార్కెట్‌కు తరలించినా ఉపయోగం లేకుండా పోతోంది అంటున్నారు. ఒక్కసారిగా ధరల పడిపోవడంతో ఆందోళనలో ఉన్నారు. అయితే జనాలు మాత్రం టమాటా ధరలు తగ్గిపోవడంతో పండగ చేసుకుంటున్నారు.జనవరి మొదటి వారంలో టమాటాలు కేజీ రూ.10 నుంచి రూ.20 మధ్య పలికాయి. ఇప్పుడేమో దారుణంగా కేజీ రూ.5 నుంచి రూ.10 మధ్య పలుకుతున్నాయి. అయితే వ్యాపారులు రిటైల్‌గా కేజీ రూ.15 నుంచి రూ.20కు టమాటాను విక్రయిస్తున్నారు. కానీ దారుణంగా రైతుల నుంచి మాత్రం తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. టమాటా పంట నాణ్యత సరిగా లేకపోవడంతోనే ధరలు తగ్గాయంటున్నారు వ్యాపారులు. మార్కెట్‌కు వస్తున్న సరుకు మొదట్లో వచ్చినంత నాణ్యత లేదని.. అందుకే తిరస్కరిస్తున్నట్లు చెబుతున్నారు.రైతులు మాత్రం వ్యాపారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ క్రమంలో మార్కెట్లకు వచ్చే టమాటా పంట కూడా తగ్గింది అంటున్నారు. టమాటా ధరలు దారుణంగా పడిపోవడంతో చాలామంది రైతులు కాయల్ని కోసే సాహసం చేయడం లేదు. ఇటీవల టమాటా సాగు చేసిన రైతులది కూడా ఇదే పరిస్థితి. టమాటా సాగు కోసం భారీగా పెట్టుబడులు పెట్టామని.. ఇప్పుడు ధరలు తగ్గడంతో కనీసం ఖర్చులకు కూడా డబ్బులు రావడం లేదంటున్నారు. చాలామంది రైతులు అప్పులబారిన పడుతున్నారట. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రైతులకు గిట్టుబాటు ధరల దక్కేలా న్యాయం చేయాలని కోరుతున్నారు. కొందరు రైతులు మాత్రం ధరలను చూసి పొరుగు జిల్లాల్లో మార్కెట్‌లకు తరలిస్తున్నారట. అక్కడైనా సరైన దొరకుతుందనే ఆశతో ఇలా చేస్తున్నారట. మొత్తానికి టమాటా ధరలు తగ్గడంతో రాష్ట్రంలో రైతులు కష్టాల్లో ఉన్నారు

# ఎట్టకేలకు ట్రేడ్ డీల్...

## 18 శాతానికి తగ్గనున్న టారిఫ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (న్యూస్ పల్స్) భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిందని అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ ప్రకటించారు. మరోవైపు భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాన్ని అమెరికా 18 శాతానికి తగ్గించిందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు.అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ ఇరువురూ ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు.అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిందని, భారతీయ దిగుమతులపై అమెరికా సుంకాన్ని 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నామని అధ్యక్షుడు ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు."భారతదేశంలో తయారైన ఉత్పత్తులపై అమెరికాలో విధించే సుంకాలు ఇకపై 18 శాతానికి తగ్గనున్నాయని తెలిసి నాకు సంతోషంగా ఉంది" అని ప్రధాని మోదీ అన్నారు."ప్రధాని మోదీపై అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తోంది" అని ఈ ప్రకటన తర్వాత ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. చాలాసార్లు చెప్పినట్లుగా, అధ్యక్షుడు ట్రంప్ నిజంగా ప్రధానమంత్రి మోదీని చాలా మంచి స్నేహితుడిగా భావిస్తారు వాణిజ్య ఒప్పందం వార్తలతో నాకు చాల సంతోషంగా ఉంది. అమెరికా-భారతదేశం సంబంధం అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది" భారతదేశంలో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఇన్‌స్టాగ్రామ్‌లో రాత్రి పోస్ట్ చేశారు.దాదాపు ఏడాదికాలంగా రెండు దేశాల మధ్య సంబంధాలలో అనేక ఒడిదుడుకులు ఎదురవుతున్న నేపథ్యంలో సోమవారం రాత్రి రెండు దేశాల అగ్ర నాయకులు చేసిన ఈ ప్రకటన చాలా కీలకంగా మారింది.మొదట విధించిన సుంకాలతో పాటు, రష్యా నుంచి భారత్ చేసే చమురు కొనుగోళ్లపై అమెరికా 25 శాతం సుంకం విధించడంతో మొత్తం 50 శాతానికి చేరుకుంది. భారత ప్రధాని మోదీతో మాట్లాడటం గౌరవంగా ఉంది. ఆయన నా ప్రాణ స్నేహితులలో ఒకరు. తన దేశంలో శక్తివంతమైన, గౌరవనీయమైన నాయకుడు. వాణిజ్యం, రష్యా-యుక్రెయిన్ యుద్ధాన్ని ముగించడం వంటి అనేక అంశాలపై మేము చర్చించాం. రష్యా చమురు కొనుగోలును ఆపివేసి, అమెరికా నుంచి, బహుశా వెనెజ్వెలా నుంచి మరింత చమురు కొనుగోలు చేయడానికి ఆయన అంగీకరించారు"ఇది యుక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధాన్ని ముగించడంలో సహాయపడుతుంది, ఈ యుద్ధం ప్రతివారం వేలమందిని చంపుతోంది. ప్రధానమంత్రి మోదీ పట్ల స్నేహం, గౌరవం కారణంగా, ఆయన విజ్ఞప్తి మేరకు, అమెరికా, భారతదేశం మధ్య తక్షణమే అమలులోకి వచ్చే వాణిజ్య ఒప్పందానికి మేము అంగీకరించాం. దీని కింద భారతీయ వస్తువులపై సుంకాన్ని 25 శాతం నుంచి 18 శాతానికి అమెరికా తగ్గించింది"భారత్ కూడా అమెరికాతో తన సుంకాలు, నాన్-టారిఫ్ అడ్డంకులను జీరో చేసే దిశగా ముందుకు సాగుతుంది. "బై అమెరికన్" విధానం కింద అమెరికా నుంచి మరిన్ని కొనుగోళ్లు చేయడానికి ప్రధానమంత్రి మోదీ తన నిబద్ధతను వ్యక్తం చేశారు. ఇందులో 500 బిలియన్ డాలర్లకు పైగా విలువైన అమెరికా ఇంధనం, సాంకేతికత, వ్యవసాయం, బొగ్గు, అనేక ఇతర ఉత్పత్తులు ఉంటాయి""ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలిసి పనిచేసినప్పుడు, అది మన ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తుంది. పరస్పర ప్రయోజనం కోసం అపారమైన అవకాశాలను అందిస్తుంది""ప్రపంచ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం అధ్యక్షుడు ట్రంప్ నాయకత్వం చాలా కీలకం. శాంతి కోసం ఆయన చేసే ప్రయత్నాలలో భారత్ ఆయనకు గట్టి అండగా నిలుస్తుంది. మా భాగస్వామ్యాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడానికి ఆయనతో కలిసి పనిచేయడానికి నేను ఎదురు చూస్తున్నాను" అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

# రాజ్యసభ ఆశల పల్లకిలో

విజయవాడ, ఫిబ్రవరి 3, పెద్దల సభ రేసు. ఎవరి ఈక్వేషన్స్ వాళ్లవి. ఒకరు ఏపీ నుంచి ఖాళీ అయ్యే సీట్లలో బెర్త్ కోసం ట్రై చేస్తుంటే..మరొకరు పెద్దల సభలో అడుగు పెట్టి ఏపీలో చక్రం తిప్పాలని స్కెచ్ వేస్తున్నారట. జాతీయ నేతలను కలుస్తూ..ఒక్క ఛాన్స్ ప్లీజ్ అంటూ రిక్వెస్ట్ చేస్తున్నారట. కానీ ఆ ఇద్దరు రాజ్యసభలో అడుగుపెట్టేందుకు..వాళ్ల పార్టీల్లో పరిస్థితుల్లో అంత ఈజీగా లేవట. మరో మూడు నెలల తర్వాత ఖాళీ కానున్న రాజ్యసభ సీట్లపై ఇప్పటినుంచే ఆసక్తికర రేసు కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా 73 సీట్లు ఖాళీ కానుండటంతో ఏపీకి చెందిన పలు పార్టీల నేతలు లాబీయింగ్‌ను స్పీడప్ చేశారు. అయితే ఆంధ్రప్రదేశ్ నుంచి నాలుగు రాజ్యసభ సీట్లు మాత్రమే ఖాళీ అవుతున్నాయి. అందులో ఒకటి బీజేపీకి దక్కే అవకాశం ఉండటంతో..బీజేపీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు..రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. జాతీయ స్థాయి బీజేపీలో పలుకుబడి కలిగిన నాయకుడిగా ఉన్న జీవీఎల్ నరసింహారావు..కేంద్ర బడ్జెట్‌పై విస్తృత ప్రచారం చేసేందుకు..దక్షిణాది రాష్ట్రాల కోఆర్డినేటర్ బాధ్యతల్లో ఉన్నారు. ఇదే సమయంలో రాజ్యసభ సీట్లు ఖాళీ కానుండటంతో..పెద్దల సభ బెర్త్‌పై పెద్ద ఆశలే పెట్టుకుంటున్నారట జీవీఎల్.జాతీయ పార్టీ ఆయన సేవలను మరింతగా వినియోగించుకోవాలనుకుంటే ఛాన్స్ ఇవ్వొచ్చని అంటున్నారు. ఏపీ కోటాలో ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ సీట్లలో బీజేపీ వాటాగా దక్కే ఒక సీటుని జీవీఎల్‌కు ఇస్తారని టాక్. ఆయనకు అవకాశం ఇస్తే..ఏపీలో బ్రాహ్మణ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు అవుతుందన్న ఈక్వేషన్స్ కూడా ఉన్నాయట. అదే జరిగితే జీవీఎల్ మళ్లీ లైమ్ లైట్‌లోకి వచ్చినట్లే అని అంటున్నారు.

2024 ఎన్నికల్లో విశాఖ నుంచి లోక్ సభకు పోటీ చేయాలని జీవీఎల్ భావించినా ఆ సీటు పొత్తులో టీడీపీకి వెళ్లింది. ఇప్పుడు రాజ్యసభ ఛాన్స్ ఇస్తే జీవీఎల్‌కు రాజకీయంగా దశ తిరిగినట్లే అని అంటున్నారు. అయితే కూటమి నేతలతో జీవీఎల్‌కు ఉన్న సంబంధాల మీదే డిస్కషన్స్ జరుగుతున్నాయ్. అటు సీఎం చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌తో సహా ఏపీ బీజేపీ నేతలతో కూడా జీవీఎల్‌కు పెద్దగా చెప్పుకోదగ్గ సాన్నిహిత్యం లేదంటున్నారు. బీజేపీ పెద్దలు ఫిక్స్ అయితే మాత్రం జీవీఎల్‌కు బెర్త్ పక్కా అన్న టాక్ వినిపిస్తోంది.ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న వైఎస్ షర్మిల కూడా పెద్దల సభలో రేస్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది..

ఆమె 2024 జనవరిలో ఏపీ పీసీసీ చీఫ్‌గా పదవిని చేపట్టి..రెండేళ్లుగా ఆ పోస్ట్‌లో కొనసాగుతున్నారు. అయితే కాంగ్రెస్ బలోపేతం కోసం వైఎస్ షర్మిల చేసిన ప్రయత్నాలు ఏపీ పెద్దగా ఫలించలేదు. ఆమెతో పొసగక..కాంగ్రెస్ సీనియర్లు సైలెంట్ అయిపోయారు. వైసీపీ నుంచి ఎవరూ కాంగ్రెస్ వైపు రావడం లేదు. ఈ నేపథ్యంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నారు షర్మిల. జిల్లాల పర్యటనకు కూడా సిద్ధమవుతున్నారు.ఈ మధ్యే ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసిన షర్మిల ఏపీలో పార్టీ పరిస్థితులు, రాజకీయ పరిణామాలపై చర్చించారు. అయితే తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసినప్పుడు షర్మిలకు రాజ్యసభ సీటు ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు హామీ ఇచ్చినట్లు ప్రచారం ఉంది. ఈ మధ్యలో ఒకటి రెండు సార్లు రాజ్యసభకు సీట్లు ఖాళీ అయినా షర్మిలకు బెర్త్ దక్కలేదు. పలువురు ఏపీ కాంగ్రెస్ సీనియర్ నేతలే షర్మిలకు దక్కిన హామీ నెరవేరకుండా అడ్డుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది.అయితే రాజ్యసభలో 73 సీట్లు ఖాళీ అవుతున్నా కాంగ్రెస్‌కు దక్కేది తక్కువే అంటున్నారు. ప్రస్తుతం రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీకి 27 సీట్లు ఉన్నాయి. 73 మంది సభ్యులు పదవీ విరమణ చేయనుండటంతో ఆ పార్టీకి ఇంకా సీట్లు తగ్గనున్నాయి. పైగా పదవీ విరమణ చేస్తున్న ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే వంటి వారిని తిరిగి కొనసాగించాల్సి ఉంది. ఖర్గేను తెలంగాణ కోటా రాజ్యసభకు పంపిస్తారని ఇన్ సైడ్ టాక్. అయితే కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ ఈ మూడూ స్టేట్స్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉంది.

ఈ మూడు రాష్ట్రాల్లో ఏడు సీట్లు ఇక్కడ ఖాళీ అవుతున్నాయి. ఇందులో కాంగ్రెస్‌కు ఐదు కచ్చితంగా వస్తాయి.మహారాష్ట్ర, తమిళనాడు, అసోం వంటి చోట్ల కలుపుకుంటే ఒకటి, రెండు సీట్లు దక్కే అవకాశం ఉంది. కర్నాటక లేకపోతే తెలంగాణ కోటాలో షర్మిలను రాజ్యసభకు పంపించే అవకాశం ఉందట. అయితే తెలంగాణ, కర్నాటక నుంచి రాష్ట్రాల పెద్దల సభలో అడుగుపెట్టేందుకు చాలామంది రేసులో ఉండటంతో షర్మిలకు రాజ్యసభ సీటు దక్కడం అంత ఈజీ కాదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

కాంగ్రెస్ పార్టీ పెద్దలు కనుక షర్మిలకు ఇచ్చినట్లు చెబుతున్న హామీని నిలబెట్టుకోవాలనుకుంటే..ఆమెకు రాజ్యసభ బెర్త్ పక్కా అన్న ప్రచారం జరుగుతోంది. అయితే అటు జీవీఎల్, ఇటు షర్మిల విషయంలో బీజేపీ, కాంగ్రెస్ అధినాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది వేచి చూడాలి.

# ఎంఐఎంకు షిఫ్ట్ అవుతున్న ముస్లింలు


హైదరాబాద్, ఫిబ్రవరి 3,భారత దేశంలో దాదాపు అన్నీ సెక్యూలర్ పార్టీలే. బీజేపీ, శివసేన మాత్రమే హిందుత్వ పార్టీలుగా గుర్తింపు పొందాయి. చిన్న పార్టీలు ఉన్నా బలమైన పార్టీలు మాత్రం బీజేపీ, తర్వాత శివసేన. కాంగ్రెస్, ఎస్పీ, త్రుణమూల్ కాంగ్రెస్, ఆప్, సీపీఐ, బీఎస్పీతోపాటు ప్రాంతీయ పార్టీలు లౌకిక పార్టీలుగా చెప్పుకుంటాయి. అయితే ఇప్పుడు ఈ సెక్యులర్ పార్టీలకు కొత్త ముప్పు రాబోతోంది. ఎంఐఎం (అఖిల్ భారత్ మజ్లిస్?ఇ?ఇత్తిహాదుల్ ముస్లిమీన్) సెక్యూలర్ పార్టీలకు భవిష్యత్‌లో చెక్ పెట్టబోతోంది. ఇప్పటికిప్పుడు అధికారం సాధించకపోయినా, ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తోంది.కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎంఐఎం మద్దతు కీలకం. కర్ణాటకలో ముస్లిం నాయకులు ఎంఐఎంను పోటీ నుంచి ఉపసంహరించారు. తెలంగాణలో నగరాల్లో అభ్యర్థులు నిలిపి, బీఆర్ఎస్‌కు ఓట్లు వదిలేశారు. కాంగ్రెస్ మూడు రాష్ట్రాల్లో రెండిటిలో ఎంఐఎం సహాయంతోనే గెలిచింది.బిహార్ సిమాంచల్‌లో కాంగ్రెస్ 19 నుంచి 6 సీట్లకు పడిపోయింది. ఎంఐఎం 5 సీట్లు సాధించి సమానంగా నిలిచింది. మహారాష్ట్ర మున్సిపల్‌లో 13 మున్సిపాలిటీల్లో 116 సీట్లు. శంభాజీనగర్‌లో 33, విదర్భ, మారేగావ్‌లో 21, నాందేడ్‌లో 14, ధులేలో 10, షోలాపూర్‌లో 8. ముంబైలో ఎన్సీపీ, ఎంఎన్ఎస్ కంటే ఎక్కువ 8 సీట్లు. సమాజ్‌వాదీ పార్టీ ఒక్క సీటు కూడా లేకుండా పోయింది.ముస్లింలు సెక్యులర్ పార్టీలతో ప్రయోజనం లేదని గ్రహించారు. అందుకే ఆర్జేడీ, జేడీయూ ఓట్లు కోల్పోయాయి. తెలంగాణలో కాంగ్రెస్ బీఆర్ఎస్‌కు ఓటు వెళ్లాయి. గుజరాత్ అహ్మదాబాద్ మున్సిపల్‌లో ఎంఐఎం 4 సీట్లు గెలిచింది.త్వరలో అసోం, బెంగాల్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ రెండుచోట్ల పోటీ చేయాలని ఎంఐఎం భావిస్తోంది. అసోంలో యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్‌తో చేతులు కలిపేందుకు చర్యలు ప్రారంభించింది. ఇదే జరిగితే ముస్లింలు కాంగ్రెస్‌కు పూర్తిగా దూరమవుతారు. ఇక బెంగాల్‌లో ఇండియన్ సెక్యూలర్ ఫ్రంట్ అనే పార్టీ ఉంది. ఐఎస్ఎఫ్, ఎంఐఎంలు రెండూ చేతులు కలిపే అవకాశాలు ఉన్నాయి. దీంతో లౌకికవాదుల ఓట్లు తగ్గిపోకే అవకాశం ఉంది. ఇక ఉత్తర ప్రదేశ్‌లో గతంలో పోటీచేశారు. ఈసారి చిన్న పార్టీలతో కలిసి పోటీ చేయాలని ఎంఐఎం భావిస్తోంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో మజ్లిస్ ఐదారు స్థానాలు గెలిచింది. ఈసారి ఎన్నికల్లో ముస్లిం ఓట్లు ఎంఐఎం సాధించేలా ఒవైసీ ప్రయత్నం చేస్తున్నారు. మొత్తంగా ముస్లింలు సెక్యులర్ పార్టీతలో ఎలాంటి లాభం లేదన్నది అర్థమవుతోంది. ఈ భావన ముస్లింలలో బలపడుతోంది. దీంతో ముస్లింలు ఎంఐఎంవైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ట్రెండ్ కాంగ్రెస్ 'సంఘటన్ సృజన్' ప్రయత్నాలను వృథా చేస్తుంది.ముస్లింలు ఎంఐఎంను ఎంచుకుంటే సెక్యులర్ పార్టీల ఓటుబ్యాంక్ క్షీణిస్తుంది. బీజేపీకి ప్రయోజనం దక్కవచ్చు. ఎంఐఎం గెలుపు రాజకీయ డైనమిక్స్‌ను మార్చే అవకాశం ఉంది.

# బల్లెంగా మారుతున్న అర్జున్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3, (న్యూస్ పల్స్) అర్జున్. ఆకాశం లో అలుపు అనేది లేకుండా తిరుగుతుంది. తన చూపుతో ఎంతటి చిన్న వస్తువునైనా కనిపెడుతుంది. అది ప్రమాదకరం అని తెలిస్తే వెంటనే నాశనం చేస్తుంది. చూసి రమ్మంటే కాల్చివచ్చి బూడిదను తీసుకొస్తుంది. అలాగని ఇదేమి యుద్ధ విమానం కాదు. ఫైటర్ జెట్ కాదు. ఇంతకీ ఇదేంటంటే..పూర్వకాలంలో యుద్ధాలు చేస్తున్నప్పుడు పక్షులను కూడా వాడుకునేవారు. పక్షుల ద్వారా వర్తమానాలు మాత్రమే కాదు.. శత్రువుల సంబంధించిన స్థావరాలను కూడా గుర్తించేవారు. ఆ స్థావరాలను పక్షుల ద్వారానే నాశనం చేయించేవారు. అప్పట్లో ఆ కాలంలో ఆధునికమైన విమానాలు లేవు కాబట్టి రాజులు పక్షులను తమ యుద్ధ తంత్రాలుగా.. యుద్ధానికి ఉపయోగపడే వస్తువులుగా వాడేవారు.నేటి ఆధునిక కాలంలో అత్యంత సామర్థ్యం ఉన్న విమానాలు.. డ్రోన్లు.. ఇంకా చెప్పాలంటే రకరకాల జెట్ లు యుద్ధాలలో పాలుపంచుకుంటున్నాయి. అయితే ఈ కాలంలో కూడా పక్షులను యుద్ధ రీతులలో.. శత్రువుల స్థావరాలను కనుక్కోవడంలో ఉపయోగిస్తున్నారు. అయితే ఇందులో మన దేశం కూడా ఉంది. మన దేశానికి సంబంధించిన గూడచారి వ్యవస్థ ఒక గద్దను ఏజెంట్ గా వాడుకుంటున్నది. సహజంగా గద్దలు గూడచారులుగా వ్యవహరిస్తుంటాయి. వాటికి సరైన శిక్షణ ఇస్తే ఎలాంటి పని అయినా సరే చిటికెలో చేస్తాయి.మన దేశ గూడచారి వ్యవస్థ శిక్షణ ఇచ్చిన గద్ద పేరు అర్జున్. ఇది దేశ సైనిక వ్యవస్థకు అండగా ఉంటున్నది. శత్రువుల స్థావరాలపై కన్నేస్తుంది. శత్రువుల కదలికలను నిత్యం కనిపెడుతూనే ఉంటుంది. డ్రోన్లను గుర్తించి నిర్వీర్యం చేస్తుంది. దీనిని మనదేశ గూడచారి వ్యవస్థ ఆకాశరాజు అని పిలుస్తోంది. ఇలాంటి గద్దలు మన దేశ గూడచారి వ్యవస్థ వద్ద చాలా ఉన్నాయి. అయితే అందులో ఎలక్ట్రానిక్ సదుపాయాలు ఉన్న గద్ద మాత్రం అర్జున్ ఒక్కటే. ఇది సరిహద్దుల వెంబడి ప్రయాణిస్తూ ఉంటుంది. ఆకాశమార్గంలోనే శత్రువుల స్థావరాలను పసిగడుతూ ఉంటుంది. శత్రువులు వదిలిపెట్టే డ్రోన్ల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తుంది. మనదేశ గూడచార వ్యవస్థకు చేరవేరుస్తూ ఉంటుంది. కొన్ని సందర్భాలలో వాటిని నిర్వీర్యం చేసి.. కూల్చివేస్తుంది. ముఖ్యంగా సరిహద్దుల్లో తీవ్రవాదులు చొరబాట్లకి ప్రవేశించినప్పుడు.. అర్జున్ పసిగడుతుంది.. ఎప్పటికప్పుడు సమాచారాన్ని సైన్యానికి చేరవేరుస్తుంది.

# రోడ్ కం రైల్వే బ్రిడ్జ్ పై ప్రమాదం

## ముగ్గురు మృతి



రాజమండ్రి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు రోడ్ కం రైల్వే బ్రిడ్జి పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కొవ్వూరు నుండి పల్సర్ వాహనంపై ముగ్గురు యువకులు రాజమండ్రి వెళ్తూ ఎదురుగా వస్తున్న యాక్టివాహనాన్ని ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. పల్సర్ వాహనంపై ఉన్న పోతుకుంట అక్షయ్ కుమార్ (20), సగరపు సత్య కళ్యాణ్(20) రాజమండ్రి కి చెందిన ఆవాల లక్ష్మీనారాయణ సంఘటన స్థలంలోనే మృతి చెందారు. గాయాలైన ఏడుకొండలను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పట్టణ సీఐ సంఘటనా స్థలంలో మృతదేహాలు చెల్లాచెదురుగా పడడతె బ్రిడ్జిపై ట్రాఫిక్ నిలిచిపోయింది

# 41 శాతానికి పెరిగిన స్టేట్ ఫైనాన్స్

## కమిషన్ నిధులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3, (న్యూస్ పల్స్) ఫిబ్రవరి 1, 2026న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో 16వ ఆర్థిక కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం అధికారికంగా ఆమోదించింది. డాక్టర్ అరవింద్ పనగారియా నేతృత్వంలోని ఈ కమిషన్, 2026-31 కాలానికి గాను కేంద్ర పన్నుల నుంచి రాష్ట్రాలకు ఇచ్చే వాటాను, నిధుల పంపిణీకి సంబంధించిన కీలక నిర్ణయాలను వెల్లడించింది.16వ ఆర్థిక కమిషన్ రాష్ట్రాల వాటాను 41% వద్దే కొనసాగించాలని సిఫార్సు చేసింది. ఇది 15వ ఆర్థిక కమిషన్ నిర్ణయించిన వాటాకు సమానం. అనేక రాష్ట్రాలు తమ వాటాను 50%కి పెంచాలని కోరినప్పటికీ, కేంద్రం వద్ద ఉన్న ఆర్థిక వనరుల లభ్యతను దృష్టిలో ఉంచుకుని కమిషన్ పాత శాతాన్నే కొనసాగించింది.ఒక రాష్ట్రానికి ఎంత వాటా రావాలి అనేది నిర్ణయించడానికి ఈసారి కమిషన్ ఒక సరికొత్త అంశాన్ని చేర్చింది. అదే "రాష్ట్రం యొక్క జీడీపీ సహకారం". దీనివల్ల ఆర్థికంగా మెరుగ్గా రాణిస్తున్న రాష్ట్రాలకు ప్రయోజనం కలుగనుంది.కొత్తగా చేర్చిన జీడీపీ సహకారం మరియు ఇతర నిబంధనల వల్ల దక్షిణాది రాష్ట్రాలకు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ వంటి రాష్ట్రాలకు గతంలో కంటే కొంత మెరుగైన ప్రయోజనం కలిగే అవకాశం ఉంది.16వ ఆర్థిక కమిషన్ సిఫార్సులు "పనితీరుకు గుర్తింపు" ఇచ్చేలా ఉన్నాయి. కేవలం జనాభా లేదా వెనుకబాటుతనం మాత్రమే కాకుండా, దేశ అభివృద్ధికి రాష్ట్రాలు ఇచ్చే ఆర్థిక సహకారాన్ని కూడా ప్రాతిపదికగా తీసుకోవడం ఒక చారిత్రక మార్పు.

# గులాబీకే ఆత్మగౌరవం పేటెంట్ రైట్స్...

హైదరాబాద్, ఫిబ్రవరి 3, బీఆర్ఎస్ పార్టీ చరిత్ర చూస్తే ఎప్పుడు కష్టాలు, సమస్యలు చుట్టుముట్టినా .. ఆపార్టీ నమ్ముకునేది తెలంగాణ సెంటిమెంట్. ఉద్యమ పార్టీగా మొదలై , ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత.. పదేళ్లపాటు పగ్గాలు చేపట్టింది.అప్పుడు ఎక్కడ చూసినా గులాబీ జెండాలే కనిపించేవి. పోలీసుల నుంచి అన్ని వ్యవస్థలు .. అప్పటి ప్రభుత్వం చెప్పినట్లు స్పందించేవి. అయితే ఇప్పుడు ప్రభుత్వం మారింది. వ్యవస్థలు కూడా.. ఇప్పటి ప్రభుత్వానికి అనుగుణంగా నడుస్తున్నాయి. దీంతో బీఆర్ఎస్ .. ఇరిటేట్ అవుతున్నట్లు కనిపిస్తోంది..ఫోన్ ట్యాపింగ్ కేసులో వ్యవహారం కాస్తా ఇప్పుడు కేసీఆర్ వరకూ వెళ్లింది. ఈ కేసులో ఆరోపణలపై సిట్ బృందం.. గులాబీ అధినేత కేసీఆర్ ను విచారించింది. ఇది బీఆర్ఎస్ శ్రేణులకు ఆగ్రహం తెప్పించింది. చావు నోట్లో తలపెట్టి, ప్రత్యేక రాష్ట్రం తెచ్చిన కేసీఆర్ ను.. సిట్ విచారణకు రమ్మంటారా అని ఆపార్టీ సీనియర్ నేతలు సైతం ఆక్షేపించారు. అంతేకాదు? ఇది కక్ష పూరితమంటూ ఆగ్రహించారు కూడా.అయితే చట్టం ముందు అందరూ సమానమే. గతంలో సీఎంలుగా ఉన్న సమయంలో హేమాహేమీలు జయలలిత, లాలు ప్రసాద్ యాదవ్, షిబు సొరెన్ సహా పలువురు దర్యాప్తు సంస్థల ముందు విచారణకు హాజరయ్యారు. కొందరు సీఎంలుగా ఉన్న సమయంలో అరెస్టయ్యారు కూడా. అది భారత చట్టం, రాజ్యాంగం ప్రకారం జరిగింది . అలాంటప్పుడు కేసీఆర్ కు మాత్రం ఎందుకు మినహాయింపు ఉంటుంది. ఆ విషయం బీఆర్ఎస్ నేతలకు తెలిసినా.. తెలియనట్లు వ్యవహరిస్తున్నారని చెప్పక తప్పదు.ఇక కేసీఆర్ ను టచ్ చేస్తే.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేసినట్లు అని మరికొందరు బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. ప్రత్యేక రాష్ట్రం వచ్చింది. పదేళ్లు గడిచాయి. ఇంకా ఆత్మగౌరవమంటూ.. ట్యాపింగ్ కేసు విచారణ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడడంపై .. తెలంగాణ ఉద్యమ కారుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తప్పు చేయకుంటే.. విచారణకు సహకరించి, శుద్ధపూసలా బయట పడాలని వారు చెబుతున్నారు. అంతేకానీ.. తమనేతను విచారణ చేయకూడదన్నట్లు వ్యవహరించొద్దన్నది వారు సూచనగా ఉంది.

# ఎన్నికల కోసం కూతురు బలి

నిజామాబాద్, ఫిబ్రవరి 3, అధికారంపై వ్యామోహం మనిషిలోని మానవత్వాన్ని చంపేయడమే కాదు, కన్న కూతురినే బలి తీసుకునేలా ప్రేరేపించిన కిరాతక ఘటన నిజామాబాద్ జిల్లాలో వెలుగుచూసింది. కేవలం సర్పంచ్ పదవికి అనర్హుడు కాకూడదనే స్వార్థంతో, ఒక తండ్రి పక్కా స్కెచ్‌తో తన కూతురిని ప్రాణాలతో కాలువలోకి తోసి హత్య చేసిన వైనం సమాజాన్ని నివ్వెరపరుస్తోంది. మహారాష్ట్రకు చెందిన పాండురంగ అనే వ్యక్తికి రాజకీయాల్లో ఎదగాలనే బలమైన కోరిక ఉంది. గ్రామంలో సర్పంచ్‌గా పోటీ చేయలని అనుకుంటున్నాడు. అయితే, అక్కడి ముగ్గురు పిల్లల నిబంధన అతనికి అడ్డుగా మారింది. ఈ అడ్డంకిని తొలగించుకోవడానికి అతను ఎంచుకున్న మార్గం అత్యంత హేయమైనది. తన ముగ్గురు సంతానంలో ఒకరు తగ్గిపోతే తాను ఎన్నికల్లో పోటీ చేయవచ్చనే ఉద్దేశంతో, ప్రస్తుత సర్పంచ్ గణేష్‌తో కలిసి క్రిమినల్ కుట్ర పన్నాడు. పక్కా వ్యూహం ప్రకారం, తన పెద్ద కూతురు ప్రాచీని నిజామాబాద్ జిల్లా ఎడపల్లి సమీపంలోని నిజాం సాగర్ కెనాల్ వద్దకు తీసుకువచ్చాడుసాక్ష్యాలు దొరక్కుండా ఉండేందుకు నిర్మానుష్య ప్రాంతాన్ని ఎంచుకున్న పాండురంగ, పన్నెండేళ్ల ఆ బాలిక తనను కాపాడమని ప్రాధేయపడుతున్నా కనికరం లేకుండా ప్రవహిస్తున్న కెనాల్‌లోకి తోసేశాడు. బతికి ఉండగానే నీటిలోకి నెట్టడంతో, ఆ చిన్నారి ఊపిరి ఆడక జలసమాధి అయింది. ప్రాథమికంగా ఇది ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా చిత్రీకరించే ప్రయత్నం జరిగినప్పటికీ, పోలీసుల నిశిత దర్యాప్తులో అసలు మోటివ్ బయటపడింది. కెనాల్‌లో లభ్యమైన గుర్తుతెలియని మృతదేహం కేసును ఛేదించేందుకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. ఘటనా స్థలంలో నిందితుల మొబైల్ సిగ్నల్స్, సరిహద్దు ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించారు. లోతైన విచారణలో పాండురంగ తన నేరాన్ని అంగీకరించాడు. కేవలం రాజకీయ పదవి కోసం కన్న కూతురిని అంతం చేయడమనే ఈ క్రూరమైన చర్య పోలీసులను సైతం విస్మయానికి గురిచేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు పాండురంగతో పాటు, హత్యకు ప్రేరేపించి సహకరించిన కేరూరు సర్పంచ్ గణేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిపై ఐపీసీలోని హత్య, కుట్ర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అధికారం కోసం పన్నెండేళ్ల బాలిక ప్రాణాలను బలితీసుకున్న ఈ ఘటన రెండు రాష్ట్రాల్లోనూ తీవ్ర చర్చనీయాంశమైంది. స్వార్థం కోసం కన్నపేగును తెంచుకున్న ఈ తండ్రికి కఠిన శిక్ష పడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.జామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం ఏఆర్‌పీ క్యాంప్ నిజాం సాగర్ శివారులోని డి 46/8 కెనాల్‌లో దొరికిన బాలిక హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆ బాలిక మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ముక్కెడ్ తాలూకా కేరూర్ గ్రామానికి చెందిన పాండు రంగ అనే వ్యక్తి కుమార్తె అని గుర్తించారు. మహారాష్ట్రలో రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉండొద్దు అనే నిబంధన ఉండటంతో ఎలాగైనా ఎన్నికల్లో నిలబడాలని నిర్ణయించుకున్న పాండు రంగ.. ఊహించని నిర్ణయం తీసుకున్నాడు.సర్పంచ్ పోటీకి అనర్హుడిగా మారానని తన మిత్రుడు ప్రస్తుత కేరూర్ గ్రామ సర్పంచ్‌తో చెప్పడంతో అతడు ఈ సలహా ఇచ్చాడు. తన ఫ్రెండ్ సలహాతోనే తన పెద్ద కుమార్తెను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో హంతకుడు పాండురంగ వెల్లడించాడు. దీంతో హత్య చేసిన పాండు రంగ, సలహా ఇచ్చిన గ్రామ సర్పంచ్ గణేష్ షిండేను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు.ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేయాలని.. తన పెద్ద కుమార్తె ప్రాచీని.. ఎడపల్లికి తీసుకొచ్చి ప్రాణాలతో ఉండగానే కెనాల్‌లోకి తోసి హత్య చేసినట్లు ఆమె తండ్రి పాండు రంగ పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. ఇక నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన ఆ బాలిక.. ఊపిరి ఆడక మృతి చెందింది.

# ఖమ్మంలో మోడల్ మార్కెట్..

ఖమ్మం, ఫిబ్రవరి 3, ఖమ్మం జిల్లా రైతులకు త్వరలో శుభవార్త అందనుంది. కొత్త మోడల్ మార్కెట్ అందుబాటులోకి రానుంది. గత నెల ఫిబ్రవరి నుంచి నిర్మాణం చేపడుతుండగా.. ఈ నెలలోనే పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. మొత్తం 7 షెడ్లు నిర్మిస్తుండగా.. 5 షెడ్ల నిర్మాణం పూర్తయింది. ఈ నెలాఖరు నాటికి మిగిలిన రెండు షెడ్ల నిర్మాణాలు కూడా పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు.ఖమ్మంలో కొత్త మార్కెట్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పాత మార్కెట్ స్థానంలోనే షెడ్లను కూల్చివేసి.. రూ.155.45 కోట్లతో 15 ఎకరాల స్థలంలో ఆధునిక వసతులతో కొత్తగా మార్కెట్ ను నిర్మిస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సొంత నియోజకవర్గం కావడంతో.. రాష్ట్రంలోనే మోడల్ మార్కెట్ గా దీన్ని తీర్చిదిద్దాలని ఆయన ప్లాన్ చేశారు. గత సంవత్సరం ఫిబ్రవరి నెలలో నిర్మాణ పనులు ప్రారంభం కాగా.. మొత్తం ఏడు షెడ్లను నిర్మిస్తున్నారు.అయితే ఇప్పటికే 5 షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయగా.. మిగతా రెండు షెడ్ల నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోంది. రైతు పండుగగా భావించే సంక్రాంతి నాటికి కొత్త వ్యవసాయ మార్కెట్ ను పూర్తి స్థాయిలో రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ప్లాన్ చేసినా కొన్ని కారణాల వల్ల కుదరలేదు. ఈ మార్కెట్ పనులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈ నెలలో మార్కెట్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.మిర్చి మార్కెట్ అంటే తెలంగాణలో మొదట గుర్తుకు వచ్చేది ఖమ్మం జిల్లా. ఇక్కడ ధరలు తెలంగాణలో ఎక్కడా లేని విధంగా ఉంటాయి. అంతే కాదు.. మిర్చి పంటను అమ్ముకోవడానికి కూడా రైతులు భారీగా వస్తుంటారు. ఆ మార్కెట్‌కు ఘనమైన చరిత్ర ఉంది. 1937వ సంవత్సరంలో దీనిని ప్రారంభించగా.. ఆ సమయంలో అన్ని రకాల పంటల ఉత్పత్తుల కొనుగోళ్లు, అమ్మకాలు ఇక్కడ ఉండేవి. తర్వాత 1967లో ఈ స్థలంలోనే మిర్చి మార్కెట్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అయితే 2017 సంవత్సరంలో ఇక్కడకు సామర్థ్యానికి మించి మిర్చి బస్తాలు రావడంతో.. మార్కెట్లో కాస్త గందరగోళం ఏర్పడింది. పోటెత్తిన మిర్చి కొనుగోళ్లు సరిగ్గా జరగకపోవడంతో కొంత మంది రైతులు మార్కెట్‌ను ధ్వంసం చేశారు.ఈ ఘటనను దృష్టిలో ఉంచుకొని మంత్రి తుమ్మల మార్కెట్‌ను విస్తరించాలని నిర్ణయం తీసుకున్నారు. మార్కెట్‌కు తమ ఉత్పత్తులను అమ్మకానికి వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కారం చూపాలని మంత్రి భావించారు. దీనిలో భాగంగానే ఇంజనీరింగ్ నిపుణులతో చర్చించి.. మోడల్ మార్కెట్ ప్లాన్ చేశారు. ఒకప్పుడు 80 వేల బస్తాల వరకు సామర్థ్యం ఉండగా.. దానిని రెండు లక్షల బస్తాల వరకు విస్తరిస్తూ నూతన మార్కెట్ నిర్మాణం చేస్తున్నారు.

ఈ మార్కెట్లో రైతులు విశ్రాంతి తీసుకోవడానికి ఆధునిక గదులు, మూడు టాయిలెట్ బ్లాక్స్, నాలుగు ఆర్వో వాటర్ ప్లాంట్స్ నిర్మాణం చేస్తున్నారు. అంతే కాకుండా.. రైతులు టిఫిన్స్, భోజనం చేసేందుకు క్యాంటీన్ సౌకర్యం కూడా అందుబాటులో ఉండేలా నిర్మిస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ షెడ్ ఏరియా 1.20 లక్షల స్క్వేర్ ఫీట్లు ఉంటే.. దాన్ని 3.50 లక్షల స్క్వేర్ ఫీట్లకు పెంచనున్నారు.

మొత్తం ఏడు షెడ్లు నిర్మిస్తుండగా.. ఒక్కో షెడ్ 121 మీటర్ల పొడవు, 27 మీటర్ల వెడల్పు ఉంటుంది. ఈ స్థలంలోనే అవసరమైతే తమ ఉత్పత్తులను కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజీనామా

## మల్లు రవి, వంశీకృష్ణల పై ఆరోపణలు

హైదరాబాద్నాగర్కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణల కుల రాజకీయాల వల్ల పార్టీకి రాజీనామా చేస్తున్నానని కాంగ్రెస్ పార్టీకి రాజీనామా స్తున్నానని ఎస్సీ సెల్ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు అడ్వకేట్ మల్లెపల్లి జగన్ అన్నారు. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ మాల కుల రక్షకులుగా, మాదిగ కుల భక్షకులుగా మారారని, వీరి ప్రవర్తనతో విసుగు చెందానని అయన ఆరోపించారు. కల్వకుర్తిలోని ఒక వార్డులో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేని ఒక మాల కులస్థుడికి బీ ఫారం ఇచ్చి పార్టీ ఓటమికి కారణమవుతున్నారని ఆరోపించారు. రెండు దశాబ్దాలుగా పార్టీకి సేవలు చేశానని, మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ కారణంగా పార్టీకి రాజీనామా చేస్తున్నానని అన్నారు.

# ఒంటరితనమే విజయ రెడ్డి విషాదానికి కారణమా?

హైదరాబాద్, ఫిబ్రవరి 3, హైదరాబాద్ చర్లపల్లిలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్ విజయ రెడ్డి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న ఘటన సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసింది. అన్నీ ఉన్నా అనురాగం పంచే వారు దగ్గర లేరన్న ఆవేదన, ఒంటరితనం ఒక నిండు ప్రాణాన్ని, ఇద్దరు చిన్నారుల భవిష్యత్తును చిదిమేసింది.సాధారణంగా ఆత్మహత్యల వెనుక ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు లేదా తీవ్ర అనారోగ్యం వంటి కారణాలు కనిపిస్తాయి. కానీ, చర్లపల్లిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ విజయ రెడ్డి (40) తన ఇద్దరు పిల్లలతో కలిసి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన వీటన్నింటికీ భిన్నంగా కనిపిస్తోంది. విజయ రెడ్డి విద్యావంతురాలు, సమాజంలో మంచి గౌరవం ఉన్న వృత్తిలో ఉన్నారు. భర్త దుబాయ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడ్డారు. ఆర్థికంగా ఎటువంటి లోటు లేదు. కానీ, ఆమె తీసుకున్న ఈ కఠిన నిర్ణయం ఇప్పుడు అనేక సామాజిక, మానసిక ప్రశ్నలను లేవనెత్తుతోంది.ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, విజయ రెడ్డి ఆత్మహత్యకు ప్రధాన కారణం తీవ్రమైన ఒంటరితనం . భర్త విదేశాల్లో ఉండటం, పిల్లలు హాస్టల్‌లో ఉండి చదువుకోవడం వల్ల ఆమె ఇంట్లో ఒంటరిగా గడపాల్సి వచ్చేది. తల్లి ఉన్నా ఆవిడ వయసు మీద పడడంతో ఒంటరిననే భావన ఉండిపోయింది. గోడల మధ్య మౌనం, పలకరించే మనుషులు లేకపోవడం ఆమెను డిప్రెషన్‌లోకి నెట్టి ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. "అన్నీ ఉన్నా.. ఎవరూ లేరు" అనే భావన మనిషిని మానసికంగా కృంగదీస్తుంది. అది చివరకు ప్రాణాలు తీసుకునేంత తీవ్రమైన నిర్ణయానికి దారితీసింది.ఈ కేసులో అందరినీ కలిచివేస్తున్న అంశం.. ఇంటర్మీడియట్ చదువుతున్న ఇద్దరు పిల్లల మరణం. యుక్తవయసులో ఉన్న పిల్లలు తల్లి నిర్ణయాన్ని ఎందుకు అడ్డుకోలేకపోయారు? తల్లిపై ఉన్న అమితమైన ప్రేమా? లేక తల్లి మానసిక స్థితిని చూసి వారు కూడా భయపడ్డారా? హాస్టల్ నుండి వచ్చిన పిల్లలు తల్లి వేదనను గుర్తించలేకపోయారా? లేక తల్లి తన బాధను వారి ముందు కూడా దాచిపెట్టిందా?సాధారణంగా తల్లులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎన్ని కష్టాలనైనా ఓర్చుకుంటారు. కానీ, ఇక్కడ తల్లి తనతో పాటు పిల్లలను కూడా తీసుకెళ్లాలని నిర్ణయించుకోవడం వెనుక "నేను లేకపోతే నా పిల్లలు అనాథలవుతారు, వారిని ఎవరు చూసుకుంటారు?" అనే అభద్రతా భావం ఉండి ఉండవచ్చు.ఈ ఘటన నేటి హై-ప్రొఫైల్ ఉద్యోగస్తుల జీవితాల్లోని చీకటి కోణాన్ని ఆవిష్కరిస్తోంది. టెక్నాలజీ పెరిగినా మనుషుల మధ్య నేరుగా మాట్లాడే సమయం తగ్గిపోయింది. వీడియో కాల్స్, మెసేజ్‌లు గుండె లోతుల్లోని బాధను తుడిచివేయలేవు. ఉమ్మడి కుటుంబాలు లేకపోవడం వల్ల కష్టసుఖాలను పంచుకునే పెద్దలు ఇంట్లో ఉండటం లేదు. కెరీర్ రేసులో పడి మానసిక ఆరోగ్యాన్ని విస్మరించడం ప్రాణాంతకంగా మారుతోంది.దర్యాప్తు పూర్తి అయితే తప్ప ఈ మరణం వెనుక ఉన్న అసలైన చిక్కుముడులు విడిపోవు. అయితే, విజయ రెడ్డి మరణం సమాజానికి ఒక పెద్ద పాఠం. పక్క ఇంట్లో ఏం జరుగుతుందో తెలియని నగర జీవనంలో, మనుషుల మధ్య ఆత్మీయతలు పలచబడుతున్నాయి. ఒక వ్యక్తికి ఆర్థిక స్థిరత్వం కంటే కూడా 'ఎవరైనా నాకు తోడున్నారు' అనే భరోసా ముఖ్యం. "ఆత్మహత్య అనేది సమస్యకు పరిష్కారం కాదు, అది మరో వంద సమస్యలకు ఆరంభం."విజయ రెడ్డి తీసుకున్న నిర్ణయం ఆమె కుటుంబంలో తీరని శోకాన్ని మిగిల్చింది. తోటి మనుషుల బాధను గుర్తించడం, ఒంటరిగా ఉన్న వారికి అండగా నిలబడటం మనందరి బాధ్యత.

# ఫోన్ ట్యాపింగ్ తేలుతుందా...ముంచుతుందా

హైదరాబాద్, ఫిబ్రవరి 3,తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతున్న కీలకమైన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కీలక దశకు చేరుకుంది. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ను ప్రత్యేక దర్యాప్తు బృందం నాలుగున్నర గంటలకు పైగా సుదీర్ఘంగా విచారించింది. హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమైన ఈ విచారణలో కేసీఆర్‌కు సిట్ అధికారులు పలు ప్రశ్నలు సంధించినట్లు సమాచారం.గతంలో సాక్షులిచ్చిన ఆధారాలు ముందు పెట్టి మాజీ సీఎం కేసీఆర్ ను సిట్ బృందం ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు దగ్గర నుంచి ఫోన్ ట్యాపింగ్ వరకూ అన్ని అంశాలపైనా ప్రశ్నలు వేసినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ ఆదేశాలు ఎవరి సూచనలతో జారీ అయ్యాయనే విషయంపై, నిర్ణయ ప్రక్రియలో కేసీఆర్ పాత్రపై సిట్ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.ఫోన్ ట్యాపింగ్ చేయమని ఆదేశాలు జారీ చేశారా..? అని కేసీఆర్‌ని సిట్ బృందం ప్రశ్నించినట్లు తెలుస్తోంది.'ఫోన్ ట్యాపింగ్ చేయమని ఇంటెలిజెన్స్ అధికారులకు మీరు స్వయంగా ఆదేశాలు జారీ చేశారా?' అనే ప్రశ్నను స్పష్టంగా అడిగినట్లు సమాచారం. ఈ అంశంపై కేసీఆర్ నుంచి క్లారిటీ తీసుకునేందుకు సిట్ అధికారులు తీవ్రంగా ప్రయత్నించినట్లు తెలిసింది. ఏ సంవత్సరం నుంచి ఫోన్ ట్యాపింగ్ మొదలైంది..? అనే విషయాలపై సిట్ అధికారులు ప్రత్యేకంగా ఆరా తీశారు.'ఏ సంవత్సరం నుంచి ఫోన్ ట్యాపింగ్ చేయమని చెప్పారు?, అది సాధారణ భద్రత కోసమా..? లేక రాజకీయ అవసరాల కోసమా..?' అంటూ పలు ప్రశ్నలు వేసినట్లు సమాచారం. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేశారా..?.. వారి ఫోన్లు ట్యాప్ చేయమని ఆదేశాలు ఇచ్చారా..? అంటూ సిట్ అధికారులు నేరుగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ ప్రశ్నలపై కేసీఆర్ ఇచ్చిన సమాధానాలు ఈ కేసులో తమ దర్యాప్తునకు కీలకంగా మారనున్నాయని సిట్ అధికారులు భావిస్తున్నారు.ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు వ్యవహారం కూడా సిట్ అధికారుల విచారణలో ప్రధాన అంశంగా మారింది. పదవీకాలం ముగిసిన ప్రభాకర్‌రావుకు మళ్లీ పదవిని ఎందుకు పొడిగించారు..? ఆ నిర్ణయం వెనుక కారణాలు ఏంటి..? అంటూ కేసీఆర్‌ను సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఒకే వ్యక్తికి రెండు కీలక పోస్టులు ఎందుకు..?, పరిపాలనా నియమావళికి విరుద్ధంగా ఒకే వ్యక్తికి రెండు కీలక బాధ్యతలు అప్పగించడంపై కూడా సిట్ అధికారులు ప్రశ్నలు సంధించారు. ఒకే వ్యక్తికి రెండు కీలక పోస్టులు ఎందుకు అప్పగించారు..?, అది ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో సంబంధం ఉందా..? అనే కోణంలో సిట్ విచారణ కొనసాగినట్లు సమాచారం.ఎమ్మెల్యేల కొనుగోలు కేసు సమయంలో తీసుకున్న చర్యలపై కూడా సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. 'మీ పార్టీ ఎమ్మెల్యేలు ఇతర పార్టీలకు వెళ్తున్నారని మీకు ఎలా తెలిసింది?, ఆ సమాచారం ఫోన్ ట్యాపింగ్ ద్వారానే వచ్చిందా..? అనే అనుమానాలతో అధికారులు ఆరా తీసినట్లు తెలుస్తోంది. పార్టీ ఫండ్‌తో ఫోన్ ట్యాపింగ్ పరికరాల కొనుగోలు..? చేశారా అని సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఈ విచారణలో మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. ఫోన్ ట్యాపింగ్ పరికరాల కొనుగోలుకు పార్టీ ఫండ్‌ను కేటాయించారా..? ప్రభుత్వ నిధులు కాకుండా పార్టీ డబ్బులు ఎందుకు ఉపయోగించారు..? అంటూ సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం.

ఇంకెన్నాళ్లు...

ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును టీవీ సీరియల్ లాగా సాగదీస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. ఢిల్లీలోని తన నివాసంలో మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. దర్యాప్తు మొదలై ఇప్పటికే రెండేళ్లకు పైగా అవుతోందన్నారు. కేసీఆర్ కుమార్తె కవితనే తన భర్త ఫోన్ ట్యాప్ అయిందని ఆరోపించారని గుర్తుచేశారు. హైకోర్టు జడ్జిల ఫోన్లు ట్యాప్ అయ్యాయంటూ రాష్ట్ర పోలీసులు హైకోర్టులో అఫిడవిట్ వేశారని, ఇంకెన్నేళ్లు దర్యాప్తు చేస్తారని ప్రశ్నించారు. ట్యాపింగ్ ఎవరు చేసినప్పటికీ ప్రభుత్వం ద్వారా జరిగిందనేది వాస్తవమని, అందరి ఫోన్లూ ట్యాప్ అయ్యాయని చెప్పారు. ట్యాపింగ్ తీవ్రమైన నేరారోపణ ఉన్న కేసు అని, ఈ ఘటనలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు.కాంగ్రెస్ బీఆర్ఎ?సలు అవినీతికి కొమ్ముకాస్తున్నాయని, ఆ పార్టీలపై ప్రజలకు విశ్వాసం లేదన్నారు.

తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీలకు బుద్ధి చెబుతార పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబం ఆస్తుల వాటాల కోసం కొట్టుకుంటుంటే రేవంత్ సర్కారులో మంత్రులు కూడా రోడ్డున పడి డబ్బుల వాటాల కోసం కొట్లాడుకుంటున్నారని ఆరోపించారు.

ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో తెలంగాణ సర్కారు ఉందని ఆయన అన్నారు.

# మేయర్ పదవి కోసం రూ. 8 కోట్ల చెల్లింపులు

నిజామాబాద్, ఫిబ్రవరి 3, (న్యూస్ పల్స్) తెలంగాణ రాష్ట్రంలో మున్సిపాలిటీలకు, నగర పాలకాలకు ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించబోతోంది. ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ మొదలైంది. ఆశావాహులు పోటీపడి నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి.. ఆ పార్టీ నుంచి పోటీ చేయడానికి చాలామంది ముందుకు వస్తున్నారు. ఒక్కో కౌన్సిలర్ స్థానానికి ఇద్దరు లేదా ముగ్గురు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీలో ఉన్నారు.అభ్యర్థుల నుంచి విపరీతమైన పోటీ ఉండడంతో కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఎవరికి టికెట్లు కేటాయించాలో తెలియక సతమతమవుతున్నారు. చైర్మన్లను ఇప్పటికే ప్రకటించకూడదని.. అన్ని స్థానాలలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలవాలని.. ఆ తర్వాతే సమీకరణాల ఆధారంగా చైర్మన్ పదవులు కేటాయించాలని రేవంత్ రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు. పలు ప్రాంతాలకు ఎన్నికల పర్యవేక్షకులుగా మంత్రులను ముఖ్యమంత్రిని నియమించారు. వారంతా కూడా ఆయా ప్రాంతాలలో సమాలోచనలు.. సమావేశాలు నిర్వహిస్తున్నారు.ఒకవైపు ఎన్నికల ప్రక్రియ జరుగుతుండగానే.. మరోవైపు మున్సిపాలిటీలకు.. కార్పొరేషన్లకు భారీగా ఆదాయం వస్తోంది. ఎన్నికల్లో పోటీ చేసేవారు కచ్చితంగా ఆయా మున్సిపాలిటీలకు.. కార్పొరేషన్లకు ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా అభ్యర్థులు పన్నులు చెల్లిస్తున్న నేపథ్యంలో మునిసిపాలిటీలకు.. కార్పొరేషన్లకు దండిగా ఆదాయం వస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో నిజామాబాద్ కార్పొరేషన్ కు ఏకంగా ఒక అభ్యర్థి 8 కోట్ల 16 లక్షలను చెల్లించింది. ఆమె ఇలా చెల్లించడం ఒకరకంగా సంచలనం కలిగించింది. నిజామాబాద్ నగర కార్పొరేషన్ పోటీలో ఉన్న శమంత నరేందర్ రెడ్డి ఏకంగా 8,16,65,000 కోట్ల ఆస్తి పన్ను బకాయి చెల్లించింది. శమంత కుటుంబానికి ఓ హోటల్ ఉంది. 2009 నుంచి ఈ హోటల్ ఆస్తిపన్ను చెల్లించలేదు. దీనిపై నిజామాబాద్ నగర్ కార్పొరేషన్ అధికారులు హైకోర్టు దాకా వెళ్లారు. శమంత కుటుంబ సభ్యులు కూడా హైకోర్టుకు వెళ్లారు. ఇరుపక్షాల మధ్య దాదాపు 17 సంవత్సరాల పాటు కోర్టులో వాదనలు జరిగాయి. చివరికి హైకోర్టు ఆస్తి పన్ను చెల్లించాలని తీర్పు ఇవ్వడంతో.. శమంత అన్ని కోట్లు కట్టేసింది. ఈమె అధికార కాంగ్రెస్ పార్టీ తరపున పోటీలో ఉంది. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తే మేయర్ అవ్వాలని ఈమె భావిస్తున్నారు. దానికంటే ముందుగానే 8 కోట్లకు మించిన ఆస్తి పన్ను నిజామాబాద్ కార్పొరేషన్ కు చెల్లించారు.

# రెబల్స్...బుజ్జగింపులు...

అదిలాబాద్, ఫిబ్రవరి 3, ఆయా పార్టీల నుంచి బరిలో నిలిచేందుకు బీ ఫారంలు అందజేసేందుకు ఈ నెల మూడవ తేదీ ఆఖరు కాగా, అభ్యర్థి నామినేషన్ విత్ డ్రా చేసుకునేందుకు మధ్యాహ్నం మూడు గంటల వరకే సమయం ఉండటంతో రెబల్స్ తో ఇబ్బందులు పడుతున్నవారంతా ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మంచిర్యాల కార్పొరేషన్ తో పాటు లక్షెట్టిపేట మున్సిపాలిటీల కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లను వెల్లడించగా, బెల్లంపల్లి మున్సిపాలిటీతో పాటు చెన్నూర్, క్యాతనపల్లి మున్సిపాలిటీల అభ్యర్థులను ఆయా నియోజక వర్గ ఎంఎల్ఏలు ఇంత వరకు ప్రకటించలేదు. అలాగే బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు సైతం అభ్యర్థుల పేర్లు అన్నింటిలో పూర్తి స్థాయిలో ప్రకటించాల్సి ఉంది.అయితే పార్టీ బీ ఫారంలు సమర్పించిన అనంతరం ఎంత మంది పార్టీ నుంచి బరిలో ఉంటారు, ఎంత మంది విత్ డ్రా చేసుకుంటారో, ఇండిపెండెంట్లుగా బరిలో ఎందరు నిలుస్తారో తేలనుంది. అయితే అభ్యర్థులను విత్ డ్రా చేయించి తమకు మద్ధతు తెలుపాలని, ఇందు కోసం లక్షల్లో మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది. అయితే ఈ సారి బరిలో లేకుంటే తర్వాత తమకు అవకాశం రావడం కలేనని, ఏదీ ఏమైనా బరిలో నిలుచునుడే.., సామర్థ్యం పరీక్షించుకునేదే అనే ధోరణితో రెబల్స్ ఉన్నట్లు సమాచారం. ఏది ఏమైనా మధ్యవర్తిత్వం ఫలిస్తుందా..! విఫలమవుతుందా..! అనేది వేచి చూడాల్సిందే...జిల్లాలో 149 డివిజన్, వార్డులకు 1061 మంది అభ్యర్థులకు చెందిన 1177 నామినేషన్లు ఆమోదం పొందగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల నుంచి అధిక సంఖ్యలో ఆశాపడుతున్నట్లుంది. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లకు కాంగ్రెస్ నుంచి 77 నామినేషన్ లు, బీఆర్ఎస్ నుంచి 98, బీజేపీ నుంచి 108, బెల్లంపల్లి మున్సిపాలిటీ లోని 34 వార్డులకు కాంగ్రెస్ నుంచి 123, బీఆర్ఎస్ నుంచి 81, బీజేపీ నుంచి 27, చెన్నూర్ మున్సిపాలిటీ లోని 18 వార్డులకు కాంగ్రెస్ నుంచి 56, బీఆర్ఎస్ నుంచి 36, బీజేపీ నుంచి 24, క్యాతనపల్లి మున్సిపాలిటీ లోని 22 వార్డులకు కాంగ్రెస్ నుంచి 88, బీఆర్ఎస్ నుంచి 53, బీజేపీ నుంచి 33, లక్షెట్టిపేట మున్సిపాలిటీ లోని 15 వార్డులకు కాంగ్రెస్ నుంచి 25, బీఆర్ఎస్ నుంచి 32, బీజేపీ నుంచి 25 నామినేషన్లు వచ్చాయి. ప్రతీ పార్టీ నుంచి డివిజన్ లు, వార్డులకంటే నామినేషన్లు అధికంగా ఉండటంతో ఎవరికి బీ ఫాం వస్తుంది, ఎంత మంది విత్ డ్రా అవుతారు, ఇండిపెండెంట్లుగా ఎంత మంది బరిలో నిలుస్తారోననే ఉత్కంఠ నెలకొంది.

**డబ్బులే సర్వే**


ప్రజాదరణ ఉన్న... గెలిసే సత్తా చూపిన... సరిపడ సొమ్ము ఉంటేనే బి ఫారం అనే ప్రచారం జిల్లాలో జోరుగా సాగుతోంది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు, ఇల్లందు, అశ్వరావుపేట మున్సిపాలిటీలలో ఎన్నికలవేళ రాజకీయ వాతావరణం హీటెక్కుతోంది. ప్రధాన రాజకీయ పార్టీల నుంచి పోటీ చేయాలనుకున్న ఆశావాహులకు సర్వేభయం పట్టుకుంది.క్షేత్రస్థాయిలో ప్రజల మన్ననలు ఉన్నప్పటికీ సరిపడ నిధులు సమకూర్చ గల వారికే బి ఫారాలు దక్కుతాయని ప్రచారంతో ఆశావాహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పార్టీని అంటిపెట్టుకొని ప్రజా సమస్యలతో నిత్యం ప్రజల మధ్య ఉన్నప్పటికీ డబ్బులు లేకపోవడంతో అభ్యర్థులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలకు జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో మేయర్, చైర్మన్ పదవులకు డిమాండ్ పెరిగింది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి దక్కించుకోవాలంటే రూ 10 నుంచి 15 కోట్లు, ఇల్లందు, అశ్వరావుపేట మున్సిపల్ చైర్మన్ పదవులకు రూ.2 నుంచి 3 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉండాలంటూ ప్రధాన ప్రార్టీలు చెబుతున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది.ఉన్నత పదవులే కాకుండా కార్పొరేటర్, కౌన్సిలర్ టిక్కెట్ల కోసం అభ్యర్థులు పెద్ద మొత్తంలో డిపాజిట్లను చూపాల్సి వస్తోంది. ఒక్కొక్క డివిజన్ నుంచి పోటీ చేయాలంటే రూ 25 నుంచి 35 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని నేతలు స్పష్టం చేస్తున్నారు.

డబ్బులు లేని కార్యకర్తలకు టిక్కెట్లు దక్కే అవకాశం లేదంటున్నారు. రాజకీయ సిద్ధాంతాలతో సంబంధం లేకున్నా ఆర్థిక స్తోమత చాలినంత ఉంటే వారికే పార్టీలు పెద్దపీట వేయటం మాజీ ప్రజాప్రతినిధులకు మింగుడు పడటం లేదు.ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతి వార్డు, డివిజన్లో సర్వేలు నిర్వహించి గెలిచే అవకాశం ఉన్న అభ్యర్థుల్లో ఎవరికి ఎక్కువ ఆర్థిక బలం ఉంటుందో వారికే టిక్కెట్లు కేటాయించే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రస్తుత మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికలు బహు ఖరీదుగా మారాయి. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 60 డివిజన్లలో 592 మంది అభ్యర్థులు 807 నామినేషన్లు సమర్పించారు.నామినేషన్ల పరిశీలనలో 215 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయి. 592 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

# మెదక్ లో గులాబీ ఆపరేషన్ ఆకర్ష్..

మెదక్, ఫిబ్రవరి 3 మున్సిపల్ ఎన్నికల వేళ బీఆర్ఎస్లో చేరికల జోష్ కనిపిస్తున్నది. హస్తం పార్టీ నాయకులు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు. మళ్లీ అభివృద్ధి జరగాలన్నా.. సంక్షేమ పథకాలు అమ లు కావాలన్నా కేసీఆర్ రావాలన్న అభిప్రా యం వ్యక్తం చేస్తున్నారు. అందుకు తమ మద్దతు అవసరమని భావిస్తూ.. గులాబీ పార్టీలోకి వస్తున్నారు. మెదక్ జిల్లాలోని మె దక్, నర్సాపూర్, రామాయంపెట్, తూప్రాన్ మున్సిపాలిటీ ల నుంచి కాంగ్రెస్ పార్టీ నేత లు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో చేరుతున్నారుమున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా బీఆర్ఎస్ ఎన్నికలపై సీరియస్గా దృష్టి సా రించింది. ఇప్పటికే మెదక్ జిల్లా వ్యాప్తంగా వ్యూహాత్మకంగా ప్రణాళికలు రచిస్తోంది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు నేతృత్వంలో వరుసగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మ కంగా తీసుకుంది. గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే ప ద్మా దేవేందర్ రెడ్డి, మున్సిపల్ ఎన్నికల ఇం చార్జి, మాజీ ఎశ్రీఇఃఫారూక్ హుస్సేన్ వరుస సమీక్షలతో కేడర్లో జోష్ నింపుతున్నారు. ఈ క్రమంలోనే పట్టణ ప్రాంతాల్లో తన పట్టును నిరూపించుకోవడానికి బీఆర్ఎస్ శతవిధాలా ప్రయత్నిస్తోంది. మున్సిపల్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ దూ కుడు ప్రదర్శిస్తోంది. మెదక్ జిల్లాలో నాలు గు మున్సిపాలిటీల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నిక ల్లో తమ మద్దతుదారులు మంచి ఫలితాలు సాధించారని, అదే ఊపును మున్సిపల్ ఎన్నికల్లోనూ కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేశారు. పట్టణ ఓటర్లు ఎప్పుడూ అభివృద్ధిని కోరుకుంటారని తమవైపే ఉంటారని బీఆర్ఎస్ నేతలు చెబుతు న్నారు. కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి జరిగిందనే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని భావిస్తున్నారు.మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫ ల్యాలను ఎండగట్టాలని నిర్ణయించుకుంది. గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో పట్టణాల్లో ఒక్క రూపాయి కూడా అభివృద్ధి పనులకు ఖర్చు చేయలేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. రేవంత్రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని భావిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన మిషన్ భగీరథ, పలు పథకాల నిర్వహణను కాంగ్రెస్ గాలికొదిలేసిందని విమర్శిస్తున్నారు.

# దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్ పై ప్రమాదం బైకు దగ్ధం



హైదరాబాద్ మాదాపూర్ దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై ప్రమాదవశాత్తు బైకులో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన వాహనదారుడు బైకును పక్కనే పార్కింగ్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. బైకు మంటల్లో పుర్తిగా కాలిపోయింది.ఈ ప్రమాదంలో ఎవరికి ఏమి కావడంతో అధికారులు ఊపిరి పిల్చుకున్నారు.

## గోన సంచిలో మృతదేహం

కామారెడ్డిలో గోన సంచిలో సగం మృతదేహం కలకలం రేపింది. గుర్తు తెలియని దుండగులు ఒక వ్యక్తిని హత్య చేసి ముక్కలుగా చేసి పడేసారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చి సమీపంలో గోన సంచిలో మనిషి కాళ్లు చూసి చెత్త ఏరుకునే వారు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకుని చూడగా, గోన సంచిలో నడుము నుండి కాళ్ల వరకు మాత్రమే ఉన్న మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.
మిగతా మృతదేహం గురించి వెతికినా దొరకకపోవడంతో, కేసు నమోదు చేసి, మృతుడి వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నారు.

## బురద నీళ్లు వస్తున్నాయి.. కాంగ్రెస్ కే ఓటేయ్యండి

ఖమ్మం జిల్లా ఎదులాపురం మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేసారు. అవును!! తాగునీటికి బదులుగా బురద నీళ్లు వస్తున్నాయి. మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి.. అప్పుడు స్వచ్ఛమైన మంచి నీళ్ళు వచ్చేలా చేస్తానని మంత్రి అన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్పాట్ డెడ్



సంగారెడ్డి జహీరాబాద్-బీదర్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం ప్రమాదం చోటుచేసుకుంది. న్యాల్కల్ మండల పరిధిలోని గణేష్ పూర్ వద్ద మినీ ట్రక్కు ఆటోను బలంగా ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.
గంగ్వార్ నుంచి బీదర్ వైపు వెళ్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వడ్డీ గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ కమల(40)తో పాటు ఝరాసంగం మండలం భోజ్యానాయక్ తండకు చెందిన అంబ్యానాయక్ (55) అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోలో ఉన్న మరో ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బీదర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదంతో జహీరాబాద్ బీదర్ రోడ్డుపై వాహన రాకపోకలు స్తంభించాయి. పోలీసులు చేరుకుని ఢీకొట్టిన వాహనాలను పక్కకు తప్పించి రాకపోకలు పునర్ధరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

# వర్ధన్నపేట అభివృద్ధి ఘటన కేసీఆర్ దే

వర్ధన్నపేట గ్రామపంచాయతీగా ఉన్న వర్ధన్నపేట ను మున్సిపాలిటీగా మార్చి.. 200 కోట్లతో అభివృద్ధి చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దేనని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ కొనియాడారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహ సమావేశంలో పాల్గొన్న ఆయన తరువాత మీడియాతో మాట్లాడారు. గత రెండేళ్లుగా వర్ధన్నపేట మున్సిపాలిటీలో తట్టెడు మట్టిని కూడా ఎత్తని కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల్లో ఓటు అడిగే హక్కే లేదని ఆరురి రమేష్ ఎద్దేవా చేశారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడం..వంద పడకల ఆసుపత్రిని వర్ధన్నపేటలోనే నిర్మిస్తామని దొంగ హామీలు ఇస్తూ మరో మారు అధికారాన్ని చేజిక్కించుకోవాలని ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు చూస్తున్నాడని విమర్శించారు. వర్ధన్నపేట ప్రజలు చైతన్యవంతులని.. కాంగ్రెస్ నాయకుల కాకమ్మ కబుర్లకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తారని ధీమా వ్యక్తం చేశారు.

## జువారి సిమెంట్ కర్మాగారం ఎదుట వలస పల్లె గ్రామ ప్రజల ఆందోళన

కడప వలసపల్లె గ్రామ ప్రజలు టువారి సిమెంట్ కర్మాగారం ముందు అందోళనకు దిగారు. గ్రామంలోని సమాధులను పరిశ్రమ యాజమాన్యం తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమకు సంబంధించిన సున్నపురాయి గని నుంచి వెలువడే భారీ పేలుడుకు నివాస గృహాలు దెబ్బ తింటున్నాయాంటున్నారు. కర్మాగారం నుంచి వెలువడే కాలుష్యం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని పరిశ్రమ యాజమాన్యం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వలస పల్లె గ్రామ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన బాట పడతామని హెచ్చరించారు.

## వర్ధన్నపేటలో వాడివేడిగా ఎన్నికల ప్రచారం

వరంగల్ జిల్లా వర్ధన్నపేట లో మున్సిపల్ ఎన్నికల ప్రచారం వాడి వేడిగా కొనసాగుతోంది. అధికార పార్టీ ఎమ్మెల్యే నాగరాజు ను ప్రశ్నిస్తూ బిజెపి నేతలు 15 అంశాలతో కూడిన ఛార్జ్ షీట్ ను విడుదల చేశారు. వర్ధన్నపేటలో నెలకొన్న సమస్యలను చార్జి సీట్లో ప్రస్తావిస్తూ గడిచిన రెండేళ్లుగా ఎమ్మెల్యే నాగరాజు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతికత కోల్పోయిందన్న నేతలు బిజెపి బలపరిచిన అభ్యర్థులు 12 డివిజన్లలో విజయకేతనం ఎగరవేయనున్నట్లు ధీమా వ్యక్తం చేశారు.

## సిద్దిపేటలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం

సిద్దిపేటలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. సిద్దిపేట మున్సిపాలిటీలోని 14 వార్డులో కాంగ్రెస్ హామీలపై బాకీ కార్డులను బీఆర్ఎస్ ఓటర్లకు పంచుతున్నారు. ప్రతిగా బీఆర్ఎస్ దోకా కార్డు అంటూ ఓటర్లకు పంచేందుకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధమైయారు. వార్డులో ఒకే చోట రెండు పార్టీల నాయకులు ఎదురుపడటంతో పోటా పోటీగా నినాదాలు చేసుకున్నారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరు వర్గాలను చెదరగొట్టారు. వార్డులో పోలీసులు భారీగా మోహరించారు.

## తెల్లని దుప్పటిలా సిద్దిపేట

సిద్దిపేట పట్టణం మొత్తం పొగమంచిఉ దట్టంగా అలుముకుంది. మంగళవారం ఉదయం 9 గంటలైనా మంచు వీడకపోవడంతో కాశ్మీర్ను తలపించింది. రాజీవ్ రహదారితో పాటు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ముందు ఏమీ కనిపించకపోవడంతో లైట్లు వేసుకుని వాహనదారులు ప్రయాణిస్తున్నారు. కోమటి చెరువు వద్ద ఆహ్లాదకరమైన వాతావరణాన్ని వాకర్స్ ఆస్వాదించారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, వేగం తగ్గించి డ్రైవ్ చేయాలని అధికారుల సూచన

## మోకాళ్లపై నడుస్తూ.. భాజపా కౌన్సిలర్ అభ్యర్థి వినూత్న ప్రచారం..

హైదరాబాద్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణం ఒకటవ వార్డులో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి చేని శివశంకర్ మోకాళ్లపై నడుస్తూ ఓటర్లను ఓటు అభ్యర్థిస్తూ వినూత్నంగా ప్రచారం ప్రారంభించారు. గత పాలకులు మోకాళ్లు అరిగే వరకు సమస్యలపై స్థానికులు తి రిగిన పట్టించుకోలేదని అందుకే తాను మోకాళ్లపై నడుస్తూ వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇస్తున్నాడు. గ్రామీణ నేపథ్యం ఉన్న ఒకటవ వార్డులో పోడు భూముల సమస్య కూడా ఉందని పారిశుద్ధ్యం అభివృద్ధి విషయంలో స్పష్టమైన అవగాహన ఉన్న తనకు అవకాశం కల్పించాలని భూముల సమస్య బిజెపి అగ్ర నాయకుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇస్తున్నాడు. స్థానిక రామాలయం నుంచి పూజలు నిర్వహించే ప్రచారం ప్రారంభించగా భారతీయ జనతా పార్టీ నాయకులు పాల్గొన్నారు

## బంజారా హిల్స్‌లోని ఓ హోటల్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం


బంజారా హిల్స్,రోడ్ నెంబర్-3 లోని సౌతాన్ మిర్చి హోటల్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వంట చేస్తుండగా కిచెన్‌లో ఉన్న ఎగ్జాస్ట్ ఫ్యాన్‌కు మంటలు అంటుకోవడంతో అగ్ని ప్రమాదం ఏర్పడినట్లు సమాచారం. ఆ మంటలు క్రమంగా కిచెన్ అంతటా వ్యాపించాయి.సమయస్ఫూర్తిగా స్పందించిన హోటల్ నిర్వాహకులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.అయితే హోటల్‌లో తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఈ ప్రమాదం చోటు చేసుకున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనతో పరిసర ప్రాంతాల్లో కొంతసేపు ఆందోళన నెలకొంది.

## కప్పేసిన పొగ మంచు

నందిగామ, కంచికచర్ల పరిసర ప్రాంతాలను దట్టమైన పొగ మంచు కప్పేసింది. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం తెల్లవారుజామున నుండి పొగమంచు భారీ స్థాయిలో పడింది. పొగ మంచు కారణంగా వాహనాలు నిదానంగా నడిచాయి.

# తెలంగాణ సాయుధ పోరాట వీరుడు, కార్మిక నాయకుడు, ఉర్దూ కవి ముఖ్దుం మొహియుద్దీన్

## –నేడు అయన జయంతి



తెలంగాణ సాయుధ పోరాట వీరుడు, కార్మిక నాయకుడు, ఉర్దూ కవి ముఖ్దుం మొహియుద్దీన్.. ఆయన 1908 ఫిబ్రవరి 4న మెదక్, హైదరాబాద్ స్టేట్ లో ఆయన జన్మించారు. బతకడానికి పెయింటింగ్స్, సినిమా తారల ఫొటోలు అమ్మాడు. ట్యూషన్లు చెప్పాడు, పత్రికల్లో పనిచేశాడు. ఆయన రాసిన 'గోథే ప్రేమ లేఖలు' 'మక్తబా' అనే స్థానిక ఉర్దూ పత్రిక అచ్చేసింది. ఉస్మానియా యూనివర్సిటీలో మఖ్దూమ్ (1934–37) హాస్టల్‌లో ఉండేవాడు. అక్కడ తన తొలి కవిత 'టూర్' 1934లో రచించాడు. మఖ్దూమ్, కవి గా, నాటక రచయితగా, నటుడిగా ప్రసిద్ధుడయ్యాడు. 1934లో బెర్నార్డ్ షా నాటకానికి 'హోష్ కె నా ఖూన్' అనే ఉర్దూ అనుసరణ రాసి హైద్రాబాద్‌లో రవీంద్రనాథ్ ఠాగూర్ సమక్షంలో ప్రదర్శించాడు. గురుదేవులు ఆ నాటకం చూసి ఆనందం పట్టలేక, నాటక ప్రదర్శన అయిపోగానే స్టేజిపైకి వెళ్ళి మఖ్దూమ్‌ని అభినందించి, తన శాంతినికేతన్‌కు వచ్చి చదువుకోవాల్సిందిగా ఆహ్వానించాడు. మఖ్దూమ్ 'మర్షదే కామిల్' అనే మరో నాటకం రాశాడు. 1937లో మఖ్దూమ్ తన 29వ యేట ఎం.ఎ. డిగ్రీ తీసుకున్నాడు. 'ఉర్దూ నాటకం'పై ఒక పరిశోధన పత్రం కూడా రాశాడు. హైకోర్టు పక్కన గల సిటీ కాలేజీలో అధ్యాపకుడిగా ఉద్యోగం దొరికింది. కమ్యూనిస్టు రహస్య పత్రిక 'నేషనల్ ఫ్రంట్' సంపాదించి చదివేవాడు. 1930–40లలో హైద్రాబాద్‌లో 'స్టూడెంట్స్ యూనియన్' ప్రారంభించాడు. 1940లో తన సహచరులతో కలిసి కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. చంద్ర రాజేశ్వరరావు, గులాం హైదర్, రాజ బహుదూర్ గౌర్, హమిదలీ ఖాద్రీ లాంటి నాయకులతో కలిసి పనిచేస్తుండేవాడు. "రైతుకు రొట్టె నివ్వని పొలమెందుకు, కాల్చేయండి ప్రతి గోధుమ కంకిని!" అనే ఇక్బాల్ కవితను నినదించేవాడు. అక్తర్ హుస్సేన్ రాయ్‌పురి, సిబ్తె హసన్‌లతో కలిసి హైద్రాబాద్‌లో 'అభ్యుదయ రచయితల సంఘం' స్థాపించాడు. సరోజినీ నాయుడు నివాసమైన గోల్డెన్ త్రెషోల్డ్‌లో డాక్టర్ జయసూర్య, జె.వి.నరసింగరావులతో కలిసి సాహిత్య, సామాజిక, రాజకీయ అంశాలపై చర్చలు జరుపుతుండేవాడు. చార్మినార్ సిగట్ ఫ్యాక్టరీ, బట్టల గిర్నీ, అల్విన్, షాబాద్ సిమెంట్, ఎన్ ఎస్సార్ రైల్వే ఎంప్లాయిస్, ఎలక్ట్రిసిటీ, సి.డబ్ల్యు.డి. మున్సిపాలిటీ, బటన్ ఫ్యాక్టరీ వంటి వందల కంపెనీల్లోని కార్మిక సంఘాలకు మఖ్దూమ్ అధ్యక్షుడయ్యాడు. అహో రాత్రులు వారి సంక్షేమం కోసం కృషి చేశాడు. స్టేట్ అసెంబ్లీలో మాట్లాడినా, బయట కార్మిక సంఘాలలో మాట్లాడినా ఆయన వాగ్ధాటికి ఎదురుండేది కాదు. విషయం సూటిగా, స్పష్టంగా, దృఢంగా, బలంగా చెప్పేవాడు. నల్లగొండ జిల్లా హుజూర్ నగర్ నుండి శాసనసభకు ఎన్నికయ్యాడు. 1957లో మెదక్ నుండి పార్లమెంట్‌కు పోటీ చేసి ఓడిపోయాడు. శాసనమండలికి ఎన్నికై 1969లో కన్నుమూసే దాకా కమ్యూనిస్టు నేతగా ఆ పదవిలో కొనసాగాడు. మఖ్దూం కార్మిక నాయకుడు, శాసన మండలి సభ్యుడు. ఫాసిజానికి వ్యతిరేకంగా సమసమాజ స్థాపనకోసం క్రియాశీలంగా రాజకీయాల్లో పాల్గొన్నాడు. అందరూ కలిసి భోజనం చేసే దస్తర్‌ఖాన్ల గురించి కల గన్నాడు. ప్రగతిశీల భావాలతో పీడితుల పక్షాన కలమెత్తి నమ్మిన సిద్ధాంతానికి జీవితాన్నంకితం చేసి అమరుడైనాడు. కమ్యూనిస్టు అయిన మఖ్దూం. మతాన్ని దూషించలేదు అనుసరించలేదు. హైద్రాబాద్ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ శాఖకు తొలి కార్యదర్శి. నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన ప్రపంచ ప్రసిద్ధ తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్య పాత్రధారి. సాయుధ పోరాటానికి ముందు కారాగార శిక్షలు, పోరాటం తర్వాత అజ్ఞాత వాసం. హైద్రాబాద్ రాష్ట్ర శాసనసభ్యుడు (1952) శాసనమండలి సభ్యుడు, ప్రతిపక్ష నేత (1956–1969), భారత కార్మిక వర్గ విప్లవ చరిపూతలో ముఖ్య పాత్రధారి. ఎఐటియుసికి జాయింట్ సెక్రటరీ. నిజాముకు వ్యతిరేకంగా తెలంగాణా సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించాడు. ఢిల్లీలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ సమాఖ్య (ఎ.ఐ.టి.యు.సి.) జాయింట్ సెక్రటరీగా కొంత కాలం ఢిల్లీలో ఉన్నాడు. 1952–55 మధ్య చైనా, సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాలు, ఆఫ్రికన్ దేశాలు తిరిగి వచ్చాడు. ప్రపంచ ట్రేడ్ యూనియన్ సమాఖ్య ప్రధాన కార్యాలయం వియాన్నాలో (1953–54) పనిచేశాడు. 1969, ఆగష్టు 25 తేదీన గుండెపోటుతో ఢిల్లీలో చనిపోయాడు. ఆయన పేరిట హైద్రాబాద్, హిమాయత్‌నగర్‌లో సి.పి.ఐ. రాష్ట్ర కార్యాలయం మఖ్దూమ్ భవన్ నిర్మించారు.

# నేడు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం




క్యాన్సర్ గురించి అవగాహన పెంపొందించడానికి, దాని నివారణ, గుర్తింపును, చికిత్సను ప్రోత్సహించేందుకు ప్రతీయేట ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ రోజును యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ చే స్థాపించబడింది, 2008లో వ్రాసిన వరల్డ్ క్యాన్సర్ డిక్లరేషన్ లక్ష్యాలకు మద్దతుగా ఉంది. 2020 నాటికి క్యాన్సర్ వల్ల అనారోగ్యం, మరణం గణనీయంగా తగ్గించటమే దిని లక్ష్యం. ప్రపంచ క్యాన్సర్ డే లక్ష్యం ప్రజల్లో అవగాహన పెంచడం తద్వారా క్యాన్సర్ కళంకం తగ్గించడం. క్యాన్సర్తో బాధపడుతున్నవారికి మద్దతు ఇవ్వడానికి ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంలో అనేక కార్యక్రమాలు అమలులో ఉన్నాయి. ఈ ఉద్యమాలలో ఒకటి నో హెయిర్ సెల్ఫీ అనే గ్లోబల్ కదలిక, భౌతికంగా లేదా వాస్తవంగా క్యాన్సర్ చికిత్సకు గురయ్యే వారికి ధైర్య చిహ్నంగా ఉండటానికి వారి తలలకు గుండు గియించుకుంటారు. పాల్గొనే వారి చిత్రాలను సోషల్ మీడియాలో భాగస్వామ్యం చేస్తారు. స్థానికంగా కూడా పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు.

# మంథని మున్సిపల్ బిఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించిన పుట్ట మధు

మంథని మున్సిపాలిటీ బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులనుబిఆర్ఎస్ మంథనినియోజకవర్గ ఇంచార్జ్ పుట్ట మధూకర్ మంగళవారం ప్రకటించారు. బిఆర్ఎస్ శ్రేణులు కలిసికట్టుగా పనిచేసి 13 మంది అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 1వ వార్డు అభ్యర్థిగా గంధం ఆంజనేయులు, 2వ వార్డు అభ్యర్థిగా ఆరెపల్లి కుమార్, 3వ వార్డు అభ్యర్థిగా మాచీడి రాజుగౌడ్, 4వ వార్డు అభ్యర్థిగా బడికల లావణ్య శ్రీనివాస్, 5వ వార్డు అభ్యర్థిగా అంబటి నర్సింగ్, 6వ వార్డు అభ్యర్థిగా కాయితీ జ్యోతి సమ్మయ్య, 7వ వార్డు అభ్యర్థిగా మంథని సంధ్య హరీష్, 8వ వార్డు అభ్యర్థిగా కొత్త పద్మ, 9వ వార్డు అభ్యర్థిగా దాసరి పుష్ప మల్లేష్, 10వ వార్డు అభ్యర్థిగా బండారి సమ్మయ్య, 11వ వార్డు అభ్యర్థిగా పుప్పాల తిరుపతి, 12వ వార్డు అభ్యర్థిగా పూదరి లావణ్య సాగర్, 13వ వార్డు అభ్యర్థిగా మంథని విజయ్ కుమార్ లను ఎంపిక చేసి ప్రకటించారు.

# నల్గొండ జిల్లాలో దారుణం లిఫ్ట్ ఇచ్చిన వ్యక్తిపై కత్తితో దాడి



నల్గోండలో దారుణ ఘటన. లిఫ్ట్ ఇచ్చిన కారు యజమానిపై దుండగుడు కత్తితో దాడి చేసాడు. నల్గొండ జిల్లా కేంద్రం నుండి వ్యక్తిగత పని నిమిత్తం ఇమ్రాన్ తన కారులో హైదరాబాద్ బయలుదేరాడు. మార్గమధ్యలో నార్కెట్పల్లి వద్ద లిఫ్ట్ అడిగిన ఒక గుర్తు తెలియని వ్యక్తిని కారులో ఎక్కించుకున్నాడు. చిట్యాల సమీపానికి చేరుకోగానే, ఇమ్రాన్ మెడ, శరీరంపై కత్తితో దాడి చేసి, అతని సెల్ ఫోన్, నగదు లాక్కునేందుకు దుండగుడు ప్రయత్నించాడు. తీవ్రంగా గాయపడిన ఇమ్రాన్ ప్రతిఘటించడంతో, భయంతో అక్కడి నుండి పారిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న ఇమ్రాన్ను స్థానికులు గమనించి 108 అంబులెన్స్లో ఆసుపత్రికి తరలించారు.

## మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ఉపసంహరణ భద్రత ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ డి.జానకి



మహబూబ్నగర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం నామినేషన్ ఉపసంహరణ, బీ?ఫారం సమర్పణ ప్రక్రియ కొనసాగుతున్న దృష్ట్యా, మహబూబ్నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, మహబూబ్నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి, భద్రతా విధుల నిర్వహణపై పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నామినేషన్ ఉపసంహరణ మరియు బీ?ఫారం సమర్పణ ప్రక్రియ పూర్తిగా ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని రకాల ముందస్తు భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అభ్యర్థులు, వారి అనుచరులు మరియు ప్రజలు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. నామినేషన్ ఉపసంహరణ, బీ?ఫారం సమర్పణకు చివరి రోజు కావడంతో, ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్శనలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య మరియు ఇతర సిబ్బంది ఉన్నారు.

# మంథని మాజీ శాసనసభ్యుడు చంద్రుపట్ల రాంరెడ్డి మృతి

### –ఈ నెల5న ముత్తారం మండలం సీతంపల్లిలోని వారి వ్యవసాయ క్షేత్రంలో జరగనున్న అంత్యక్రియలు

### –సంతాపం ప్రకటించిన వివిధ పార్టీల నాయకులు, నియోజకవర్గ ప్రజలు



మంథని మాజీ శాసనసభ్యుడు చంద్రుపట్ల రాం రెడ్డి(80) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం హైదరాబాద్ లోని ఆయన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. అనారోగ్యం కారణంగా నెల రోజులుగా ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ ఆయన మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే రాం రెడ్డి పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామంలో 18 మార్చి1947లో చంద్రుపట్ల వెంకటరెడ్డి–అనసూయమ్మ దంపతులకు జన్మించారు. రాంరెడ్డికి ఇద్దరు కుమారులు ఆయన పెద్ద కుమారుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి తండ్రిని ఆదర్శంగా తీసుకొని రాజకీయాలపై ఆసక్తితో విదేశాలలో ఉన్నత ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఇప్పుడు బిజెపి మంథని నియోజకవర్గం ఇన్చార్జిగా, రాష్ట్ర నాయకుడిగా పనిచేస్తున్నారు. ఆయన చిన్న కుమారుడు అనిల్ రెడ్డి విదేశాల్లోనే స్థిరపడ్డాడు. రాంరెడ్డి ముత్తారం మండలం ఖమ్మంపల్లి సర్పంచ్ గా రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టి ముత్తారం ఎంపీపీగా, మంథని శాసనసభ్యునిగా ఎదిగారు. 1994 నుండి 1999వరకు తెలుగుదేశం పార్టీ తరపున మంథని శాసనసభ నియోజకవర్గం నుండి రాంరెడ్డి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించాడు. తెలుగుదేశం పార్టీతో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన రాంరెడ్డి, 1994లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున మంథని శాసనసభ నియోజకవర్గం నుండి పోటిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దుద్దిల్ల శ్రీపాద రావుపై 21,155 ఓట్ల మెజారిటీతో గెలుపొంది తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టాడు. శ్రీపాదరావు మరణానంతరం 1999లో జరిగిన ఎన్నికల్లో దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చేతిలో 15,271 ఓట్ల తేడాతో ఓడిపోయారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం తరువాత కెసిఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలో చేరాడు. టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి 2021 ఏప్రిల్ 3న తన కుమారుడు చందుపట్ల సునీల్ రెడ్డితో కలిసి బిజేపిలో చేరాడు. ముఖ్యంగా రైతుల కష్టాలు, గ్రామీణాభివృద్ధి అంశాలపై ఆయన చూపిన చిత్తశుద్ధి ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసింది. పదవుల కంటే ప్రజలే ముఖ్యమని నమ్మిన నేతగా, రాజకీయాలకు మానవత్వాన్ని జోడించిన వ్యక్తిగా రాంరెడ్డి గుర్తుండిపోతారు. రైతు పక్షపాతిగా, ప్రజల మనిషిగా ఆయన సంపాదించిన గౌరవం అపారమైనది. మంచితనానికి మారుపేరుగా నిలిచిన ఆయన ఇక లేరన్న నిజం మంథని ప్రజలకు తీరని లోటుగా మారింది. రామ్ రెడ్డి భౌతికకాయాన్ని బుధవారం మంథనికి తీసుకురానున్నారు. గురువారం ఉదయం అంతక్రియలను ముత్తారం మండలం సీతంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వారి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించనున్నారు. ఆయన చిన్న కుమారుడు అనిల్ రెడ్డి అనారోగ్యంతో ఉన్న తండ్రిని చూసి సోమవారం రాత్రి హైదరాబాదు నుండి అమెరికాకు బయలుదేరి వెళ్లారు. అంతలోనే మంగళవారం ఉదయం తండ్రి మృతి చెందడంతో మళ్లీ ఆయన అమెరికా నుండి తిరిగి హైదరాబాదుకు తిరిగి వచ్చిన తర్వాత గురువారం అంత్యక్రియలు చేయనున్నారు. రాంరెడ్డి మృతి పట్ల నియోజకవర్గ ప్రజలు, వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలియజేశారు.

# వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో త్రిముఖ పోటీ.

### వేములవాడ మున్సిపల్ పీఠంపై ఎగిరేది ఏ జెండా నో.
### ఊబందుకున్న ప్రచార పర్వం.
### పోటీలో నువ్వాబినేనా అనే రీతిలో ప్రచారం.

**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో ప్రధాన ఘట్టం ఎన్నికల నామినేషన్ల ఉపసంహారణ మంగళవారం సాయంత్రం మూడు గంటల తో ముగియడంతో మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల వివరాలు పూర్తిగా తెలియడం జరిగింది. ఏ పార్టీ నుండి ఏ అభ్యర్థి ఎన్నికల క్షేత్రంలో ఉన్నారో తేటతెల్లమైంది. వేములవాడ మున్సిపాలిటీలో మొత్తం 28 వార్డులు ఉండగా 40,000 పైచిలుకు ఓటర్లు ఉన్నారు. మున్సిపల్ ఎన్నికలలో 150 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేయగా, బుధవారం రోజున 37 మంది అభ్యర్థులు వివిధ కారణాలతో తమన్నమినేషన్లను ఒక సమరించుకున్నారు. ప్రస్తుతం వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, ఇండిపెండెంట్ అభ్యర్థులు మొత్తం కలిసి 113 మంది బరిలో నిలిచారు. అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ పార్టీ, భారతీయ జనతా పార్టీ తమ తమ అభ్యర్థులను అన్ని వార్డులలో ఎన్నికల పోటీలలో నిలపడం జరిగింది. పోటీలో ఉన్న అభ్యర్థులు తమ మంది మార్బలంతో గడప గడపకు తిరుగుతూ ప్రచారాన్ని ఉధృతం చేస్తూ తమకే ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. మీ సమస్యలు, మా సమస్యలుగా పరిష్కరిస్తామని, వార్డులలో అభివృద్ధిని వేగంగా చేస్తామని, పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్లకు వివరిస్తున్నారు. అన్ని పార్టీల అగ్ర నాయకులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు అస్త్ర శాస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు. మూడు ప్రధాన పార్టీలలో కొంతమంది ఆశావాహులు తమకు టికెట్ నిరాకరించడంతో తీవ్ర నిరాశ నిస్పృహాలో ఉన్నారు. కొంతమంది టికెట్ నిరాకరించినందుకు ఇండిపెండెంట్గా బరిలో నిలవడానికి సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. మరి కొంతమంది ఆశావాహులు తమకు టిక్కెట్ కేటాయించకపోవడంతో వెంటనే పార్టీలు మారి ఇతర పార్టీలలో చేరి టికెట్లు దక్కించుకున్నారు. 24 గంటల లోపు నామినేషన్ల ఉపసంహారణకు సమయం ముగుస్తుంది అనగా వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన శాతరాజు పల్లి ఒకటో వార్డు నుండి పోటీ చేస్తున్న రేగుల లత బిరాజేశం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి సోమవారం సాయంత్రం వెంటనే బిఆర్ఎస్ పార్టీలో చేరి బి ఫాం దక్కించుకొని బిఆర్ఎస్ పార్టీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీల నుండి రాజీనామా చేసి వెళ్లిపోవడం జరిగినది, ఇతర పార్టీల నుండి ఈ పార్టీలలో ఆశావాహులు చేరడం జరిగినది.

వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాలుగవ వార్డులో కాంగ్రెస్ పార్టీ తరఫున టికెట్ ఆశించిన తోటరాజు కాంగ్రెస్ పార్టీపై అలక భూనీ సోమవారం ఉదయం 8:30 నుండి తన సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి కుటుంబ సభ్యులకు తెలియకుండా, పార్టీ క్యాడర్ కు అందుబాటులో లేకుండా పోయినాడు. దీనితో అతని కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి వేములవాడ పోలిస్తే స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. దీనితో పోలీసులు ఒకవైపు, కుటుంబ సభ్యులు మరొకవైపు, కాంగ్రెస్ పార్టీ క్యాడర్ మరొకవైపు అతని ఆచూకీ కనుగొనడానికి తీవ్రంగా శ్రమించవలసి వచ్చింది. చివరకు అతనికి నాలుగో వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడానికి బీఫామ్ ఇవ్వడం జరిగింది. దీనితో అతని మిస్సింగ్ సుఖాంతమైంది. అదే నాలుగవ వార్డులో కోలుకాని రాజు కు గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అతనికి టికెట్ కేటాయిస్తే విజయం తప్పక వరిస్తుందని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం భావించింది కానీ స్థానికంగా జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకొని తోటరాజుకు టికెట్ కేటాయించడం జరిగింది. అలాగే మూడు ప్రధాన పార్టీల అగ్ర నాయకత్వం వేములవాడ మున్సిపల్ పరిధిలో ఒక్క ముస్లిం మైనార్టీ కి కూడా ఒక్క సీటు కూడా కేటాయించకపోవడంతో ఆ వర్గం తీవ్ర నిరాశల్లో మునిగిపోయింది. ముస్లిం మైనార్టీ ఓట్లు కావాలి కానీ, ముస్లింలకు సీట్లు కేటాయించరా అని ఆ వర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మూడు ప్రధాన పార్టీల నాయకులు వేములవాడ మున్సిపాలిటీ పై జెండా ఎగురవేయాలని ఎదుటి పార్టీల ఎత్తులకు, పైఎత్తులు వేస్తూ ఓటర్లను ఆకర్షించే పనిలో నిమగ్నమై ఉన్నారు.

అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షం బి ఆర్ ఎస్ పార్టీ వేములవాడను అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహించారని, వేములవాడ మున్సిపల్లో అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగలేదని, దానికి కారణం కాంగ్రెస్, బి ఆర్ ఎస్ అని, ఒక్క అవకాశం బీజేపీ పార్టీకి ఇస్తే కేంద్రం నుండి నిధులు తెచ్చి వేములవాడ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటు అందజేస్తామని బిజెపి కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నాడు.

అధికారంలో ఉన్న, వేములవాడను అభివృద్ధి చేస్తాం, వేములవాడ రూపు రేఖలు మారుస్తాం, అంటూ వేములవాడ శాసనసభ్యుడు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాడు.

గతంలో వేములవాడ మున్సిపల్ పీఠం బిఆర్ఎస్ పార్టీ ఆధీనంలో ఉన్నప్పుడే వేములవాడ అభివృద్ధికి కెసిఆర్, కేటీఆర్, వేములవాడ మాజీ శాసనసభ్యుడు చెన్నమనేని రమేష్ బాబు ఆధ్వర్యంలో అభివృద్ధికి బీజం వేశామని, మళ్లీ బిఆర్ఎస్ పార్టీకి అధికారమిస్తే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ఆ పార్టీ శ్రేణులు, ఆ పార్టీ నాయకులు ఓటర్లకు విన్నవిస్తున్నారు.

ఏది ఏమైనా వేములవాడ మున్సిపల్ పీఠం పై ఏ పార్టీ జెండా ఎగుర నున్నదో ఫిబ్రవరి 13వ తేదీ రాత్రి వరకు వేచి చూడవలసిన అవసరం ఎంతైనా ఉంది. అప్పటివరకు వేములవాడ మున్సిపల్ ఓటర్లు నిరీక్షించక తప్పదు.

## పంట ఉత్పత్తుల కొనుగోలు కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి
### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 03 :** జిల్లాలో వరి ధాన్యం,పత్తి పంటల కొనుగోలు కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)పి.చంద్రయ్య తో కలిసి జిల్లా పౌరసరఫరాలు,వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, మెప్మా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో వరి ధాన్యం, పత్తి పంటల కొనుగోలు కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మద్దతు ధరతో పంట కొనుగోలు చేస్తుందని తెలిపారు.ఈ క్రమంలో జిల్లాలో పత్తి పంట దిగుబడి అంచనా వేయాలని,తదనగుణంగా కొనుగోలు కొరకు ఏర్పాటు చేయాలని తెలిపారు.వ్యవసాయ విస్తరణ అధికారులు కొనుగోలు ప్రక్రియలో భాగంగా రైతులకు టోకెన్లు జారీ చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా కొనుగోలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లాలో 1 లక్ష 23 వేల ఎకరాలను పత్తి సాగు చేసే అవకాశం ఉందని, పంట దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కొరకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. 2 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని, జిల్లాలోని రైస్ మిల్లులకు 1 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉందని తెలిపారు.పంట ఉత్పత్తులను రైతుల వద్ద నుండి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేసి సకాలంలో సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో పంట ఉత్పత్తుల కొనుగోలు కొరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని,కేంద్రాల ఏర్పాటులో నిబంధనలను పాటించాలని తెలిపారు. పంట విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని, టార్పాలిన్లు,గోనె సంచులు, తేమ, తూకం యంత్రాలు అవసరమైన మేర సమకూర్చాలని, హమాలీల సంఖ్య అనుగుణంగా ఉండేలా పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హత గల రైతులకు అందించేందుకు కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా సహకార అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి
### సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 03 :** ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ-ఉట్నూర్ అధికారి యువరాజ్ మార్మాట్ తెలిపారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలు(బాలికలు),లక్షెట్టిపేట,జన్నారం గిరిజన ఆశ్రమ పాఠశాలలు (బాలూరు)లను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం,భోజనం,ఇతర సదుపాయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ... పాఠశాలలలో,వసతి గృహాలలో నెలకొన్న సమస్యలు,మెనూ ప్రకారం భోజనం పంపిణీ,ఆహారం రుచి,మెనూ అమలు వివరాలు తెలుసుకొని,తరగతి గదిలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు వండిన ఆహారం రుచిని తెలుసుకొని,కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించి,ఆరోగ్య కార్యకర్తలతో లతో ఐ.టి.డి.ఎ. పల్స్ యాప్ పని తీరుపై ఆరా తీశారు. పల్స్ యాప్ పై ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతి రోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని ప్రిన్సిపల్,సంక్షేమ అధికారి, కామాటీ,వంట పని వారు, పారిశుద్ధ్య, మల్టీపర్పస్ వర్కర్లకు సూచించారు.సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా వసతి గృహ పరిసరాలలో నిత్యం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.ప్రతి రోజు వంటగది, స్టోర్ రూమ్,త్రాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ప్రతి విద్యార్థికి చదవడం,రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ ఎన్నికల భద్రతపై డీజీపీ దృశ్య సమీక్ష
### ఎక్సైజ్, ఎన్నికల చట్టాలపై పోలీసు అధికారులకు లీగల్ అవగాహన.
### సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా.




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 3(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, ఐపీఎస్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా ఎస్పీలు పోలీస్ కమిషనర్లతో దృశ్య సమీక్ష సమావేశం నిర్వహించారు,జిల్లా పోలీస్ కార్యాలయం నుండి జిల్లా అదనపు ఎస్పీ రఘునందన్ రావ్ జిల్లాలోని పోలీస్ అధికారులతో కలిసి దృశ్య సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు,ఎన్నికలను పూర్తిగా శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి పోలీసు అధికారి పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని డీజీపీ ఆదేశించారు,ఈ సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ నామినేషన్ దశ నుంచి పోలింగ్, కౌంటింగ్, ఫలితాల అనంతరం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు,గత ఎన్నికల్లో నేరచరిత్ర కలిగిన వారు, రౌడీషీటర్లను సత్ ప్రవర్తన కోరుతూ ముందస్తుగా బైండోవర్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండల, పోలీస్ స్టేషన్ వారీగా సమస్యాత్మక మరియు అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల రోజు మరియు కౌంటింగ్ రోజున ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు,విజేత ర్యాలీలపై కూడా ముందస్తు




నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచించారు,ఎక్సైజ్ / మున్సిపల్ ఎన్నికల చట్టాలపై లీగల్ రాష్ట్ర పోలీసు లీగల్ అడ్వైజర్ ఏపూరి రాములు చే పోలీసు అధికారులకు ఎక్సైజ్ చట్టాలు, మున్సిపల్ ఎన్నికల నిబంధనలపై సమగ్ర అవగాహన కల్పించారు,ఎన్నికల సమయంలో అక్రమ మద్యం తయారీ, నిల్వ, రవాణా,అమ్మకాలకు సంబంధించిన నేరాలపై కఠినంగా వ్యవహరించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు తావు లేకుండా చట్టపరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు,చట్ట పరిధిలోనే సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఎన్నికల స్వచ్ఛతను కాపాడాల్సిన బాధ్యత పోలీసులదేనని ఆయన తెలిపారు,ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రఘునందన్ రావ్,ఎస్బీ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, ఎలెక్షన్ సెల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి, సదా నాగరాజు, ఎలెక్షన్ సెల్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## షాపూర్ లో గ్రామ సంఘం బిల్డింగు భూమి పూజ చేసిన సర్పంచ్, ప్రమీల భాయ్ పాండు నాయక్,



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఫిబ్రవరి 3(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం షాపూర్,గ్రామపంచాయతీలో నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచ్ ప్రమీల బాయ్, పాండు నాయక్, సమక్షంలో ఎంపీడీవో నర్సరీని సందర్శించడం జరిగినది కొత్తగా నిర్మిస్తున్న గ్రామ సంఘం బిల్డింగు పది లక్షలతో మంజూరైనటువంటి భవనానికి సర్పంచ్ పూజ చేసి టెంకాయ కొట్టి ప్రారంభోత్సవం చేయడం జరిగినది కాంగ్రెస్ ప్రభుత్వం తోనే గ్రామాలు అభివృద్ధి ఎన్నో రోజుల కల ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో నెరవేరడం అదృష్టంగా భావిస్తున్నామని గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు వెనువెంటనే ఒక్కొక్కటిగా అభివృద్ధి చేసే దిశగా గ్రామాన్ని ముందుకు తీసుకెళ్తామని గ్రామ సర్పంచ్ ప్రమీల భాయ్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఏపీఓ అంజిరెడ్డి , పంచాయతీ కార్యదర్శి రాములమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ బాలయ్య , సీనియర్ యువ నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

# డైరెక్టర్ విజిలెన్స్ ను కలసిన బి.ఆర్.ఎస్ నాయకులు





Bharatha Rashtra Samithi
Manikonda Muncipality, Gandipet Mandal, R.R. District
Plot no: J4, Road no.5 C/E, Panchavati colony, Manikonda - 500089

Dated the 3rd Feb 2026
To
The Director General,
Vigilance and Enforcement,
Govt of Telangana,
Hyderabad.

Respected Madam,

Sub:- Inquiry into the alleged irregularities from 2019 to 2025 five year term of the erstwhile Manikonda Municipality **causing huge revenue loss** – Regarding.

...

It is to bring to your kind notice that during the tenure of Municipal Council, Manikonda, for the period from 2019 to 2025, there were several alleged irregularities reported which need to be thoroughly inquired and action taken against the errant. In this connection it is submitted that

1. As per TS Municipal Act both the Chairperson and Commissioner are responsible for drafting the Agenda for the council meetings and during their tenure of five years from 2019 t0 2025, Manikonda Municipal Council has failed in drafting the Agenda.There was a huge Revenue loss to Manikonda Municipality on account of failure to draft the Agenda and in turn no discussions and resolutions in the Municipal Council. The following are some of the issues where neither the Agenda was there nor any resolution passed to recover the losses. Thereby the Municipal Council was responsible for loss of revenue to the ex-chequer which is a serious administrative lapse.
   i) Lists of vacant lands for levying the taxes
   ii) Lists of demolitions to be taken up for illegal structures and levying penalty and cost of recovery of demolitions
2. **Giving Occupancy certificates to the illegal constructions identified and partly demolished:** In fact, in the first instance all illegal constructions identified should be placed before the Council and resolution should be passed for demolition. But whereas neither it was placed in the council nor the costs recovered from the illegal constructions. Also, the partly demolished buildings were issued with OCs which is another serious administrative lapse for not taking up the same for discussion in the council where huge financial loss was sustained to the Municipality.

Director
Peshi
3/2/26


**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 3 ఫెబ్రవరి 2026**మణికొండ మున్సిపల్ కౌన్సిల్లో గడచిన ఐదు సంవత్సరాల్లో జరిగిన పలు అవకతవకల కారణంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడిన విషయాన్ని డైరెక్టర్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఏ.ఆర్ శ్రీనివాస్ ఐ.పీ.ఎస్ ని కలిసి వివరించి, ఆపై పలు అంశాలపై సమగ్ర విచారణ జరిపి సంబంధిత వారిపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని వినతి పత్రం సమర్పించడం జరిగింది. ముఖ్యంగా నెమలి నగర్ లో ప్రభుత్వ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అక్కడ ఉన్న పలు ఇండ్లకు ఇంటి నెంబర్లు ఇవ్వని కారణంగా ఆస్తి పన్ను రూపంలో ఖజానాకు భారీ గండి పెట్టడం జరిగింది. ఇక టీ.డీ.ఆర్లు మరియు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ విషయంలో భారీగా జరిగిన అవకతవకలను, అట్లాగే ఇంజనీరింగ్ విభాగంలో జరిగిన భారీ కుంభకోణాలను, ఐదు కోట్ల అంచనాతో మున్సిపల్ ఆఫీస్ బిల్డింగ్ కి టెండర్లు పిలిచి బిల్డింగ్ పూర్తయ్యే సమయానికి 250 శాతం పెరిగి అనగా 18.50 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం, లక్ష్మీ నగర్ - అంజలి గార్డెన్స్ రోడ్డు నిర్మాణంలో జరిగిన అవకతవకలను ఇత్యాది విషయాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని మణికొండ బి..ఆర్.ఎస్ పార్టీ కోరడమైనది. ఇట్టి కార్యక్రమంలో స్థానిక అధ్యక్షుడు సీతారం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీద నరేందర్, బొమ్ము ఉపేందర్నాథ్ రెడ్డి, అందె లక్ష్మణ్ రావు, గోరుకంటి విఠల్, భానుచందర్, జైరామ్, షేక్ ఆరిఫ్, సుమ నళిని, బాబురావు, సయ్యద్ రఫీక్, మంజుల, దేవి ప్రియా, బాలాజీ, వీరు సింగ్, ఎర్రోళ్ల నగేశ్, మొహమ్మద్ దస్తగిరి పాల్గొనడం జరిగినది.

# మున్సిపల్ ఎన్నికలు--2026: మైక్రో అబ్జర్వర్లకు ప్రత్యేక శిక్షణ



**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఫిబ్రవరి 03:**మున్సిపాలిటిలు, మున్సిపల్ కార్పొరేషన్ల సాధారణ ఎన్నికల 2026లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలో ఎన్నికల సందర్భంగా పోలింగ్ నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని ఆదిశగా విధులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా సాధారణ పరిశీలకులు కొర్ర లక్ష్మి తెలిపారు.

మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశీలికులు మాట్లాడుతూ పోలింగ్ రోజున పోలింగ్ బూతులలో ఎన్నికల ప్రక్రియ జరుగుతున్న విధానాన్ని జాగ్రత్తగా పరిశీలించి విధులను సమర్థవంతంగా నిర్వహించాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. పోలింగ్ బూతులో చెక్ లిస్ట్ ప్రకారం పరిశీలన చెసుకోవాలని అలాగే పోలింగ్ బూతు లోపల, బయట నిరంతరం సూక్ష్మ పరిశీలన చేస్తుండాలని తెలిపారు. పూర్తి స్థాయి లో శిక్షణ తీసుకొని సమర్థవంతంగా విధులు నిర్వహించాలని, ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే క్లియర్ చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మైక్రో అబ్జర్వర్లు జనరల్ అబ్జర్వర్ల ఆధ్వర్యంలో పని చేయాల్సి ఉంటుందని, ప్రతి పోలింగ్ బూతు కి ఒక మైక్రో అబ్జర్వర్ నియమించడం జరుగుతుందని, విధులు నిర్వహించే సమయంలో తప్పకుండ గుర్తింపు కార్డు ధరించి ఉండాలని సూచించారు. పోలింగ్ ముందు రోజే మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని మాక్ పోలింగ్ విధానాన్ని, ఓటర్లు ఓటింగ్ చేసే విధానం, అదేవిధంగా పోలింగ్ ఏజెంట్ల నియామకాన్ని క్షుణ్ణంగా పరిశీలన చెయాలని సూచించారు. ముఖ్యంగా పోలింగ్ అధికారుల పని విధానాన్ని పరిశీలన చేయాలని తెలిపారు. ప్రతి రెండు గంటలకు ఒక్కసారి ఓటింగ్ శాతంని తెలుసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో అవాంఛిత సంఘటనలు జరిగే పరిస్థితులను గమనిస్తూ, ఏవైనా ఉంటే పై అధికారులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. పోలింగ్ అధికారి పోలింగ్ బూతు లో జరిగే అంశాలనుూూ డైరీ లో నమోదు చేస్తున్న తీరును పరిశీలిస్తూ ఉండాలని అన్నారు.



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ఏ సమయానికి ప్రారంభం, ఏ సమయానికి ముగుస్తుందో నమోదు చేయాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. పోలింగ్ బూతులో వెళ్తున్న వారికి ఓటర్ గుర్తింపు కార్డు, ఇతర సమానమైన గుర్తింపు కార్డులు ఉన్నాయా లేదా గమనించాలని అన్నారు. ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించారా లేదా చూడాలని అన్నారు. ఒకవేళ సమయం ముగిస్తే ఎంతమంది క్యూలో నిలబడి ఉన్నారో వారికి స్లిప్ లు ఇచ్చారా లేదా అని గమనించాలని సూచించారు. పోలింగ్ ముగిశాక ఫారం లు సరిగా నింపారా లేదా అనే అంశాన్ని రిపోర్ట్ లో నమోదు చేయాలని సూచించారు. తదుపరి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మైక్రో అబ్జర్వర్లు చేపట్టే విధి విధానాలపై మాస్టర్ ట్రైనర్స్ శిక్షణనిచ్చారు.

# పారదర్శకంగా పీఓ, ఏపీఓల ర్యాండమైజేషన్ ప్రక్రియ



**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఫిబ్రవరి 03:**మున్సిపాలిటిలు, మున్సిపల్ కార్పొరేషన్ల సాధారణ ఎన్నికల 2026లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలో ఎన్నికల సందర్భంగా ఎన్నికల విధులు నిర్వహించుటకు గాను పిఒ, ఎపిఓలను రాండమైజేషన్ ద్వారా పారదర్శకంగా ఎంపిక జరిగింది.

మంగళవారం కలెక్టరేట్ విసి హాల్ లో సాధారణ పరిశీలకులు కొర్ర లక్ష్మి, జిల్లా కలెక్టర్ మను చౌదరిల సమక్షంలో మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలకు సంబంధించిన 68 వార్డులకు గాను 136 పోలింగ్ బూతులలో 818 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లను ర్యాండమైజేషన్ ద్వారా పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించడానికి ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, డిఈఓ విజయ కుమారి, సివిల్ సప్లై డిఎం సుగుణ బాయి, జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎఓ సుజాత పాల్గొన్నారు.

# ఇంటింటి ప్రచారం తో దూసుకెళ్తున్న 28వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నూకల రామ్మోహన్ రెడ్డి



**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 03 (ప్రజాబలం)** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో 28వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నూకల రామ్మోహన్ రెడ్డి డివిజన్ మొత్తం కలయ తిరుగుతూ ప్రజలను కలుస్తూ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు కాంగ్రెస్ పార్టీ చేసే అభివృద్ధి కార్యక్రమాలు నన్ను కౌన్సిలర్ గా గెలిపిస్తే డివిజన్ కోసం డివిజన్ అభివృద్ధి కోసం చేసే కార్యక్రమాల వివరాలను డివిజన్ ప్రజలకు తెలుపుతూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుంది ప్రచారంలో మహిళలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేస్తున్నారు ఈ కార్యక్రమంలో





కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భూక్య సురేష్ నాయక్ వెంపట రవి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారుసిపిఐ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిక సిపిఐ పార్టీ నుంచి గణపారపు వీరయ్య అభిమానులు బంధువులు స్నేహితులు కార్యకర్తలు పాల్గొన్నారు

# అంత్యక్రియలకు ఎస్ కే ఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం



**వికారాబాద్ నియోజకవర్గం ఫిబ్రవరి 3(ప్రజా బలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండల పరిధిలోని బుచన్ పల్లి గ్రామంలో బైండ్ల మణెమ్మ అనారోగ్యం తో సోమవారం మృతి చెందింది. అట్టి విషయం తెలుసుకున్న ఎస్ కే ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు.. మణెమ్మ అంత్యక్రియల నిమిత్తం 5 వేల రూపాయలు పంపించారు.. మంగళవారం ఉప సర్పంచ్ షేకులుద్దీన్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మహేందర్ గ్రామస్తులతో కలిసి మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎస్ కే ఆర్ ట్రస్ట్ నుండీ పంపించిన 5 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బక్కరెడ్డి, మల్లయ్య, శ్రీనివాస్, శేఖర్, బలప్ప, రంగప్ప, నాగేష్, నర్సింహులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

# దార్లపల్లి గ్రామంలో పరిసరాలు పరిశుభ్రత గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాలరాజు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఫిబ్రవరి 3(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం దార్లపల్లిగ్రామం లో ఎనో ఏండ్ల నుచి వున్న పాడువడ ఇంటి ముందు వున్న చెట్టు లు కంప పొదలు తి పిస్తున్న గ్రామ పెద్దలతో కలిసి తీపించడం జరుగుతుందని సర్పంచ్ తలారి దుర్గమ్మ బాలరాజు తెలిపారు

# పదవ తరగతి పరీక్షల పై విద్యార్థులకు అవగాహన సదస్సు...





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 3(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/సంగారెడ్డి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం మరియు ధనిక్ భారత్ విద్యా సంస్థల సంయుక్త నిర్వహణలో పదవ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు బాలలత ఐఏఎస్ మోటివేషన్ మరియు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కొండాపూర్ మండలం మల్లాపూర్ గ్రామ పరిధిలో ఉన్న గోకుల్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఈ కార్యక్రమానికి ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 32 పాఠశాలల నుండి పన్నెండు వందల మంది విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి విద్యాసాగర్ మరియు ధనిక్ భారతి విద్యా సంస్థల డైరెక్టర్లు శ్రీమతి బాలలత, అజయ్, గిరిబాబు పాల్గొన్నారు. శ్రీమతి బాలలత ఎందరో ఐఏఎస్ లను తయారు చేస్తున్న వ్యక్తి రాష్ట్ర వ్యాప్తంగా అనేక మోటివేషనల్ సెమినార్లను నిర్వహిస్తున్నారు,సంగారెడ్డిలోని పదవ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు వత్తిడి లేకుండా ఎలా చదువుకోవాలి, ప్రణాళిక ఏవిధంగా చేసుకోవాలి మరియు భవిష్యత్తులో ఎలాంటి కోర్సులు చేయాలి అని తమయొక్క సెషన్లో తెలియజేసినారు,ఈకార్యక్రమంలో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర సలహాదారు లింగాగౌడ్,ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రశాంత్ కుమార్, జిల్లా అధ్యక్షులు వెంకటేషం, జిల్లా కార్యదర్శి ఆంథోని రెడ్డి, జిల్లా కోషాధికారి నాగేశ్వర్ మరియు వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్స్, అధ్యాపక బృందం పాల్గొన్నారు. వక్తలంతా పదవ తరగతి విద్యార్థులకు తమ అనుభవంతో కూడిన సూచనలు సలహాలు చెప్పి పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించి తమ తల్లిదండ్రులకు పాఠశాలకు మరియు సంగారెడ్డికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

# నేడే వేములవాడకు బండి సంజయ్ రాక, కేంద్రమంత్రి మున్సిపల్ ఎన్నికల ప్రచారం.

### రాజన్న ఆలయ అభివృద్ధిపై బీజేపీ మండిపాటు.
### ఆగమశాస్త్రం పాటించకపోతే ఊరుకోం.
### వేములవాడలో బండి సంజయ్ కార్నర్ మీటింగ్స్.. విజయవంతం చేయాలని ప్రతాప రామకృష్ణ పిలుపు.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** వేములవాడలో మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ వేములవాడ రాజకీయాలు ఒక్కసారిగా పుంజుకున్నాయి. కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పర్యటన వేములవాడ పట్టణంలో బుధవారం ఖరారు అయినట్లు బిజెపి రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప్ రామకృష్ణ తెలిపారు. మంగళవారం రోజున వేములవాడ పట్టణంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పనుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయ విస్తరణ మరియు నిర్మాణ ప్రక్రియలు ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా జరుగుతున్నాయని, ఇది హిందూ మనోభావాలను దెబ్బతీయటమేనని మండిపడ్డారు. శృంగేరి పీఠాధిపతి నిర్దేశించిన విధంగా నిర్మాణాలు సాగడం లేదని తమ దృష్టికి వచ్చిందని, భక్తుల నమ్మకాలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

బుధవారం రోజున వేములవాడ పట్టణంలోని అంజనీ నగర్ మరియు మహంకాళి చౌరస్తా వద్ద నిర్వహించే రెండు కార్నర్ సమావేశాలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాజరవుతారని, పార్టీ శ్రేణులు మరియు వేములవాడ పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ పర్యటనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వేములవాడ పట్టణ బిజెపి అధ్యక్షులు రాపల్లి శ్రీధర్, నామాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# 8వ వార్డులో బిఆర్ఎస్ ఇంటింటి ప్రచారం







**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 3(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సదాశివపేట/2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని 8వ వార్డు నుంచి బిఆర్ఎస్ తరపున బరిలో కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొత్తగొల్ల సోమశేఖర్ 8వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు,ప్రచారంలో భాగంగా కొత్తగొల్ల సోమశేఖర్ మాట్లాడుతూ అవకాశం ఇస్తే ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తాను,అంతేకాకుండా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే నా లక్ష్యం అని తెలిపారు,ముఖ్యంగా వార్డు అన్ని రంగాల్లో అభివృద్ధి చేందేలా వార్డు అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు,మున్సిపల్ ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు కారు గుర్తుకి వేసి తనకు మద్దతు ఇచ్చి

# అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం...




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 3(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంగారెడ్డి ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా ప్రాంగణం సంగారెడ్డిలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది,ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య గారు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు,ఆమె మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వేగంగా వ్యాపిస్తున్న ప్రాణాంతక వ్యాధిగా మారిందని తెలిపారు. అయితే కేన్సర్ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి సరైన వైద్య చికిత్స తీసుకుంటే పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా మహిళలు మరియు యువత ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు,ఈ సందర్భంగా వైద్య నిపుణులు మరియు అధ్యాపకులు కేన్సర్ వ్యాధి లక్షణాలు,కారణాలు,నివారణ చర్యలు మరియు ప్రారంభ దశలో గుర్తింపు యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. మహిళల్లో ఎక్కువగా కనిపించే బ్రెస్ట్ కేన్సర్ మరియు సర్వికల్ కేన్సర్ పై ప్రత్యేక అవగాహన కల్పించి,స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. అలాగే యువతలో పెరుగుతున్న మౌత్ కేన్సర్, లంగ్ కేన్సర్ వంటి వ్యాధులకు ధూమపానం మరియు పొగాకు వాడకం ప్రధాన కారణమని తెలిపారు,కేన్సర్ వ్యాధి నివారణలో ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, క్రమమైన వ్యాయామం మరియు మానసిక ఒత్తిడి నియంత్రణ ఎంతో అవసరమని నిపుణులు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు మరియు చికిత్సా సౌకర్యాల గురించి కూడా విద్యార్థులకు వివరించారు,కేన్సర్ వ్యాధి పట్ల సమాజంలో ఉన్న అపోహలు మరియు భయాలను తొలగించాల్సిన అవసరం ఉందని తెలిపారు,ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు కేన్సర్ పై అవగాహన పెంపొందించేందుకు పోస్టర్లు మరియు సమాచార పత్రాలు పంపిణీ చేయబడింది. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు మరియు సమాజానికి కేన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులు కేన్సర్ నివారణపై ప్రతిజ్ఞ చేశారు,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రజల ఆరోగ్య పరిరక్షణ, న్యాయ అవగాహన మరియు సామాజిక సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య గారు తెలిపారు,ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు,ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో కేన్సర్ వ్యాధిపై సమగ్ర అవగాహన పెంపొందించబడింది.

# వెంకటరెడ్డి నగర్ డివిజన్ లో కరిపే శంకర్ వంజరి పర్యటన: కాలనీ వాసుల సమస్యలు అడిగి తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు









**ప్రజాబలం 03 ఫిబ్రవరి :** రామంతపురం, వెంకటరెడ్డి నగర్ డివిజన్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కరిపే శంకర్ వంజరి గారు వెంకటరెడ్డి నగర్ డివిజన్ ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ముఖ్యంగా బాలక్రిష్ణా నగర్, శ్రీనివాసపురం, మరియు రాంరెడ్డి నగర్ ప్రాంతాలను సందర్శించి స్థానిక నివాసితులతో నేరుగా మాట్లాడారు. ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతో పాటు, వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ముఖ్యంగా వృద్ధులను, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పలకరించి వారికి ధైర్యం చెప్పారు. కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ, త్రాగునీరు మరియు ఇతర మౌలిక సదుపాయాల సమస్యలను స్థానికులు శంకర్ వంజరి గారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా తాము నిరంతరం కృషి చేస్తామని, ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీలో చేరికలు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 3(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/సంగారెడ్డి పట్టణ 5వ వార్డుకు చెందిన మజ్లిస్ పార్టీ నాయకులు భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీలో చేరారు,సంగారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బసిత్ (లడ్డు) 5వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి యూనిస్ ఆధ్వర్యంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సమక్షంలో వీరు అధికారికంగా బిఆర్ఎస్ పార్టీలో చేరారు,ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పార్టీ ఇన్‌చార్జి రాజనర్సు బిఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు,బిఆర్ఎస్ పార్టీలో చేరినవారు మజ్లిస్ పార్టీ 5వ వార్డు అధ్యక్షుడు షేక్ షరీఫ్‌తో పాటు సయ్యద్ జాఫర్ హుస్సిన్, సయ్యద్ సలీముద్దీన్, హాజీ,అబ్బాస్,రజిద్దీన్, రుషి, నబి, మజీద్, ఖలీల్, తాహేర్, జకీర్,ఇమ్రాన్,తలఫ్ తదితరులు కలిపి సుమారు 50 మంది బిఆర్ఎస్ పార్టీలో చేరారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ సమన్వయంతో పని చేసి బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు,ఈ కార్యక్రమంలో అర్షద్,మసూద్,సిరాజ్ హైమద్, జహీరొద్దీన్,మినిరొద్దీన్,సమీర్, మూజమిల్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# 300 కోట్లతో వేములవాడను అభివృద్ధి చేసింది మేమే.. ఓటు అడిగే హక్కు బిఆర్ఎస్ దే, చల్మెడ.

## రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో శూన్యం, వేములవాడ అభివృద్ధిపై చల్మెడ సూటి ప్రశ్న.





**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కెసిఆర్ నాయకత్వంలో వేములవాడ మున్సిపల్ పరిధిలో సుమారు 300 కోట్ల రూపాయలతో ఊహించని అభివృద్ధి జరిగిందని, అందుకే త్వరలో జరగబోయే వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో ఓటు అడిగే కేవలం బిఆర్ఎస్ పార్టీకే ఉందని వేములవాడ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు స్పష్టం చేశారు. మంగళవారం రోజున నిర్వహించిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్న కాలయాపన తప్ప చేసింది ఏమీ లేదని విమర్శించారు.

బిఆర్ఎస్ హయాంలో 90 కోట్ల రూపాయలతో గుడి చెరువు సుందరీ కరణ, 47 కోట్లతో మిషన్ భగీరథ ద్వారా 9 వేల మంచినీటి కుళాయిల కలెక్షన్లు, బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధికి 18.5 కోట్లు వెచ్చించిన ఘనత తమదేనని గుర్తు చేశారు. మిడ్ మానేరు నుండి పైపులైన్ ద్వారా గుడి చెరువును నిండుకుండల మార్చామని, రైతు బజార్, మున్సిపల్ పార్క్, వంటి ఎన్నో సౌకర్యాలు కల్పించామని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు వస్తున్నాయని ఇప్పుడు రోడ్ల పనులు చేస్తూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తుందని, వారి నిర్లక్ష్యం వల్ల పట్టణమంతా దుమ్ముతో నిండిపోయిందని మండిపడ్డారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గుడిని కూల్చడం తప్ప, ఎంత ఖర్చు చేశారు, ఏ అభివృద్ధి పని చేశారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 11వ తేదీన జరిగే వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ అసమర్థ పాలనకు తగిన బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గూడూరు ప్రవీణ్, నేలకొండ అరుణ, పొలాస నరేందర్, సిరిగిరి చందు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయంలో చురుగ్గా మహాశివరాత్రి ఏర్పాట్లు.

## లడ్డు తయారీ కేంద్రంలో విస్తృత పారిశుద్ధ్య చర్యలు.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఫిబ్రవరి నెల 14, 15,16 తేదీలలో జరుగు మహాశివరాత్రి జాతర పర్వదినాన్ని పురస్కరించుకొని రాజన్న ఆలయం మరియు భీమేశ్వరాలయంలో విస్తృత స్థాయిలో ఏర్పాటు చేపడుతున్నారు. అందులో భాగంగా రాజన్న ఆలయ లడ్డు తయారీ కేంద్రంలో మంగళవారం రోజున 15 వందలకు పైగా లడ్డు ట్రేలను వేడి నీరు మరియు సర్ఫ్ ఉపయోగించి శుభ్రపరచి పారిశుద్ధ్య చర్యలు నిర్వహించారు. ఇట్టి పనులను ఆలయ లడ్డు సత్రం ఔట్సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టగా, పనుల నాణ్యతను రాజన్న ఆలయ సీనియర్ అసిస్టెంట్ బొడ్సు మహేష్ కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

భక్తులకు పరిశుభ్రమైన లడ్డు ప్రసాదం అందించాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

## రాష్ట్ర హౌసింగ్ సెక్రెటరీ మరియు ఎం.డీ వీ.పీ.గౌతమ్





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 3 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/ఇందిరమ్మ గృహ లబ్ధిదారులందరూ నిర్దేశిత గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పటిష్టం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్యదర్శి, మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులను ఆదేశించారు,రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ కార్యదర్శి మరియు మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ.గౌతమ్ మంగళవారం జిల్లాలోని సదాశివపేట, కోహిర్ , జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోనీ గ్రామాలలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను కలిసి ఇసుక సరఫరా, బిల్లుల చెల్లింపులు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ దశలను బట్టి వెంటదివెంట బిల్లులు చెల్లిస్తున్నామని, ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు,అనంతరం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిపై హౌసింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు,ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల క్షేత్రస్థాయి పరిస్థితిని మండలాల వారీగా హౌసింగ్ ఎం.డీకి వివరించారు. జిల్లాకు 12,479 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 8081 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని, అందులో 6549 ఇండ్లు వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయని తెలిపారు,లబ్ధిదారులకు నిర్మాణ దశల వారీగా బిల్లులు వెంటవెంటనే మంజూరు చేస్తున్నామని, ఇంటి నిర్మాణం ప్రారంభించేందుకు ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా లక్ష రూపాయల వరకు రుణం అందిస్తూ నిర్మాణ పనులు చేపట్టేలా ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు,ఇప్పటికే 1930 మంది లబ్ధిదారులకు రూ.21 కోట్ల మేర రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు,ఈ సందర్భంగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డీ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ ఇందిరమ్మ లబ్ధిదారులందరూ తప్పనిసరిగా ఇల్లు కట్టుకునేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ కమిటీల సహకారం తీసుకుని అర్హులైన ప్రతి లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం చేపట్టేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరగాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులకు ఎలాంటి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు,జిల్లాలో అనేక మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల పురోగతి సంతృప్తికరంగా ఉందని, అయితే కొన్ని మండలాల్లో నిర్మాణాలు మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రౌండ్ కాని ఇళ్లను వెంటనే గ్రౌండ్ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 4,000 ఇండ్లు రూఫ్ లెవెల్లో ఉన్నాయని, వాటిని మార్చి 31లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు ఏఈలు, ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేయాలన్నారు.

మోడల్ హౌస్లు పూర్తికాని ప్రాంతాల్లో ఎంపీడీవో కార్యాలయాల్లో హౌసింగ్ ఏఈలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎంపీడీవోలు ఇందిరమ్మ ఇళ్లను సూపర్ చెక్ చేయాలని, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి నిర్మాణానికి సంబంధించిన అన్ని అంశాల్లో సరైన సలహాలు, సూచనలు ఇస్తూ మోటివేట్ చేయాలని సూచించారున్యూ టెక్నాలజీ ద్వారా తక్కువ ఖర్చుతో నిర్మించిన ఇళ్లను ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సర్పంచులు, లబ్ధిదారులకు చూపించి అపోహలను తొలగించాలని తెలిపారు,అదేవిధంగా డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కాలనీలకు సంబంధించిన అన్ని ఎంబిలు రికార్డు చేసి, లబ్ధిదారులకు స్వాధీనం చేయని ఇండ్లన్నింటిని హౌసింగ్ శాఖకు స్వాధీనం చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ ఏజెన్సీలకు ఆదేశించారు,రెండు నెలల్లోగా ఫైనల్ స్టేజీలో ఉన్న అన్ని ఇండ్లు పూర్తిచేసి, లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు,ఈ సమీక్ష సమావేశంలో హౌసింగ్ జిల్లా పీడీ చలపతిరావు, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖ డీఈలు, ఈఈలు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్.

## భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధాలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఫిబ్రవరి నెలలో జరగనున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మంగళవారం రోజున క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా భీమేశ్వర స్వామి ప్రధాన ఆలయానికి వచ్చే భక్తులు, వృద్ధులు, దివ్యాంగులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు వీల్ చైర్ సదుపాయంతో నూతనంగా ఏర్పాటు చేసే ర్యాంపును పరిశీలించారు.

అలాగే లడ్డు కౌంటర్, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, క్యూలైన్లు, చలువ పందిళ్లు, టెంట్లు, వీఐపీ రోడ్డు, టాయిలెట్స్, శివార్చన స్టేజి, నూతనంగా ఏర్పాటు చేయనున్న క్యూ లైన్లు, పార్వతీపురం ధర్మశాల రోడ్డుతో పాటు ఆలయ పరిసరాలలోని వివిధ ప్రాంతాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



భీమేశ్వర స్వామి వసతి గృహంలో ఏర్పాటు చేసిన ప్రోటోకాల్ కార్యాలయంలో 1000 రూపాయలు వేద ఆశీర్వచనం,500 రూపాయల స్పెషల్ కోడె, 300 రూపాయల స్పెషల్ దర్శనం టికెట్స్ అందుబాటులో ఉన్నట్లు అధికారుల ద్వారా తెలుసుకున్నారు.

భీమేశ్వర ఆలయంలో అదనపు కలెక్టర్ ప్రత్యేక పూజలు.

అనంతరం శ్రీ భీమేశ్వర స్వామి వారిని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం స్వామివారి మంటపంలో ఆలయ ఈవో ఎల్. రమాదేవి స్వామి వారి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి డి ఈ లు శాంతయ్య, వరప్రసాద్, ఆలయ డి ఇ లు రఘునందన్, మైపాల్ రెడ్డి, ఏ ఈ ఓ లు జయకుమారి, శ్రావణ్ కుమార్, బ్రహ్మం, శ్రీనివాస్, ఆలయ అర్చకులు, వేద పండితులు మరియు ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి వార్డును మరింత అభివృద్ధి చేస్తా...

## 13వ వార్డు బిజెపి అభ్యర్థి ఎంబడి వెంకట్ రెడ్డి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 3 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** నారాయణఖేడ్/ మున్సిపల్ లోని 13వ వార్డు ప్రజలు తనను ఆశీర్వదించి ఓటు వేయాలని వార్డును మరింత అభివృద్ధి చేస్తానని వార్డు బిజెపి పార్టీ అభ్యర్థి ఎంబడి వెంకట్ రెడ్డి తెలిపారు,మంగళవారం బిజెపి పార్టీ తరఫున బీఫామ్ ను మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి అందజేశారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే చిత్తశుద్ధితో వార్డు బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

# వరంగల్ జిల్లాలో మందుబాబుల వీరంగం

వరంగల్ నగరం మట్టేవాడలో మందుబాబులు వీరంగం సృష్టించారు. మద్యం మత్తులో మైనర్ బాలికను కిడ్నాప్కు ప్రయత్నించారు. అడ్డుకున్న స్థానికులపై దురుసుగా ప్రవర్తించారు. స్థానికులు అడ్డుకోవడంతో మరో కారులో పరారీకి ప్రయత్నించారు. దాంతో స్థానికులు వారిని అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. మద్యం మత్తులో వున్న యువకులు పోలీసులపై కూడా దురుసుగా ప్రవర్తించారు. మట్టేవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com